ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital

దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు 5
గొర్రెల పంపిణీస్కాం: మాజీ మంత్రికి ఇడి నోటీసులు 7

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 183 పేజీలు: 8+16 వెల: 8.00

## 3కు చేరువలో భారత్

### స్వదేశీ ఆయుధాలతో 'సిందూర్' సక్సెస్



వారణాసిలో శనివారం ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

### భారత్ శత్రువులు భూగర్భంలో కూడా ఉండకూడదు

### 'ఉగ్ర' మద్దతుదారులే ఏడుస్తున్నారు: ప్రధాని మోడీ

**వారణాసి, ఆగస్టు 2:** ఆధునిక భారత దేశం శత్రుదేశాలకు కాలభైరవుడు అవుతాడని ప్రధాని మోడీ అన్నారు. తన స్వంత నియోజకవర్గం వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. భారత దేశ శత్రువులు భూగర్భంలో కూడా బ్రతికి ఉండరాదు అని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ గురించి ఆయన ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ వైఖరిని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పేర్కొన్న కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. తాజాగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ పరిణీతి షిండే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌ను ఎవరైనా తమాషా అని పిలుస్తారా అని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వల్ల విపక్ష నేతలకు కడుపు నొప్పి పుడుతోందన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామన్న వాస్తవాన్ని కాంగ్రెస్ కానీ, దాని మిత్రులు జీర్ణించుకోలేక పోతున్నట్లు చెప్పారు. విశ్వనాథుడి ఆశీర్వాదంతో ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రతీకారం తీర్చుకున్నామన్నారు. కాశీలో ఉన్న మాస్టర్లను >>2

# మోడీ మళ్లీ రాలేరు

## ఆ 15 సీట్లు రాకపోతే మోడీ ప్రధాని కాలేరు

### ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** మూడోసారి ప్రధానిగా పాలన చేపట్టిన నరేంద్రమోడీ అతితక్కువ మెజార్టీతో పదవి చేపట్టారని, మరో 15 సీట్లు రాకపోయి ఉంటే ఆయన ప్రధాని అయ్యేవారు కాదని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తాను దేశానికి రాజు కావాలని అస్సలు అనుకోవడం లేదని, అలాంటి భావనకు తాను పూర్తి వ్యతిరేకినని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. శనివారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ఈ >>2



న్యూఢిల్లీలో శనివారం జరిగిన ఎఐసిసి లీగల్ కాన్‌క్లేవ్‌లో రాహుల్‌తో కరచాలనం చేస్తున్న సిఎం రేవంత్

### బిజెపికి 150 సీట్లు దాటనివ్వం

### రాహుల్ తగిన గుణపాఠం చెప్పడం ఖాయం

### అద్వానీ, జోషిని చూసి మోడీ నేర్చుకోరా?

### దేశానికి స్వాతంత్ర్యం, రాజ్యాంగం తెచ్చిన పార్టీ కాంగ్రెస్

### ఒబిసిలకు 42% రిజర్వేషన్లకోసం అవిశ్రాంత పోరాటం

### ఎఐసిసి లీగల్ కాన్‌క్లేవ్‌లో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు2:** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి మోడీ, బీజేపీని కాంగ్రెస్ ఓడిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మోడీని గద్దె దించడమే రాహుల్‌గాంధీ లక్ష్యం, ఇది రాబోయే ఎన్నికల్లో జరగబోతుందని చెప్పారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఎఐసిసి అధ్వర్యంలో శనివారం జరిగిన ఆన్యువల్ లీగల్ కాన్‌క్లేవ్‌లో కానిస్టిట్యూషనల్ ఛాలెంజెస్... పర్‌స్పెక్టివ్స్ అండ్ పాత్‌వేస్' అనే సదస్సులో ఆయన ప్రసంగించారు. సంఘ్ కుటుంబం చేయలేకపోయిన పనిని,అటల్ బిహారీ వాజ్‌పేయి చేయలేకపోయిన పనిని,రాహుల్‌గాంధీ చేస్తారని చెప్పారు. ఒక సందర్భంలో వాజ్‌పేయి కూడా మోడీని సిఎం పదవి నుంచి తప్పించాలని ప్రయత్నించారని, ఈరోజు మోహన్ భగవత్ కూడా మోడీని ప్రధాని పదవి నుంచి తప్పించాలనే ప్రయత్నం చేస్తున్నారని, కానీ వారి ద్వారా ఇది సాధ్యం కాదన్నారు. కారణమేమంటే మిస్టర్ నిషికాంత్ >>2

## ఐవిఎఫ్‌ల తనిఖీలు, నియంత్రణకు కమిటీ

### 10 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 2:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఐవిఎఫ్‌లపై చర్యలకు ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఐవిఎఫ్‌ల్లో తనిఖీలు చేసి.. వాటిని నియంత్రించడం కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముగ్గురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. 10 రోజుల్లో కమిటీ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా క్రిస్టినా జడ్ చోంగ్తూ జివో ఆర్‌టి నంబర్ 381ని శనివారం జారీ చేశారు. మాతృత్వం కోసం తపిస్తున్న దంపతుల ఆశను ఆసరాగా చేసుకుని, ఐవిఎఫ్, సరోగసిని వ్యాపారంగా మార్చి దందాకు పాల్పడుతున్న ఐవిఎఫ్ >>2



శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బిజెపి ఒబిసి మోర్చా మహాధర్నాలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో ఈటల, కృష్ణయ్య, రాంచంద్రరావు

# 42% రిజర్వేషన్లు బిసిలకే ఇవ్వాలి

### మాయచేయాలని చూస్తే సహించం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### మతపరమైన రిజర్వేషన్లను బిసి పేరుతో తేవడాన్ని ఒప్పుకోం: రాంచందర్‌రావు

### బిసిల కళ్లల్లో మట్టి కొట్టిన పార్టీ కాంగ్రెస్: ఈటల

### బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్ట్ 2, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ చెబుతున్న 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు మాత్రమే ఇవ్వాలని, అందులో పది శాతం ముస్లింలకు ఇస్తామంటే ఊరుకోబోమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు, పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, పైడి రాకేష్‌రెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ ఏవిఎన్.రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తన చేతకాని తనాన్ని కప్పి పుచ్చుకోవటానికి కేంద్రంపై బట్టకాల్చి వేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈరోజు కాంగ్రెస్ చెబుతున్న 42శాతం రిజర్వేషన్లు బీసీలకు మేలు చేసేవి కావని, అందులో ముస్లింలకు పది శాతం ఇచ్చి, ముస్లింలకు మేలు చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవని, వాటిని కేసీఆర్ 23 శాతానికి తగ్గించారని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ 42శాతం బీసీలకు అని చెబుతూ, అందులో పది శాతం ముస్లింలకు ఇస్తే ఇక >>2




శనివారం హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అకాడెమీలతో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు

### ప్రపంచంతో పోటీ పడేలా

## వినూత్న క్రీడా పాలసీ

### పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో విధానాలు.. ప్రత్యేక బోర్డు ఏర్పాటు

### క్రీడాకారులు, స్పోర్ట్స్ అకాడెమీలతో ప్రభుత్వం ఒప్పందం: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు2:** క్రీడల్లో తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడేలా క్రీడా పాలసీని తీసుకు వస్తున్నామని, క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించడానికి పబ్లిక్ , ప్రైవేట్ భాగస్వామ్యంలో క్రీడా పాలసీ ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు.క్రీడలతో పాటు వివిధ రంగాల్లో విజయవంతమైన వారితో బోర్డు ఏర్పాటు చేశామని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పరిమితమైన పాత్ర పోషిస్తుందని, చాలా లోతుగా ఆలోచించి తెలంగాణ క్రీడా పాలసీని తీసుకువచ్చామని పేర్కొన్నారు.శనివారం సాయంత్రం హెచ్‌ఐసిసిలో ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ కార్యక్రమంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ-2025ని సిఎం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రముఖ క్రీడాకారులు గగన్ నారంగ్,అభినవ్ బింద్రా,పలు స్పోర్ట్స్ అకాడమీలు పలు ఒప్పందాలు చేసుకున్నాయి.వివిధ >>2

## మంత్రి సురేఖపై క్రిమినల్ కేసు

### నాంపల్లి కోర్టు ఆదేశం

### సమాచారం లేదన్న మంత్రి



**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** సినీ నటి సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు మాజీ మంత్రి కెటిఆర్‌కు దీనిని ఆపాదిస్తూ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన నాంపల్లికోర్టు ఇందుకుగానూ మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చే యాలని ఆదేశించింది. ఈ నెల 21వ తేదీలోగా కేసు నమోదు చేసి సురేఖకు నోటీసు ఇవ్వాలని న్యాయస్థానం శనివారం నాడు >>2

## జూరాలకు భారీ వరద

### 17 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల

### శ్రీశైలానికి 1.88 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

### 8 గేట్లు ఎత్తి నీరు విడుదల



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. దీంతో ప్రాజెక్ట గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో జూరాలకు వరద పోటెత్తుతున్నది. దీంతో 17 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1,80,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.148టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 25,843క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1,39,132క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్‌కు 315క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750,ఎడమ కాలువకు 1250క్యూసెక్కులు, కుడి కాలువకు 650 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలనుంచి 1,68,784క్యూసె క్కుల అవుట్‌ఫ్లో నమోదయింది. శ్రీశైలం జలాశయానికి సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో శ్రీశైలం డ్యాం నిండుకుండను >>2

## రేపు కేబినెట్ భేటీ

### ఘోష్ నివేదికపై చర్చించే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు2:** ఈ నెల 4వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని ఆరో అంతస్తులో సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, కాళేశ్వరం కమిషన్ నివేదిక తదితరమైనవి ప్రధాన అంశాలుగా చర్చించే అవకాశం ఉంది. బీసీ రిజ్వేషన్ల బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై వత్తిడి పెంచేందుకు 5,6,7 తేదీల్లో ఢిల్లీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టింది.బీసి రిజర్వేషన్లపై కేంద్రం >>2



## టూరిస్టు సిఎం అవసరం లేదు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు2:** ఢిల్లీ యాత్రల్లో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ పూర్తి చేశారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. అధికారంలో వచ్చిన 20 నెలల్లో 50 సార్లు ఢిల్లీకి పోయిన రేవంత్ రెడ్డితో రాష్ట్రానికి పైసా ప్రయోజనం కలగలేదని చెప్పారు. ఢిల్లీ బాసుల కాళ్ల దగ్గర తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఫైల్స్‌తో కాకుండా ఫ్లైట్ బుకింగ్స్‌తో రాష్ట్రాన్ని పాలిస్తున్న రేవంత్ రెడ్డి టూరిస్ట్ సిఎంగా దేశ చరిత్రలో మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. ఫ్లైట్ టికెట్‌లు బుక్ చేసుకోవడం, ఢిల్లీకి అప్ అండ్ డౌన్ చేయడం, వచ్చేటప్పుడు ఖాళీ చేతులతో ఊపుకుంటూ రావడం అనే మూడు పనులను ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రేవంత్ రెడ్డి పట్టుదలతో చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పాలించే ముఖ్యమంత్రి కావాలి కానీ, ఢిల్లీకి విహార యాత్రలు చేసే టూరిస్ట్ సిఎం అవసరం లేదరి అన్నారు. ముగ్గురు యజమానుల ముద్దుల బానిస అయిన రేవంత్ రెడ్డి తన మొదటి బాస్ రాహుల్ గాంధీకి నోట్ల కట్టల మూటలు మోస్తూ పదవిని కాపాడుకుంటున్నారని ఆరోపించారు. రెండో యజమాని మోడీకి సన్నిహితులైన వ్యాపారవేత్తలకు తెలంగాణ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి కేసుల నుంచి తప్పించుకుంటున్నారని, ఇక మన అన్నదాతల కడుపు కొట్టి తెలంగాణ జల సంపదను తన మూడో యజమాని చంద్రబాబుకు దోచి పెడుతున్నారన్నారని పేర్కొన్నారు. తెలంగాణ సోయి లేని రేవంత్ రెడ్డి బానిస మనస్తత్వంతో త్యాగాల పునాదులపై పురుడు పోసుకున్న తెలంగాణ నిలువు దోపిడికి గురవుతుందని పేర్కొన్నారు.



కొల్లాపూర్‌లో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రి జూపల్లి

## బనకచర్ల ఎలా కడతారో చూస్తాం..

### ప్రజల సంక్షేమం కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టాం

### మహిళల పేరిట ఆర్టీసీకి రూ.6680 కోట్లు

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** వృథా జలాల వల్లే బనకచర్ల కడుతున్నారని ఎంపీ మంత్రి లోకేష్ అంటున్నారని, ఏపీ బనకచర్ల కడుతుందని కేటీఆర్ అంటున్నారని, అసలు లోకేష్‌ను కేటీఆర్ ఎందుకు సీక్రెట్‌గా కలిశారో చెప్పాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వల్లే వృథా జలాలు వెళ్తున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని కొల్లాపూర్ పట్టణంలో రాజుగారి కోట దగ్గర ఏర్పాటు చేసిన నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలను ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, ట్రాన్స్‌కో,వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపనలు, నూతన రేషన్ కార్డులు, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిర్మాణాలపట్టాలు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. >>2



వారణాసిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఓ విద్యార్థినికి కంటి అద్దాలు పెడుతున్న ప్రధాని మోడీ

# 3కు చేరువలో భారత్

>> అడగాలనుకుంటున్నానని, భారత శక్తిపై మీరు గర్వంగా ఫీలవ్వడం లేదా అని ప్రధాని అన్నారు. భారత్‌లో తయారీ అయిన ఆయుధాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో తమ సత్తాను చాటినట్లు చెప్పారు. పాకిస్థాన్‌లో ఉన్న చాలా వైమానిక స్థావరాలు ఇంకా ఐసీయూ స్థితిలోనే ఉన్నాయని, పాకిస్థాన్ బాధపడుతోందని, దాన్ని ఎవరైనా అర్థం చేసుకోగలరని, కానీ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు మాత్రం పాకిస్థాన్ బాధను చూడలేకపోతున్నారని ప్రధాని అన్నారు. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే వాళ్లు పాకిస్థాన్‌లోనూ, ఇండియాలోనూ ఏడుస్తున్నారని విమర్శించారు. మన సైనిక బలగాలను కాంగ్రెస్ నిత్యం అవమానిస్తోందని, ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పిలుస్తోందని మోదీ అన్నారు. కాంగ్రెస్ వ్యాఖ్యలను సిగ్గులేని చర్యగా ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదులను ఇప్పుడు ఎందుకు చంపారని సమాజ్‌వాదీ పార్టీ అడుగుతోందని, వాళ్లను పిలిచి.. చంపాలా వద్దా అని అడగాలా, లేదంటే వాళ్లు పారిపోయే వరకు వేచి చూడాలని అని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతదేశ రుద్ర స్వరూపాన్ని ప్రపంచం తిలకించిందని, ఇప్పుడు నవ భారతం శత్రువులకు కాలభైరవుడిగా మారినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. పాకిస్తాన్ వైమానిక స్థావరాలు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. బ్రహ్మోస్ మిసైళ్ల వల్ల పాకిస్తాన్‌కు నిద్ర పట్టడం లేదు. ఈ క్రమంలో పాక్ మళ్లీ దాడులు చేయాలని చూస్తే, ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ మిసైళ్లతో ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేస్తామని మోదీ హెచ్చరించారు. లక్నోలో బ్రహ్మోస్ తయారీ యూనిట్ త్వరలో ప్రారంభం కానుంది. రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధిగా మారుతోందని, యూపీ డిఫెన్స్ కారిడార్‌లో పెద్ద పెద్ద కంపెనీలు పెట్టుబడి పెట్టడం ఇప్పటికే ప్రారంభించాయని ప్రధాని తెలిపారు. ఈ సభను ఓం నమః పర్వతి పతయే, హర హర మహాదేవ్ అంటూ ప్రారంభించిన ప్రధాని, పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆశీర్వదించమని కాశీ విశ్వనాథుని ప్రార్థించారు. వారి సిందూరానికి ప్రతీకారం తీసుకుంటామని వాగ్దానం చేశాము. ఇప్పుడు ఆ వాగ్దానాన్ని ఆపరేషన్ సింధూర్ ద్వారా నెరవేర్చినట్లు చెప్పారు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 25 శాతం సుంకాలు విధించడం సహా భారత్ ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీగా అభివర్ణించడంపై ప్రధాని మోడీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల్లో అస్థిరత ఉంది. అన్ని దేశాలు వారి స్వప్రయోజనాలపై దృష్టి సారించాయి. ప్రపంచంలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడానికి చేరువైంది. కాబట్టి ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. దేశ ప్రజల విషయంలో మనకు ప్రత్యేక వ్యూహం ఉంది. ఈ విషయాన్ని మోడీ మాత్రమే కాదు దేశ ప్రజలంతా ప్రపంచానికి చాటిచెప్పాలి. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలంటే రాజకీయ పార్టీలు, రాజకీయ నేతలు తమ స్వార్థాన్ని వీడి దేశ ప్రయోజనాల కోసం ప్రజల్లో ఐక్యతా భావనను కలిగించాలి. మనమంతా స్వదేశీ సంకల్పాన్ని తీసుకోవాలి. మనం ఏ వస్తువు కొనుగోలు చేసినా దాని తయారీ వెనుక భారతీయుల కష్టం ఉండాలని మోడీ అన్నారు.

# ఎలా కడతారో చూస్తాం..

>> అనంతరం మాట్లాడుతూ తప్పకుంఠ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కడతామని, గోదావరి జలాలను కూడా తెలంగాణకు పారిస్తామన్నారు. మా వాటా పూర్తయ్యాకే మిగులు జలాల్లో బనకచర్ల కడతారో, ఇంకేచెర్ల కడతారో ఆలోచించుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అప్పుల భారం ఉన్నప్పటికీ వాటిని అధిగమించి గత ప్రభుత్వ పెద్దలు చేసిన అప్పులకు 6,500 కోట్లు ప్రతినెల వడ్డీ కడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజల సంక్షేమం కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని 10 లక్షలకు పెంచాం, ఇప్పటివరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలు 200 కోట్ల సార్లు ఉచితంగాప్రయాణం చేశారని ఈఖర్చును ప్రభుత్వం రూ.6680 కోట్లు మహిళల పక్షాన ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా పేదలకు 5 లక్షలతో ఒక్కో ఇంటిని నిర్మిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు మొదటి దశలో నిర్మించేందుకు 22,500 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వడివడిగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని, గత పది సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లు పేదలకు పంచలేదు అని డిప్యూటీ సీఎం వివరించారు.

**కొల్లాపూర్‌లోనే రాజకీయ ఓనమాలు..**

మా సోదరుడు స్వర్గీయ మల్లు అనంత రాములు 1980లో నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీ చేసిన సమయంలో తాను విద్యార్థిగా ఉన్నానని, ఆ సమయంలో తనను కొల్లాపూర్ ఇన్చార్జిగా నియమించారని, ఆనాడే తాను రాజకీయ ఓనమాలు దిద్దుకున్నానని ఉప ముఖ్యమంత్రి వివరించారు. నియోజకవర్గ ఇన్చార్జిగా ఊరూరా తిరిగి ప్రజలతో మమేకం కావడం కొల్లాపూర్‌తోనే ప్రారంభమైందని, తనకు మధిర నియోజకవర్గంతో ఎంతటి అనుబంధం ఉందో కొల్లాపూర్‌తోను అంతే అనుబంధం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. కొల్లాపూర్ ఎక్కడో దూరంగా ఉందని అంతా అనుకుంటారు కానీ ఈ నియోజకవర్గంలో అన్ని రకాల భావజాలాలు ఉన్నాయని తెలిపారు. పాలమూరు ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా కొల్లాపూర్‌లో రాజకీయ జీవితం ప్రారంభించిన తాను డిప్యూటీ సీఎంగా ఉన్నానని తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోతిరెడ్డిపాడు కాల్వ ద్వారా కృష్ణా జలాలను ఇప్పటికే భారీగా తరలించుకుపోతున్నదని, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణతో మన ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరగనుందని, శ్రీశైలం రిజర్వాయర్ లోని నీళ్లు 2,3 నెలల్లోనూ ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత నీటి సమస్య తీరాలంటే వెల్టూరు, చిన్నమర్రి మధ్య కృష్ణ నదిపై డ్యాం నిర్మించాల్సిన అవసరం ఉందని, ఒక్క ఎకరం ముంపు ముప్పు లేకుండా సుమారు 60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, మీ సాకారం కూడా కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కోరారు. ఇక్కడ డ్యాం నిర్మాణం వల్ల నాగర్ కర్నూల్ జిల్లాతో పాటు నార్లాపూర్ మోటర్లు, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన ఎల్లూర్ లిఫ్ట్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లకు కూడా నీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు.

# రాష్ట్ర పండుగగా సత్యసాయిబాబా శత జయంతి

## ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్,ఆగస్టు2, ప్రభాతవార్త:** సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 23ను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భగవాన్ సత్యసాయిబాబాను స్మరించుకోవడం, సేవలను గుర్తు చేసుకోవడం ఆనందదాయకమని వెల్లడించారు. రాష్ట్ర సత్యసాయి ట్రస్టును సంప్రదించి వేడుకలకు అనుగుణంగా నిధులు సమాకూర్చాలని జీవోలో పేర్కొన్నారు.

# పింగళి వెంకయ్యకు సిఎం రేవంత్ ఘన నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు2:** ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 149వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు.

# భారీ వరద

>> తలపిస్తున్నది. దీంతో ప్రాజెక్టు 8గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 25,843క్యూసెక్కులు,స్పిల్‌వే ద్వారా 1,39, 132క్యూసెక్కులు, సుంకేసులనుంచి 23046 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,88,021క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.20అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 200.1971 టీఎంసీలకు చేరింది. పవర్‌ఉత్పత్తి కోసం 66,102క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. శ్రీశైలానికి కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి నిరంతరంగా నీటివిడుదల కొనసాగుతున్నది. ఉమ్మడి పాలమూరులోని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది.

# రేపు కేబినెట్ భేటీ

>> నుంచి స్పష్టత వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవచ్చునని తెలుస్తోంది. కాగా, బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ ఫైల్‌పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గవర్నర్ కేంద్ర సలహా కోరగా ఢిల్లీ నుంచి ఇంకా సమాధానం రాలేదు.

## వారం - వర్జ్యం

తేది : 03-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
నవమి ఉ.9.41
విశాఖ ఉ.6.34
వర్జ్యం ఉ.11.00-12.47
దు.సా.4.52-5.43
శుభసమయం:ఉ.10.00-11.00,సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థికపరిస్థితి సానుకూలంగా ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి.

**వృషభం :** అనుకున్న అవకాశాలు శ్రమించడం వలన కలిసివస్తాయి. ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి.

**మిథునం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు సకాలంలో పూర్తిచేస్తారు. శుభకార్యాలకు హజరవుతారు.

**కర్కాటకం :** ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి. పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ఆచితూచి వ్యవహ రించండి. ఆర్థికపరిస్థితి మెరుగుపడతాయి.

**కన్య :** సన్నిహితులకు మీవంతు సహాయం అందిస్తారు. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి.

**తుల :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** వివాహ, ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మకరం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు.

**కుంభం:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది.

**మీనం :** ఆరోగ్యసమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మోడీ మళ్లీ రాలేరు

>> దూబేలాంటి వారు చెబుతుంటారు.. మోడీ లేకుండా బిజెపికి 150 సీట్లు దాటి రావని, రాహుల్ గాంధీ నేతృత్వంలో రాబోయే ఎన్నికల్లో బిజెపికి 150 సీట్లు దాటకుండా తగిన గుణపాఠం చెప్పే బాధ్యతను మేము తీసుకుంటామన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో మోడీని ఓడించేందుకు, దేశాన్ని రక్షించేందుకు, రాజ్యాం గాన్ని కాపాడేందుకు, రిజర్వేషన్లను అమలు చేయేందుకు, సామాజిక న్యాయాన్ని స్థాపించేందుకు కాంగ్రెస్ కుటుంబం మొత్తం సిద్ధంగా ఉందన్నారు. 2001 నుంచి నరేంద్ర మోడీ కుర్చీ వదలడం లేదు, ముఖ్యమంత్రి అయింది మొదలు ఇప్పటి వరకు కుర్చీ వదలడం లేదు. ఆర్ఎస్ఎస్ చెప్పినా మోడీ వినడం లేదు,రెండు నెలల క్రితం ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ 75 ఏళ్ల నిండినవారు కుర్చీ వదలాలని చెప్పినా మోడీ వదులుకు నేందుకు సిద్దంగా లేరు..అద్వాణీ, మురళీ మనోహార్ జోషికి వర్తించే నిబంధనలు మోడీకి వర్తించవా? అని ప్రశ్నించారు. స్వాతంత్రం రాకముందే కాంగ్రెస్ పార్టీ ఉందని, బిజెపి నేతలకు గుర్తు చేస్తున్న.. బ్రిటీష్ వాళ్లతో పోరాడి స్వాతంత్రం తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చింది కాంగ్రెస్ అని, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నది కాంగ్రెస్ అని అభివర్ణించారు. మోడీని కుర్చీ నుంచి ఆర్ఎస్ఎస్, వాజ్‌పేయీ దింపలేకపోయారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ మోడీని కుర్చీ నుంచి దింపేస్తారని చెప్పారు.మోడీ లేకుంటే బీజేపీకి 150 సీట్లు కూడా రావని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ప్రకటించారు.దూబే తన డైరీలో రాసి పెట్టుకోవాలి, వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలోని పోరాడతామన్నారు.బీజేపీకి 150కి మించి ఒక్క సీటు రాదు, మోడీని ఓడించేందుకు, మోడీని కుర్చీ నుంచి దింపేందుకు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడతాయన్నారు.ఓబీసీలకు సామాజిక న్యాయం సాధించేందుకు రాహుల్ గాంధీ నేతృత్వంలో మేం పోరాడతామన్నారు.రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారు. ఓబీసీలకు సామాజిక న్యాయం అందించడానికి, ఈ దేశంలో జనగణన (కుల గణన) చేపట్టే రోజులు వస్తున్నాయి. బీసీలకు వారి జనాభా నిష్పత్తి మేరకు రిజర్వేషన్లు కల్పించేలా కొత్త చట్టాన్ని రూపొందించడానికి, రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతుంది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు నడిచారు. ఆ ప్రయాణంలో, విచ్ఛిన్నత, విద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచే ఉద్యమాన్ని కొనసాగించారని చెప్పారు. ఆ సమయంలో తెలంగాణలో కులగణనకు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు,ఆయన హామీ మేరకు ఆయనకు బాసటగా తెలంగాణ ప్రజలు ప్రేమ దుకాణాలు (మొహబ్బత్ కా దుకాణ్) తెరిచారన్నా రు. అందుకే మేం తెలంగాణలో కుల గణన చేశాం, దేశానికి తెలంగాణ మోడల్ ఇచ్చాం, దేశంలో సామాజిక న్యాయం కోసం,కుల గణన కోసం ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు నూతన సామాజిక న్యాయం సాధనకు రాహుల్ గాంధీ నేతృత్వంలో పోరాడతామని పునరుద్ఘాటించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందే కాంగ్రెస్ పార్టీ ఉంది వాళ్లతో పోరాడి దేశానికి స్వాతం త్ర్యం తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ. ఈ విషయాన్ని బీజేపీ వాళ్లకు గుర్తు చేస్తున్నా అని చెప్పారు. ఇందిరా గాంధీ పాకిస్తాన్‌ను యుద్ధంలో ఓడించి రెండు ముక్కలుచేసి కాళీమాతాగా గుర్తింపుపొందారు.. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని ఇందిరాగాంధీ రక్షించింది. ఉగ్రవాదుల నుంచి రక్షించే క్రమంలో ఇందిరాగాంధీ ప్రాణాలు త్యాగం చేశారు అని వివరించారు. ఉగ్రవాదంపై పోరులో రాజీవ్ గాంధీ అమరత్వం పొందారు అని పేర్కొన్నారు.కాంగ్రెస్ ఏం చేసిందని పదే పదే బీజేపీ వాళ్లు ప్రశ్నిస్తున్నారు,ఈ దేశం కోసం గాంధీజీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగాలు చేశారని చెప్పారు. 2004లో కేంద్రం లో యూపీఏ1 అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని అంతా సోనియాని కోరినప్పటికీ ఆమె దానిని త్యాగం చేసి మన్మోహన్‌సింగ్‌ను ప్రధానమంత్రి చేశారన్నారు. రాష్ట్రపతి అవకాశం వచ్చినా వదులుకొని ప్రణబ్ ముఖర్జీని రాష్ట్రపతి చేశారన్నారు. రాహుల్ గాంధీ అనుకుంటే 2004లోనే కేంద్ర మంత్రి... 2009లోనే ప్రధానమంత్రి అయ్యే వారు కానీ ఆ రెండింటిని ఆయన త్యాగం చేశారని చెప్పారు. త్యాగాలు కాంగ్రెస్‌కు కొత్త కాదు,సామాన్య కార్యకర్తగానే రాహుల్ కొనసాగు తున్నారు. పేదలు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, సామాజిక న్యాయం కోసం 25ఏళ్లుగా రాహుల్ పోరాడుతున్నారని చెప్పారు. ఈ దేశంలోని రాజ్యాంగాన్ని కాపాడాలనుకునే ప్రతి ఒక్కరు, ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసేవారు, ఈ వేదికపై ఉన్న ప్రతి ఒక్కరు... అందరం రాహుల్ గాంధీ వెంట నిలబడాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని భారత ప్రధాని చేయాలన్న లక్ష్యంతో, ఈ దేశాన్ని సామాజిక న్యాయ మార్గంలో నడిపించాలన్న సంకల్పంతో, మేమంతా సిద్ధంగా ఉన్నాం! మీరు సిద్ధంగా ఉన్నారా? సామాజిక న్యాయానికి సిద్ధంగా ఉన్నారా? రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారా? అయితే, కలిసి ముందుకు నడుద్దాం! అని ప్రసంగాన్ని ముగించారు.

# 42% రిజర్వేషన్లు బిసిలకే ఇవ్వాలి

>> బీసీలకు కేవలం 32శాతమే వస్తుందని, అంటే గతంలో కన్నా రెండు శాతం రిజర్వేషన్లు బీసీలకు తక్కువ ఇవ్వాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే 42శాతం రిజర్వేషన్లు మొత్తం బీసీలకే ఇవ్వాలని, ఇందులో నుంచి ముస్లిం పది శాతం ఇచ్చి, ముస్లింలకు మేలు చేస్తూ, బీసీలను మోసం చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక 11ఏండ్లు ఒక బీసీని ప్రధానిగా చేసిన ఘనత, బీసీ కమీషన్‌కు చట్టబద్ధంగా రాజ్యాంగ హోదా కల్పించి, అన్ని రకాల హక్కులు ఇచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. 28మంది బీసీలను మంత్రులు చేసిన ఘనత బీజేపీదేనని స్పష్టం చేశారు. మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ ముఖ్యమంత్రి స్థాయికి మించి మాట్లాడుతున్నారని, బీసీలో చేరిన బీసీ కమ్యూనిటీని కన్వర్టెడ్ బీసీ అని ఎలా అంటారని ప్రశ్నించారు. వచ్చే ఏడాది మోది నాయకత్వంలో శాస్త్రీయంగా, చట్టబద్ధంగా దేశమంతా కులగణన జరుగుతుందని, అప్పుడే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా 42శాతం బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఆబిల్లును అమలుచేయకుండా కేంద్రంపై నెపం మోపుతున్నారని ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లను బీసీ రిజర్వేషన్ పేరుతో తేవటాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని, బీసీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే 42శాతం రిజర్వేషన్లలో ముస్లింలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం నుంచి అపాయింట్‌మెంట్ దొరకటం లేదని, అందుకే జంతర్‌మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల ధర్నా పేరుతో కొత్త నాటకమాడుతున్నారని ఆరోపించారు. అత్యధికంగా బీసీ ఎంపీలు, బీసీ మంత్రులు ఉన్న పార్టీ బీజేపీ అని, బీసీలకు పెద్దపీట వేసి, న్యాయం చేస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ కళ్లు తెరిచి, స్థానిక సంస్థలలో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ బీసీల కళ్లల్లో మట్టి కొట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో 42శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు, బీసీ రిజర్వేషన్లు తగ్గించి, బీసీలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు తేడాలేదని అన్నారు. అలవుకాని హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీలను ఏ విధంగా మోసం చేస్తోందో ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయటానికి కేంద్రంపై నెపం మోపుతున్న ముఖ్యమంత్రి తన మంత్రి వర్గంలో బీసీలకు 42శాతం ఎందుకు కేటాయించ లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించి, స్థానిక సంస్థలలో తన చిత్తశుద్ధిని కాంగ్రెస్ రుజువు చేసుకోవాలని సూచించారు. ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత చింతల రాంచంద్రారెడ్డి, మాజీ మేయర్ బండా కార్తికారెడ్డి, శ్రీనివాస్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి, పూసరాజు, కార్పోరేటర్‌లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.



గంగా నదికి భారీవరద రావడంతో ప్రయాగ్‌రాజ్‌లోని సలోరి ప్రాంతంలో నీట మునిగిన పలు కాలనీలు

# ప్రపంచంతో పోటీ పడేలా వినూత్న క్రీడా పాలసీ

>> క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు సిఎం నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రానికి క్రీడా విధానం ఏది లేదని,క్రీడా పాలసీ లేకపోవడం వల్ల యువత పెడదారి పడుతోందని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో తెలంగాణలో డ్రగ్స్, గంజాయి కేసులు బాగా పెరిగిపోయాయని, డ్రగ్స్,గంజాయి నియంత్ర ణకు ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, దేశంలో క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్ల యువత డ్రగ్స్‌కు అలవాటు పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ చైతన్యవంతమైన గడ్డ, తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడారు,అలాంటి యువత ఇప్పుడు వ్యసనాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. 1956లో జరిగిన ఒలంపిక్స్‌లో నాలుగో స్థానం సాధించిన పుట్‌బాల్ జట్టులో హైదరాబాద్ కు చెందిన వారు 9 మంది ఉన్నారని గుర్తు చేశారు. అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, రవికాంత్ రెడ్డి, సిరాజ్, నిక్కత్ జరీన్, దీప్తి లాంటి అనేక మంది క్రీడాకారులు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. సిరాజ్, నిక్కత్ జరీన్‌కు గ్రూప్ వన్ ఉద్యోగంతో పాటు హైదరాబాద్‌లో ఇంటి స్థలం ఇచ్చి ప్రోత్సహించామని, ఫారా ఒలంపిక్స్ లో రాణించిన దీప్తికి కోటి రూపాయల నగదు బహుమతితో పాటు ఇంటి స్థలం ఇచ్చామన్నారు.చదువులోనే కాదు క్రీడల్లో రాణించినా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందనే సందేశం ఇచ్చామన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల క్రీడా మైదానాలు ఫంక్షన్ హాల్స్ గా మారాయని, సన్బర్న్ లాంటి ఈవెంట్స్ కు వేదికగా మారాయని ఆరోపించారు.

తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఒలంపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ రాకపోవడం దేశానికే అవమానమని, ఒలంపిక్స్ లో దేశానికి 71వ స్థానం రావడం అందరూ ఆలోచించాల్సిన విషయమన్నారు. దక్షిణ కొరియాలో ఒక్క స్పోర్ట్స్ యూనివర్సిటీకి 16 బంగారు పతకాలు వచ్చాయని, ఒక్క అమ్మాయికి 3 పతకాలు గెలుచుకుందన్నారు. క్రీడలకు తెలంగాణను వేదిక చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. విజన్ డాక్యుమెంట్ 2047 లో స్పోర్ట్స్ పాలసీకి ఒక ఛాప్టర్ కేటాయించామని, నేషనల్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్‌ను నిర్వహించిన చరిత్ర హైదరాబాద్ కు ఉందన్నారు. వచ్చే ఒలంపిక్స్ నిర్వహణకు సిద్ధమని మనం ప్రకటించాం.. కాని అందులో ఒక్క పతకం కూడా రాకపోతే మన మొహం ఎక్కడ పెట్టుకుంటామని ప్రశ్నించారు. డ్రగ్స్ సప్లై చేసేవాళ్లు తెలంగాణ వైపు చూస్తే ధైర్యం లేకుండా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, గంజాయి,డ్రగ్స్ తీసుకునే వారు ఎంతటి పెద్దవారైనా ఈగల్ ఫోర్స్ వదిలిపెట్టదన్నారు.

గంజాయి, డ్రగ్స్ తీసుకోవాలంటే భయం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2026 లో ఖేల్ ఇండియా నిర్వహణకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామని, ఒలంపిక్స్ లో రెండు విభాగాల నిర్వహణకు సిద్ధమని కేంద్రానికి తెలిపింద న్నారు.. తెలంగాణ క్రీడా విధానం కేవలం ఒక కాగితం కాదు.. బంగారు రేకులతో రాసిన పత్రం అని చెప్పారు. ఒలంపిక్స్‌లో పతకం తేవడమే లక్ష్యం గా పనిచేస్తామని స్పష్టం చేశారు. స్పోర్ట్స్ పాలసీతో రాష్ట్రంలో కొత్త అధ్యాయం మొదలుకావాలని, క్రీడలకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మంత్రి వాకిటి శ్రీహరి, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి,క్రీడా (ప్రభుత్వ)సలహాదారు జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, జాతీయ,అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రముఖులు, క్రీడా సంస్థల నిర్వాహకులు హాజరయ్యారు.

# మోడీ ప్రధాని కాలేరు

>> వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని మొదలుపెట్టగానే, ఇస్ దేశ్ కా రాజా కైసా హో, రాహుల్ గాంధీ జైసా హో అంటూ పలువురు సభికులు నినాదాలు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ, "లేదండి, నేను రాజును కాదు. రాజు కావాలని నాకు లేదు. నేను రాజుకు వ్యతిరేకిని. రాజు అనే భావనను కూడా నేను వ్యతిరేకిస్తాను" అని తేల్చి చెప్పారు. గతంలో రాజు అనే పదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ ప్రజల అభిప్రాయాన్ని, మనోభావాలను మోడీ ఆలకించడం లేదని ఆనాడు కాంగ్రెస్ అగ్రనేత ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని ఆయన విరుచుకుపడ్డారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందన్నారు. దాదాపు 70 నుంచి 100 లోక్‌సభ సీట్లలో రిగ్గింగ్ జరిగి ఉండొచ్చని, ఒకవేళ 15 సీట్లలోనే రిగ్గింగ్ జరిగి ఉంటే మోడీకి ప్రధానిగా అవకాశమే లభించేది కాదని రాహుల్ కామెంట్ చేశారు.

చాలా స్వల్ప మెజారిటీతో ప్రధానమంత్రి కుర్చీపై నరేంద్ర మోడీకూర్చొని ఉన్నారనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంకొన్ని సీట్లు తక్కువగా వచ్చి ఉంటే ఆయన అక్కడ కూర్చోగలిగే వారే కాదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ రిగ్గింగ్ జరిగే అవకాశం ఉంటుందని రాబోయే కొన్ని రోజుల్లో తాము నిరూపించబోతున్నామని ఆయన వెల్లడించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కొందరి హస్తాల్లోకి వెళ్లిపోయిందని, దాని ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆరోపించారు.

# నియంత్రణకు కమిటీ

>> సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.సృష్టి తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐవిఎఫ్ క్లినిక్‌లలో తనిఖీలు చేయడమే కాకుండా వాటి నియంత్రణ కోసం ఉన్నతాధికారులతో కమిటీని నియమించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో ఆరోగ్యశ్రీ సీఈవో, డైరక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డిఎంఈ) సభ్యులుగా కమిటీనీ నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ రాష్ట్రంలోని ప్రైవేటు ఐవిఎఫ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించనున్నారు. ఆయా సెంటర్లపై ఇదివరకే నమోదైన కేసుల వివరాలను సేకరించనున్నారు. ఆయా సెంటర్లకి అనుమతులు ఉన్నాయా? వాటికి రిజిస్ట్రేషన్ల వ్యాలిడిటీ ఉందా? పూర్తయిందా? వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేసి, నివేదిక అందించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

# సురేఖపై క్రిమినల్ కేసు

>> ఆదేశించింది. సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, దీనిని తనకు ఆపాదించడంపై బిఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి కెటిఆర్ మంత్రి సురేఖపై పరువు నష్టం దాఖలు చేయడం తెలిసిందే. దీనిపై విచారిస్తున్న నాంపల్లి కోర్టు ఈ విషయంలో కెటిఆర్ దాఖలు చేసిన పిటిషన్‌తో ఏకీభవించింది. ఈ కేసును బి ఎన్ఎస్ సెక్షన్ 356 కింద పరిగణలోకి తీసుకోగా బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 222, రెడ్‌విత్ 223 ప్రకారం కూడా స్వీకరించాలని నాంపల్లి కోర్టు పోలీసు లను ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, సమంత విడాకుల వంటి అంశాలపై కెటిఆర్‌పై మంత్రి సురేఖ చేసిన ఆరోపణ లు నిరాధారమని పేర్కొంది. కెటిఆర్ తరపున న్యాయవాది సిద్దార్థ్ పోగుల సమర్పించిన వాదనలను న్యాయస్థానం సమర్థించింది. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలు, సమర్పించిన పత్రాలు, ఫిర్యాదును పరిశీలించిన తరువాత సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయడానికి తగిన ఆధారాలు వున్నాయ ని కోర్టు అభిప్రాయపడింది. ఇదే సమయంలో కొండా సురేఖ తరపు వాదనలను కోర్టు తోసిపుచ్చింది. సురేఖ తరపున వాదించిన న్యాయవాది లేవ నెత్తిన పలు అంశాలను కోర్టు తిరస్కరించింది. ఈ ఫిర్యాదు ఊహాగానాలపై ఆధారపడిందన్న వాదనలను కోర్టు అంగీకరించలేదు. పెన్ డ్రైవ్‌కు 65 బి సర్టిఫికేట్ అవసరం అనే వాదనపు ఈ దశలో అప్రసుతమని కోర్టు పేర్కొంది. విచారణ సమయంలో దీనిని పరిశీలిస్తామని న్యాయస్థానం పేర్కొం ది. సురేఖ చేసిన వ్యాఖ్యలు మీడియాలో ముందుగానే వచ్చాయన్న వాదనకు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. దీనిపై ఈ నెల 21వ తే దీలోపు మంత్రి సురేఖపై కేసు నమోదు చేసి, నిందితురాలికి నోటీసు ఇవ్వాలని నాంపల్లి కోర్టు పోలీసులను ఆదేశించింది. హైకోర్టు ఆదేశం మేరకు క్రిమినల్ పిటిషన్ నంబర్ 5670/2024 ప్రకారం కోర్టుకు ఈ అధికారం వుందని న్యాయస్థానం వెల్లడించింది.

**క్రిమినల్ కేసుపై సమాచారం లేదన్న మంత్రి సురేఖ**

ఇదిలావుండగా తనపై నాంపల్లి కోర్టు క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించిన విషయమై మంత్రి కొండ సురేఖ స్పందించారు. తనను కలి సిన మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ కేసు నమోదుకు సంబంధించి ఇప్పటి వరకు తనకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. దీనిపై కోర్టు నుంచి నోటీసులు అందాక స్పందిస్తానని ఆమె వెల్లడించారు.

# ఉమ్మడి పాలమూరులో 8 మంది పంచాయతీ సెక్రెటరీల సస్పెన్షన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎనిమిది మంది పంచాయతీ సెక్రెటరీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే..వనపర్తి జిల్లా పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు విధులకు హాజరయ్యే సమయానికి ఇష్టానుసారంగా వ్యవహరించడం పట్ల జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పంచాయతీ సెక్రెటరీలను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పలుమార్లు ఫేక్ అటెండెన్స్ చేయొద్దని ఫిజికల్‌గా ఉండి ఫొటో అప్లోడ్ చేయాలని ఎన్నోసార్లు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని గతంలో ఉన్నటువంటి యాప్ పాత పద్ధతి ప్రకారంగానే ఫోటో క్యాప్చరింగ్ చేసి అప్లోడ్ చేస్తున్నారని అలా చేయొద్దని కొత్తగా వచ్చిన యాప్‌లో ఫేక్ అటెండెన్స్ చేసినట్లయితే తెలిసిపోతుందని పలుమార్లు హెచ్చరించిన జిపి సెక్రెటరీ మానకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఏదుల మండలం రేకులపల్లి తండా, గోపాల్పేట్ మండలం ఏదుట్ల గ్రామం, పానగల్ మండలంలోని షాగాపూర్ తాండ, పెబ్బేరు మండలంలోని కొత్త సూగురు గ్రామపంచాయతీ. మదనాపూర్ మండలంలోని గోపన్ పేట్, అమరచింత మండలంలోని నందిమల్ల జిపి సెక్రటరీతో కలిపి ఆరుగురిపై సస్పెన్షన్ వేటు పడినట్లు డిపిఓ తెలిపారు. అదేవిధంగా నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ తెలిపారు.



## మండలి భవనం పునర్నిర్మాణ పనులపై చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 2:** తెలంగాణ శాసన సభ ప్రాంగణములో తెలంగాణ శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులపై ఆర్అండ్‌బి, అగాఖాన్ సంస్థ, అసెంబ్లీ అధికారులతో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాల శాసన సభ, శాసన మండలి సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. రానున్న సమావేశాలు అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలో నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. తాజాగా ఇప్పటి వరకు పూర్తి అయిన పనుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారని, ఖచ్చితంగా శాసన మండలి సమావేశాలు పాత భవనంలోనే నిర్వహించాలని సీఎం ఆదేశించారని ఆయన వివరించారు. పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా, వేగం పెంచాలని, త్వరగా భవనాన్ని పూర్తి చేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా.నరసింహాచార్యులు, తదితరులు కూడా పాల్గొన్నారు.

## రేపటి నుంచి కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలు

### సుమారు 58 వేల దరఖాస్తులు

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లోని పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(టిజిసిపిజిఈటి)-2025 పరీక్షల రేపటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. అపరాధ రుసుంతో దరఖాస్తు గడువు ముగిసేనాటికి సుమారు 58 వేల దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలను ఆగస్టు 4 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టు వారీ పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికీ అధికారులు వెల్లడించారు. సిపిజిఈటీ2025కి సంబంధించిన దరఖాస్తులను జూన్ 18 నుంచి స్వీకరించిన విషయం తెలిసిందే. పిజి కోర్సులైన ఎంఎ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) ప్రోగ్రామ్‌లతోపాటు 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సిపిజిఈటీ పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వ విద్యాలయం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యా లయం, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్)లో ప్రవేశాల కోసం సిపిజెట్‌ను నిర్వహించనున్నారు. పరీక్షలను ఆగస్టు 4 నుంచి 11 వరకు ప్రతిరోజూ మూడు సెషన్‌లలో పరీక్షలను నిర్వహిం చనున్నారు. పరీక్షలకి సంబంధించిన హాల్‌టికెట్లను జూలై 31 నుంచే అందుబాటులో ఉంచారు. 44 సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలను నిర్వహించనున్నారు.



## 300 అడుగుల లోయలో పడిపోయిన బుల్‌డోజర్

### తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఆస్పత్రికి తరలింపు

**సిమ్లా, ఆగస్టు 2:** రాజధాని సిమ్లాలో ఒక రోడ్డు ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్న పనుల్లో ఏర్పాటుచేసి బుల్డోజర్ 300 అడుగుల భారీ లోయలోకి పడిపోయింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. జబ్లిలోని నేషనల్ హైవే-5పై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బుల్డోజర్ లోయలోకి పడిపోతున్న విడియోలు వైరల్ అయ్యాయి. కొంతసేపటితర్వాత ఒకవ్యక్తి డ్రైవర్ కిందికి పడిపోతూ కనిపించాడు. తర్వాత ఆతడిని ప్రమాదస్థలంనుంచి వెలికితీసి ఆసుపత్రిలో చేర్చారు. హిమాచల్ ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడటం, బురదమయం కావడంతో వాహనాలు లోయల్లోకి పడిపోతున్న సంఘటనలు ఎక్కువ సాగుతున్నాయి. రాష్ట్ర ఎస్డీఎంఎ లెక్కలప్రకారం హిమాచల్‌లో 179 మంది ఇప్పటివరకూ చనిపోయారు. వీరిలో 101 మంది కేవలం కొండచరియలు, ఆకస్మిక వరదలు, ఉరుములుమెరుపుల ధాటికే చనిపోయినట్లు తేలింది. ఇక 78 మంది రోడ్డుప్రమాదాల్లో చనిపోయారు. హిమాచల్‌ప్రదేశ్ ఇటీవలికాలంలో సంభవించిన ప్రకృతి విలయానికి భారీ ఎత్తున నష్టం చవిచూసింది. జూన్20వ తేదీనుంచి ఆగస్టు రెండోతేదీవరకూ కూడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. 403 రోడ్లు స్తంభించిపోయాయి. 411 పవర్ పంపిణ ఈట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం అయ్యాయి. 196 మంచినీటిసరఫరా పథకాలకు తీవ్ర విఘాతం కలిగిందని ఎస్డీఎంఎ వివరించింది.

# జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న కలెక్టర్లు

### సంక్షేమ, అభివృద్ధి పథకాల పరిశీలన

### నిరంతరం పర్యవేక్షిస్తున్న సిఎస్ రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 2:** నాలుగు గోడల మధ్య కాదు... ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రజా సమస్యలు తెలుసుకోవాలి... ఎప్పటికప్పుడు వాటి పరిష్కా రానికి కృషి చేయాలంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పదే పదే కలెక్టర్లు, ఇతర అధికారులకు సూచిస్తుంటారు.. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించడం... వివిధ పథకాలపై నిరంతర పర్యవేక్షణతో కలిగే ప్రయోజనాలను ప్రతి సమావేశంలో సీఎం వివరిస్తుంటారు. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడు క్షేత్ర స్థాయిలో కనిపిస్తున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. పాఠశాలలు, వసతిగృహాలు, ఆసుపత్రుల తనిఖీలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం,రేషన్ కార్డుల పంపిణీ ఇలా ప్రతి దానిపైనా గతంలో ఎన్నడూ లేనంతగా పర్యవేక్షణ కొనసాగుతోంది. జిల్లాల్లో కలెక్టర్ల తనిఖీలు, పర్యటనలు. తీసుకున్న నిర్ణయాలు ఇలా ప్రతిదానిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సైతం ప్రగతి నివేదికలు తెప్పించుకుంటున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో పాలన పరుగులు తీస్తోంది. వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికీ తెలియదనేది పాత సామెత.. ఇప్పుడు మాత్రం వాన ఎప్పుడు వస్తుందో, ఏ ప్రాంతంలో వస్తుందో, గాలుల తీవ్రత, వడగళ్లు, పిడుగులు ఎక్కడెక్కడ పడతాయో సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ముందే తెలిసిపోతోంది. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కలెక్టరేట్ల నుంచి ముందుగానే జిల్లా యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. వర్షతీవ్రత ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న మండలాల ప్రజలకు తక్షణ సహాయం అందేలా హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గత ఆరు నెలల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోలేదు. వర్షాలు,ఇతర విపత్తుల సమయంలో తక్షణమే స్పందించేందుకు అత్యవసర స్పందన బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బృందాలు అందుబాటులో ఉంటున్నాయి.

వర్షాకాలం కావడంతో వ్యాధుల విజృంభణ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధానసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్లు సందర్శిస్తున్నారు. వైద్యుల హాజరు, మందుల లభ్యత, ఇతర వసతులను పరిశీలిస్తున్నారు.. ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరి చేస్తున్నారు. వర్షా కాలంలో పశువులకు సైతం వ్యాధులు వస్తుంటాయి. పశువులు, గొర్రెల పెంపకందారులకు జీవనాధరమైన గొర్రెలు, మేకలకు టీకాలు వేయిస్తున్నారు.. ఆ శిబిరాల నిర్వహణ... మందుల పంపిణీని కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. ఐటీడీఏ పరిధిలోని తండాలు, గిరిజన గూడేలను వైద్యారోగ్య సిబ్బంది సందర్శించి అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, అవసరమైన వారిని జిల్లా, రాష్ట్ర రాజధానిల్లోని ప్రధాన ఆసుపత్రులకు తరలించడం చేయిస్తున్నారు. గిరిజన గూడేల్లో పారిశుద్ధం మెరుగుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు పాఠశాలలు, వసతిగృహాలను పరిశీలిస్తున్నారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత పరిశీలించడంతో పాటు హాస్టళ్లలో వసతులను పరిశీలిస్తున్నారు. అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ, ఉపాధ్యాయుల హాజరు, విద్యా బోధన, విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్నారు. సాగు కాలం కావడంతో ఎరువులు, పురుగు మందుల లభ్యత.. ఆయా దుకాణాల్లో నిల్వలు, రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. రైతుల అవసరాలకు తగినట్లు ఎరువుల సరఫరాకు కృషి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం సక్రమంగా అమలు చేసేందుకు కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావడంతో కలెక్టర్లు గ్రామాల్లో పర్యటిస్తూ నిర్మాణ నాణ్యత, సిమెంట్, ఇసుక లభ్యత, లబ్ధిదారులతో మాట్లాడుతూ వేగవంతమైన నిర్మాణాలకు తోడ్పడుతున్నారు. దాదాపు దశాబ్దకాలం తర్వాత గ్రామాల్లో రేషన్ కార్డుల సరఫరా జరుగుతోంది. రేషన్ కార్డులకు సంబంధించి కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులు, వాటి పరిశీలన, అర్హులకు కార్డుల జారీ, పంపిణీని స్వయంగా పర్యవేక్షిస్తుండడంతో లబ్ధిదారులు సంతోషిస్తున్నారని ముఖ్యమమంత్రి కార్యాలయం పేర్కొంది.



# నెరవేరిన 401 మంది సొంత ఇంటి కల

### ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిన మరోవారం రోజులపాటు

### 1, 2 బిహెచ్‌కె ఫ్లాట్ల విక్రయం

### రూ.78 కోట్ల మేర ఆదాయం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** హైదరాబాద్ పరిసరాల్లోని ఘట్‌కేసర్ పోచారం, నాగోలు బండ్లగూడ ప్రాంతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మధ్య తరగతి వర్గాలకే నిర్దేశించిన ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియ శనివారం నాడు ముగిసింది. ఈ రెండు ప్రాంతాలలో ఫ్లాట్ల విక్రయానికి సంబంధించి గత నెల 4 వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్కెట్ కంటే చాలా తక్కువ ధరలతోనే, నో లాస్ నో ప్రాఫిట్ విధానం కింద మొత్తం 401 ఫ్లాట్లను విక్రయించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, ముందు ప్రకటించిన విధంగా లాటరీ విధానం ద్వారా ప్రాథమిక కేటాయింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ ఫ్లాట్ల విక్రయం ద్వారా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు సుమారు రూ. 78 కోట్ల మేర ఆదాయం సమకూరింది. పోచారంలో వరుసగా రెండోరోజు (శనివారం) కూడా పారదర్శకంగా ఈ అలాట్‌మెంట్ ప్రక్రియను నిర్వహించారు. ఇక్కడ అత్యధిక శాతం ఫ్లాట్లకు ఒక్క దరఖాస్తు వచ్చినవే ఉన్నాయి. రెండో రోజు 3 బిహెచ్ కె, సింగిల్ బెడ్ రూం ఫ్లాట్ల ప్రక్రియను ఘట్‌కేసర్ తహశీల్దార్ రజని, స్వగృహ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ నరేందర్ రెడ్డి తదితర అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఒక ఫ్లాట్‌కు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన సందర్భాల్లో లాటరీ తీసి కేటాయింపు జరిపారు.

ఇక్కడి త్రీబెడ్ రూం ఫ్లాట్లలో ఒకదానికి 69 దరఖాస్తులు రావడం విశేషం. అంతేకాకుండా బండ్లగూడలో దరఖాస్తు చేసుకుని లాటరీలో ఫ్లాట్లు రానివారికి కూడా పోచారంలో దరఖాస్తు చేసుకోడానికి అవకాశమిచ్చారు. ఇటువంటి వారి కోసం శనివారం మరోసారి లాటరీ ప్రక్రియను నిర్వహించి, కేటాయింపు దారులను ఎంపిక చేశారు. మరో వారం రోజుల పాటు కేటాయింపుబండ్లగూడ, పోచారం ప్రాంతంలోని మిగిలిన 1,2 బిహెచ్‌కె ఫ్లాట్లకు కూడా దరఖాస్తు చేసుకోడానికి తమకు కొంత సమయం ఇవ్వాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు, ఆగస్టు 8 వ తేదీ వరకు అవకాశమిస్తున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండి వి.పి.గౌతం తెలిపారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన (ఫస్ట్ కం ఫస్ట్ బేసిస్) ద్వారా ఫ్లాట్లను కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం కేవలం సింగిల్, డబుల్ బెడ్ రూం ఫ్లాట్లకు మాత్రమే అని ఆయన స్పష్టం చేశారు. 4 వ తేదీ నుంచి ఓపెన్ ఫ్లాట్ల వేలంఇదిలా ఉంటే నగర శివార్లలోని పలు ప్రాంతాల్లో స్వగృహ కార్పొరేషన్ కు చెందిన ఓపెన్ ఫ్లాట్లను బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించనున్నారు. 200 చ.గ. అంతకు మించిన విస్తీర్ణంలోని ఈ ఫ్లాట్ల విక్రయాలు ఆగస్టు 4(సోమవారం) నుంచి వరుసగా మూడు రోజుల పాటు జరగనున్నాయి. రంగారెడ్డి జిల్లా కుర్మల్ గూడలో 20 ఫ్లాట్లు (4 వతేదీ), అటు తరువాత మేడ్చల్-మల్కాజిగిరి బహదూర్‌పల్లి లోని 69 ప్లాట్లు, రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో (6 వతేదీ) 100 ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.

## యూరియాపై కేంద్రానివి తప్పుడు లెక్కలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రానికి యూరియా సరఫరాపై కేంద్రం చెబుతున్నవి తప్పుడు లెక్కలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు విమర్శించారు. రాష్ట్రానికి 9.80 లక్షల టన్నులు కేటాయించి, పార్లమెంట్‌లో మాత్రం 20.20 లక్షల టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం వల్ల తెలంగాణ రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌కు లేఖ రాసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల టన్నులు మాత్రమే కేటాయించిందని చెప్పారు. అది కూడా తక్కువగా సరఫరా చేయడం వల్ల యూరియా కొరత ఏర్పడిందన్నారు.

## బాలుడిపై సైబర్ పంజా!

### డ్రోన్ కెమెరా ఆశతో రూ.2.39 లక్షల దోపిడీ

### సిద్దిపేట జిల్లాలో ఘటన

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఇన్‌స్టాలో పెట్టిన వీడియో పోస్టు చూసి బాలుడు డ్రోన్ కెమెరా కొనుగోలు చేయాలనే ఆశ సైబర్ నేరస్తులు అడియాసలు చేశారు. ఏకంగా 2.39లక్షల విడతల వారీగా తీసుకొని లూటీ చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సయ్యద్‌నగర్‌కు చెందిన అలీ బీబీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆమె భర్త అలీ హుస్సేన్ సంపాదన నిమిత్తం దుబాయికి వెళ్లి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వచ్చిన డబ్బును భార్య అలీ బీబీ ఖాతాలో జమ చేసేవాడు. అయితే ఆ బ్యాంకు ఖాతాకు కొడుకు అజ్మద్దీన్ ఫోన్ నంబర్ లింక్ ఉంది. ఫోన్ పే, గూగుల్ పే వంటి ద్వారానే ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తూ గృహవసరాల కోసం సరుకులు తీసుకొస్తున్నారు. అయితే అజ్మద్దీన్ రెండు రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు చేస్తుండగా.. డ్రోన్ కెమెరా అమ్మబడును అని ఒక వీడియో కనిపించింది. ఆ వీడియో డిస్క్రిప్షన్‌లో ఫోన్ నంబర్ ఉండటంతో.. అజ్మద్దీన్ కాల్ చేసి తనకు డ్రోన్ కెమెరా కావాలని అడిగాడు. దీనికి అవతలి నుంచి రూ.50 వేలు పంపిస్తే డ్రోన్ కెమెరాను డ డెలివరీ చేస్తామని సమాధానమిచ్చారు. దీంతో మరోసారి ట్రాన్స్‌ఫర్ చేశాడు. మళ్లీ రాలేదని చెప్పడంతో ఇంకోసారి కూడా ఫోన్‌పే ద్వారా అజ్మద్దీన్ డబ్బులు పంపించాడు. తీరా చూస్తే బ్యాంకులో ఉండాల్సిన రూ.2.39లక్షలు ఖాళీ అయ్యాయి. దీంతో రాయపోల్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మీర్‌పేట్ పిఎస్ మహిళాకానిస్టేబుల్ మృతి

### గత నెలలో ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఆగస్టు 2, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని రాచకొండ పోలీస్ కమీషరేట్ పరిధి కిందకు వచ్చే మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళా కానిస్టేబుల్ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్వాపరాల్లోకి వెళ్తే.. స్థానిక మీర్‌పేట్ పిఎస్‌లో గత నాలుగు సంవత్సరాల నుండి ఉమెన్ పిసిగా విధులు నిర్వహిస్తున్న మనీషా (28) మీర్‌పేట్ మున్సిపల్ కార్పొ రేషన్‌లోని ప్రశాంతిహిల్స్ కాలనీలో భర్త సుధాకర్‌తో కలిసి నివసిస్తున్నది. అయితే గత నెల జూలై 25వ తేదీ శుక్రవారం ఉదయం జీవితంపై విరక్తి చెందిన ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. దీంతో భర్త సుధాకర్ ఆమెను కంచన్‌బాగ్ డిఆర్‌డిఓ ఆసుపత్రికి తరలించాడు. అయితే మెరుగైన చికిత్స కోసం మోజంజాహి మార్కెట్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూనే మనీషా శనివారం ఉదయం తుదిశ్వాస విడిచింది. ఈ నేపథ్యంలో మృతురాలి తండ్రి కాట్రావత్ కిష్ట కూతురి మృతిపై మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే తన కూతురు మరణంపై ఎవరి మీద అనుమానం లేదనీ ఆర్థిక సమస్యలతో మనస్థాపం చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి కిష్ట తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ శంకర్‌కుమార్ నాయక్ తెలిపారు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు.



మనీష (ఫైల్)

## సింగరేణి బొగ్గుగనుల్లో గోడ కూలి కార్మికుడి మృతి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** సింగరేణి బొగ్గుగనుల్లో తీవ్ర విషాదం జరిగింది. సైడ్ గోడ కూలి ఓ కార్మికుడు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోల్‌మైనింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాచపల్లి శ్రవణ్ కుమార్ (32) మందమర్రి సింగరేణి ఏరియాలోని కేకే 5 గనిలో సెకండ్ షిఫ్ట్‌లో సైడ్ గోడ కూలిపోయి బొగ్గుపెల్లలు పడడంతో కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు అప్రమత్తమై రామకృష్ణాపురంలోని ఆస్పత్రికి తరలించగా... అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు.అధికారుల నిరక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, శ్రవణ్ మృతి చెందాడని పలు యూనియన్లు మండిపడ్డాయి. బొగ్గు గనుల్లో సెఫ్టీ మెజర్స్ పాటించడం లేదని, కార్మికుల భద్రతను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు బావుల్లో తరుచుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, కానీ పట్టించుకునే నాథుడు లేదని ధ్వజమెత్తారు. బొగ్గు బావుల్లో తక్షణమే భద్రతా ప్రమాణాలను పెంచాలని యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు.


# చెరువులు, కుంటల పరిరక్షణతో భూగర్భజలాల పెంపు

### త్వరలో భూగర్భ జల సంరక్షణ సమావేశం ఏర్పాటు

### ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌తో సమావేశమైన రైతు కమిషన్

**హైదరాబాద్,ఆగస్టు 2,ప్రభాతవార్త:** చెరువులు, కుంటల పరిరక్షణ భూగర్భజలాల పెంపుకు సాధ్యమవుతోందని యథేచ్ఛగా భూగర్భజలాల వినియోగం తగ్గించాలని నీటిపారుదలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు రాష్ట్ర సచివాయలంలో శనివారం ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ అయ్యింది. ఈ భేటీలో కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి వున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ జలవిధానం ఒకటి సమగ్రం తీసుకొని రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతు కమిషన్ ఆధ్వర్యంలో భూగర్భజల సంరక్షణ సమావేశం త్వరలో ఏర్పాటు చేసి నిపుణుల సూచనలు తీసుకొని ఒక విధానం ఏర్పాటు చేసుకొందామని తెలిపారు. అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతు కమిషన్ చేసిన కార్యక్రమాలను వివరించడంతో పాటు రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై మంత్రికి కమిషన్ సూచనలు చేసింది. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలనీ చెప్పింది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేసింది. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంత మయ్యాయని వివరించింది.

కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లే ఔట్లు వేయడం, వాటర్ బాడీస్ కు వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని వివరించింది. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, గ్రౌండ్ వాటర్ లెవల్స్ పడిపోవడం జరిగిందని వివరించింది. రాష్ట్రంలో చెరువులు కాపాడుకోవడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ తెలిపింది.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చెరువులు కుంటల సంరక్షణపై నివేదిక అందిస్తున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

# బిసి రిజర్వేషన్ల కోసం సంఘటితంగా సమరం

### కాంగ్రెస్ పోరాడుతుంటే.. బిజెపి అడ్డుకుంటోంది

### మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్,ఆగస్టు 2,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకై బీసీలందరూ సంఘటితంగా పోరాటం చేయడమే ఏకైక మార్గమని మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. ఈమేరకు శనివారం తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న డిమాండ్ నెరవేరే అవకాశం ఇప్పుడు దగ్గర్లో ఉందని, కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దీనిని అడ్డుకుంటోందని ఆరోపించారు. బీసీలకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే, తెలంగాణ రాష్ట్రంలోని బీసీలందరూ ఏకమై, ఒకే నినాదంతో ముందుకు రావాలని సూచించారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ఎల్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల అమలు కోసం ముందుకు రావాల్సిన రాజకీయ పార్టీలు రెండు నాలుకల ధోరణి అవలంబించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, బీసీ అయిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తొండి సంజయ్ మాట్లాడుతున్నాడని తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ పార్టీ అగ్రవర్ణాల పార్టీ అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 42 రిజర్వేషన్లు ఇస్తామంటే బిజెపి పార్టీ మద్దతు ఇవ్వకుండా మోసం చేస్తున్నది పార్ల మెంట్ సమావేశం లో బిల్లు ను ప్రవేశ పెట్టాలని లేకపోతే రాబోయే రోజులు బీసీ లు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. టిజెఎస్ పార్టీ ఈరౌండ్ టేబుల్ సమావేశంలో ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 42బిసిల రిజర్వేషన్ బిల్లు ను ప్రవేశ పెట్టి చట్టంచేసి తమిళనాడు తరహాలో రాజ్యాంగం లో 9షెడ్యూల్ చేర్చి బిసిలకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని తీర్మానం చేశారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ ముదిరాజ్ అధ్యక్షత జరిగిన ఈసమావేశంలో మేకపోతుల నరేందర్‌గౌడ్, దాసు సురేష్, బీసీ సంఘాల నేతలు గణేష్ చారి, లక్ష్మణ్ యాదవ్, సాంబశివ గౌడ్, సంతోష్ ముదిరాజ్, శివ ముదిరాజ్, మహేష్ యాదవ్, పల్లె వినయ్, ధర్మార్జున్, బైరి రమేష్, లక్షి ృ, ఎం. నరసయ్య, జస్వంత్, మోహన్ రెడ్డి, ధార సత్యం, జావేద్, గోపాల్ రెడ్డి, బట్టల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వి.హనుమంతరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్, రమేష్, పి.ఎల్ విశ్వేశ్వరరావు తదితరులు

భారతదేశంలో నిరుద్యోగుల్లో అత్యధికంగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఉండటం బాధాకరంగా ఉంది. దేశంలో 83 శాతం మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉంటున్నారు. ఇంజినీరింగ్‌లో కూడా కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఎక్కువగా నిరుద్యోగులుగా ఉంటున్నారు. ఇంజినీరింగ్ నిరుద్యోగుల్లో 7.5 శాతంమంది కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు నిరుద్యోగులుగా ఉంటున్నారు. దీనివల్ల ఈ రంగం నిరుద్యోగ డిగ్రీ హోల్డర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఇంజినీరింగ్ వారి తరువాత 46శాతం బిజినెస్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రతిష్టాత్మకమైన అర్హతలు ఉన్నప్పటికీ యువ నిపుణులు ఉపాధిని పొందేందుకు ఇబ్బందిపడుతున్నారు. ఇక ఆర్ట్ హిస్టరీ చదివిన వారిలో 3శాతం మంది నిరుద్యోగులుగా ఉంటున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. సిఏ పూర్తిచేసిన వారు సైతం నిరుద్యోగులుగా ఉన్నారని ప్రజలు తరచుగా చెబుతుంటారు. దేశంలో సుమారు 20వేల మంది కొత్తగా అర్హత సాధించిన సిఏలు ఒకే ప్రయత్నం లోనే మార్కెట్‌లోకి ప్రవేశించారు వారు నిరుద్యోగులుగానే కొనసాగుతున్నారు. చివరికి ఐఐటీలు, ఎన్ఐటీల్లో చదువును పూర్తి చేసుకున్న వారు సైతం నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. గత సంవత్సరం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లలో 24,230 మంది ఐఐటి, ఎన్ఐటి విద్యార్థులల్లో దాదాపు 8వేల మంది విద్యార్థులకి ఉద్యోగాలు లభించలేదు. ఆంత్రోపాలజీ గ్రాడ్యుయేట్ల 9.4 శాతంమంది నిరుద్యోగులుగా ఉన్నారు. భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన వారిలో 7.8 శాతం మంది నిరుద్యోగులుగా మారుతు న్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరి కొన్ని రాష్ట్రాల్లోనూ ఇంజనీరింగ్ పూర్తి చేసిన గ్రామీణప్రాంతనిరుద్యోగులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారు.

# పెరుగుతున్న నిరుద్యోగం

**నాగమణీంద్ర పల్లాపు**

భారతదేశం జనాభాలో ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి చేరింది. జనాభాలోనే కాదు.. నిరుద్యోగంలో కూడా నంబర్ వన్ స్థానంలోనే ఉన్నట్టు కొన్ని సర్వేలను బట్టి చూస్తే తెలుస్తోంది. ప్రపంచంలోనే ఎక్కువ మంది జనాభా ఉన్న దేశంగా ఉన్న ఇండియాలో యువత కూడా ఎక్కువగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సందర్భాల్లో చెబుతూ వస్తోంది.. ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం భారతదేశమని.. ఇక్కడ ఏదైనా చేయడానికి సరిపడా యువత ఉన్నారని చెబుతోంది. ఇది వాస్తవమే. అయితే పనిచేయడానికి యువత సిద్ధంగా ఉన్నప్పటికీ వారికి పని కల్పించే వారు లేరు. దేశంలో ఉన్న యువతకు ఉపాధి లేక ఖాళీగా తిరగాల్సి న పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగుల్లో కూడా రెండు రకాల నిరుద్యోగులు ఉన్నారు. వారిలో చదువుకుని ఎటువంటి ఉపాధి లేకుండా ఉన్న నిరుద్యోగులు ఒకరకమైతే.. చదువు లేకుండా చేయడానికి పనిలేకుండా ఉండే నిరుద్యోగులు మరోరకం. ఇలా రెండు రకాల నిరుద్యోగులతో భారతదేశం కొనసాగుతోంది. భారతదేశంలో నిరుద్యోగుల ఖచ్చితమైన సంఖ్యను గుర్తించడం కష్టమే అయినప్పటికీ, భారతదేశ గ్రాడ్యుయేట్ జనాభాలో గణనీయమైన భాగం నిరుద్యోగులుగా ఉన్నారని నివేదికలు సూచిస్తున్నాయి. 25 ఏళ్లలోపు వారికి ఇది 42.3 శాతం నుంచి 54.8 శాతం వరకు ఉంటుందని అంచనా. ముఖ్యంగా ఇంజినీరింగ్, వ్యాపారం(కామర్స్) వంటి రంగాలలో గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో డిగ్రీలు పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగాలు దొరకడం కష్టమవుతోందని ది వైర్ నివేదిక ప్రకారం తెలుస్తోంది. భారతదేశంలో దాదాపు 28మిలియన్ల మంది విద్యావంతులైన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం వెతుకుతున్నారు. దాదాపు 100 మిలియన్ల మంది వ్యక్తులు నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. ప్రధానంగా మహిళలు పనికోసం వెతకడం మానేశారని నివేదికలు చెబుతున్నాయి. భారత్‌లో నిరుద్యోగం తాండవిస్తోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో), మానవాభివృద్ధి సంస్థ(ఐహెచ్‌డీ) సంయుక్త అధ్యయనంలో వెల్లడైంది. 'భారత నిరుద్యోగ నివేదిక-2024'లో పలు కీలక విషయాలను వెల్లడించింది.

ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ నివేదిక ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యోగాలు లేక ఈసురోమంటున్నారని తెలిపింది. 2022 నాటికి దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83శాతం మంది యువతేనని ఆ అధ్యయనం పేర్కొంది. అంతేకాక మొత్తం నిరుద్యోగుల్లో చదువుకున్న యువత 2000నాటికి 54.2 శాతం ఉండగా 2022 నాటికి అదికాస్త 65.7శాతానికి పెరిగింది. ఈ పరిస్థితి భారత్



వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి తీవ్ర ఇబ్బందేనని నివేదిక స్పష్టంచేసింది. ప్రస్తుతం నిరుద్యోగులైన యువ విద్యావంతుల్లో మహిళలు 76.7 శాతంగా ఉంటే పురుషులు 62.2 శాతం మంది ఉన్నారు. కరోనా కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు భారీగా తగ్గి నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. 2000లో ఉద్యోగాలు పొందిన యువతలో సగం మంది స్వయం ఉపాధిని పొందినవారే. వీరిలో 13 శాతం మంది రెగ్యులర్, 37శాతం మంది తాత్కాలిక ఉద్యోగాలు దక్కించుకున్నారు. వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో 70 నుంచి 80 లక్షల యువశక్తి అందుబాటులోకి రానుంది. దేశంలో గణనీయమైన శాతంలో గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. ఇండియా టుడే ప్రకారం, ఇండియా స్కిల్స్ రిపోర్ట్-2025 ప్రకారం భారతీయ గ్రాడ్యుయేట్లలో కేవలం 54.8 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారని సూచిస్తుంది. మెర్సర్,మెట్ల్స్ గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్- 2025 ఈ సంఖ్య ఇంకా తక్కువగా, 42.6 శాతం ఉంటుందని అంచనా వేసింది. చాలా మంది గ్రాడ్యుయేట్లు నిరంతర నిరుద్యోగం కారణంగా చురుకుగా ఉద్యోగాల కోసం వెతకడం మానేస్తున్నారు. దీని వలన వాస్తవ నిరుద్యోగ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఆటోమేషన్, ఏఐ మూలంగా ప్రభావితమైన అభివృద్ధి చెందుతున్న ఉద్యోగ మార్కెట్ నైపుణ్యాల అంతరాన్ని సృష్టిస్తోందని.. దీని వలన గ్రాడ్యుయేట్లకు తగిన ఉపాధి దొరకడం కష్టమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంజినీరింగ్, కామర్స్ వంటి రంగాలలో గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగ రేటు ఎక్కువగా ఉంది. సుమారు 83 శాతం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, 46 శాతం బిజినెస్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా మిగిలిపోయారు. ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ చేసిన వారే కాకుండా చాలా మంది గ్రాడ్యుయేట్లు కూడా నిరుద్యోగులుగా ఉన్నారు. వారి విద్యా అర్హతలు, నైపుణ్య సెట్‌లకు సరిపోని ఉద్యోగాలలో పనిచేస్తున్నారు. వివిధ అంశాలు గ్రాడ్యుయేట్ నిరుద్యోగానికి దోహదం చేస్తాయి. నైపుణ్యాలు, ఉద్యోగ అవసరాల మధ్య అసమతుల్యత, ఆర్థిక మందగమనం, ఉద్యోగ మార్కెట్ అభివృద్ధి చెందుతున్న స్వభావం వంటివి నిరుద్యోగానికి కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో చదువుకున్న నిరుద్యోగులు ఎక్కువగానే ఉన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబిఏ, ఎంసిఏ వంటి ఉన్నత కోర్సులు చేసిన వారు కూడా నిరుద్యోగులుగా మారుతున్నారు. వారితోపాటు పిహెచ్‌డిలు చేసిన వారు కూడా నిరుద్యోగులుగా మారుతున్నారు. ప్రతి ఏడాది లక్షలాది మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు తమ చదువును ముగించుకొని నిరుద్యోగులుగా రోడ్లపైకి వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఏడాదిలో సుమారు 50 వేల మంది ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేస్తున్నారు. అలాగే ఏపీలో ఇంతకంటే ఎక్కువగా సుమారు 60వేల మంది ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకుంటున్నారు. చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటారు. అవి కేంద్ర ప్రభుత్వ,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఏవైనా బాగుంటుందని చూస్తారు. అయితే చదువుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారుతుంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్లను జారీ చేస్తాయి. వాటి ద్వారా వచ్చే ఉద్యోగాలు తక్కువగానే ఉంటాయి. ఇక ప్రైవేటు ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఎక్కువగానే ఉంటాయి. వాటిలో కూడా చదువుకున్న వారందరికీ వచ్చే అవకాశం లేదు. చదువుకున్న వారిలోకూడా నైపుణ్యాలు(స్కిల్స్) ఉన్న వారికి ఉద్యోగవకాశాలు ఎక్కువగా ఉంటుండగా.. సాధారణ డిగ్రీ కోర్సులు చేసిన వారికి తక్కువగా ఉంటున్నాయి. చదువుకున్న వారిసంఖ్య లక్షల్లో ఉండటం.. పోస్టుల సంఖ్య వందల్లో ఉండటంతో పోటీ విపరీతంగా ఉంటుంది. చివరికి ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, ప్రైవేటు ఉద్యోగాలకి సైతం చిన్నస్థాయి ఉద్యోగాలకి సైతం ఉన్నత చదువులు చదివిన వారు పోటీపడుతున్న వైనం కనబడుతోంది. గతంలో తెలంగాణతోపాటు, ఆంధ్రప్రదేశ్‌లోనూ కానిస్టేబుల్ పోస్టులకి పిహెచ్‌డీ చేసిన వారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సమయంలో నిరుద్యోగుల కోసం వయోపరిమితిని ప్రభుత్వం పెంచడంతో రిజర్వేషన్ పొందే అభ్యర్థులు 50సంవత్సరాలు పైబడిన వారు సైతం ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మధ్యకాలంలో ముంబయి పోర్టులో గ్రూప్-4 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేస్తే అందులో గ్రూప్-4 ఉద్యోగానికిసైతం పిహెచ్‌డీ, పీజీలు, ఇంజినీరింగ్ చేసిన వారు దరఖాస్తు చేసుకున్నారు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. దేశంలో నిరుద్యోగం ఏ మేరకు ఉందో. పీహెచ్‌డీ,డిగ్రీ కలిగి ఉండటం కేవలం ఒకప్రత్యేకత మాత్రమే కాదు. ఇది ఒక బలీయమైన ప్రయోజనం. ఒక సంస్థ నివేదించిన ప్రకారం పీహెచ్‌డీ హోల్డర్ల నిరుద్యోగిత రేటు 1శాతం కంటే తక్కువగా ఉండటంతో, జాతీయ సగటు 7శాతంతో పోలిస్తే, అధిక నైపుణ్యం కలిగిన వ్యక్తుల డిమాండ్ స్పష్టంగా ఉందని తెలుస్తోంది. ఇండియాలో ఎంబిబిఎస్ చదివితేఉద్యోగం వస్తుందనే అభిప్రాయం బలంగా ఉంటుంది. అయితే దేశంలో ఎంబిబిఎస్ పూర్తిచేసిన వారిలో సైతం 16 శాతం నిరుద్యోగులుగా ఉంటున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ●

---

కర్ణాటక

# అ'ధర్మస్థల' మా?

**ఎ.వి.వి ప్రసాద్**

దాచేస్తే దాగని సత్యాలు మన చుట్టూ అనేకానేకం కనిపిస్తూంటాయి. అయితే అవి బహిర్గతం కాకుండా అనేక రకాల 'శక్తులు' కూడా పనిచేస్తుంటాయి. ఆ శక్తులు ఇవీ అని చెప్పలేం. కొన్ని సార్లు రాజకీయ శక్తులు, మరి కొన్ని సార్లు వ్యాపార శక్తులు, ఇంకొన్ని సార్లు ఇతర సామాజిక శక్తులు వాటిలో ఉంటాయి. కొన్ని సందర్భాల్లో అన్నీ కలిసి పనిచేస్తుంటాయి కూడా. కర్ణాటకలోని ధర్మస్థలలో ఇటీవల వెలుగులోకి వచ్చిన అసహజ మరణాల గురించి ఆరా తీస్తుంటే అక్కడ ఈ అన్నిశక్తులు కలగలిసి పనిచేశాయేమో! అనే అనిపిస్తుంది. ఒకరు,ఇద్దరు కాదు.. కొన్ని వందల మంది పురుషులు, మహిళలు ధర్మస్థల క్షేత్రంలో అసహజ మరణాలకు గురయ్యారనీ, వారిలో కొందరు స్థానికులుకాగా, కొందరు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారనీ తెలుస్తోంది. ధర్మస్థల ఒక పెద్ద పుణ్యక్షేత్రం గనుక నిత్యం ఎందరో భక్తులు, పర్యాటకులు వచ్చి వెళ్తూండడం సాధారణమే. అయితే వారిలో కొందరు అక్కడే అదృశ్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అలా అదృశ్యమైన వారిలో కొందరి మృతదేహాలను క్షేత్రం పరిసర ప్రాంతాల్లోనే ఖననం చేస్తున్నట్లు కూడా తెలుస్తోంది. తమవారి ఆచూకీ తెలియడం లేదనే ఫిర్యాదులు వచ్చినపుడు క్షేత్రంపై, అక్కడి పరిస్థితులపై బయటివారికి అనుమానాలు కలుగుతున్నాయి. లేదంటే గుట్టుచప్పుడు కాకుండా ఆ మృత దేహాలు 'భూస్థాపిత'మైపోతున్నాయి. దీని వెనుక గల మిస్టరీ ఏమిటన్నదే అంతుచిక్కకుండా ఉంది. చాలా కాలం నుంచి లెక్కలేనన్ని మృతదేహాలను అలా పూడ్చిపెట్టిన ఓ పారిశుధ్య కార్మికుడు దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీ అరుణ్‌కు జూలై రెండోవారంలో రాసిన ఓ లేఖ తొలుత దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.' 1998 నుంచి 2014 మధ్య వందకు పైగా మృత దేహాలను ఖననం చేశాను. నా చేత ఆ పనులు చేయించిన కొందరు వ్యక్తులు మా కుటుంబానికి చెందిన యువతి పైనే అఘాయిత్యానికి పాల్పడడంతో బెదిరిపోయి మేము ఆ ప్రాంతం వదలి పారిపోయాం. కానీ పాప భీతితో వణికిపోతూ ఈ లేఖ రాస్తున్నా. తగిన రక్షణ కల్పిస్తే అన్ని నిజాలు బయటపెడతా ' అంటూ అతడు ఆ లేఖలో రాశాడు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. ప్రభుత్వానికి సమాచారం తెలియగానే జూలై 19న నలుగురు సీనియర్ ఐపిఎస్‌లతో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఆ కార్మికుడు ఇచ్చిన కొన్ని ఆధారాలతో 13 పాయింట్లను సిట్ గుర్తించి అక్కడ తవ్వడం మొదలు పెట్టింది. గత బుధ వారం (30,జూలై) ఒక పాయింట్ వద్ద తవ్వుతుం డగా ఓ అస్థి పంజరం అవశేషాలు



సిట్

పాక్షికంగా బయట పడినట్లు సమాచారం. కొంత దూరంలో కొన్ని ఎముకలు కూడా దొరికాయి. కొన్ని ఆధారాలను బట్టి ఆ అస్థి పంజరం పురుషునిదిగా భావించారు. మరో చోట ఓ పుర్రె కనిపించిందనీ,అది ఓ మహిళది కావచ్చనీ అంటున్నారు. అవశేషాలు ఎవరివనేది ఒక సందేహమైతే,అవి అసహజ మరణాలకు చెందినవేనా? అన్నది మరో సందేహం. పారిశుధ్య కార్మికుని లేఖవల్ల కొన్ని వందల అసహజ మరణాలు సంభవించాయనే విషయం స్పష్టమవుతోంది. అలా ఖననం చేసింది, చేస్తున్నది అతనొక్కడే కాదు. అతనికి ముందు, తర్వాత కూడా చాలా జరిగాయని సిట్ దర్యాప్తు ద్వారా తెలుస్తోంది. దక్షిణ కన్నడ జిల్లాలోని ధర్మస్థల మంజునాథ స్వామి కొలువైన గొప్ప పుణ్యక్షేత్రం. ఆలయం మినహా ఇతర ఎలాంటి ప్రాధాన్యాలు ఆ ప్రాంతానికి లేవు. రాజ్యసభ సభ్యుడైన డా. వీరేంద్ర హెగ్డే ఐదు దశాబ్దాలుగా ఆలయం ధర్మాధికారిగా ఉంటు న్నారు. భక్తుల సంఖ్య రానురాను పెరుగుతున్న సమయంలో తాజాగా వచ్చిన ఆరోపణలు భక్తుల్లో తీవ్ర భయాందోళనలకు కారణమవుతు న్నాయి. గత పదేళ్లలో ధర్మస్థల చుట్టుపక్కల 450 మంది పైగా అదృశ్యమైనట్లు పోలీసు లెక్కల ప్రకారం తెలుస్తోంది. దానికి రెండు మూడు రెట్లు ఎక్కువే వాస్తవ సంఖ్యలుండొచ్చని స్థానికులు అంటున్నారు. నేత్రావతి నది ఇసుక పాయల్లో కలిసిపోయిన శరీరాలుఎన్నో, ఎన్నెన్నో! మంజునాథ ఆలయానికి సంబంధం ఉన్నవ్యక్తులే ఈ అదృశ్య మరణాల వెనుక కూడా ఉన్నారనీ, అందుకే తాను అక్కడి నుంచి పారిపోయాననీ పారిశుధ్య కార్మికుడు చెబుతు న్నాడు. అదే నిజమైతే ఇది చాలా పెద్దమిస్టరీయే అవుతుంది. గ్రామం నుంచి ఢిల్లీ దాకా ఎందరి పునాదులో కదులుతాయి. కానీ పాతికేళ్లుగా మిస్టరీని తొక్కిపెడుతున్నవారు ఇప్పుడు బయ టకు రానిస్తారా అన్నది మరో సందేహం. ఆ మృతదేహాలేగాక ఎన్నో నిజాలు కూడా అక్కడ భూస్థాపితమవుతున్నాయి. వాటిని బయటకు లాగాలంటే సిట్ దర్యాప్తు సరిపోతుందా! అన్నది మరోసందేహం. అసహజ మరణాలకు సంబం ధించిన ఆరోపణలు రావడంతో 2015లోనే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రప్ప కమిటీని ఏర్పాటు చేసింది. తర్వాత మూడేళ్లకు ఆ కమిటీ నివే దికను సమర్పించింది. యేడాదికి 300 మంది పురుషులు, మహిళలు, కొందరు బాలలు కూడా అక్కడ అసహజ మరణాలకు గురైనట్లుగా ఆ కమిటీ గుర్తించింది. కొందరు ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు కానీ అందుకోసం ఎవరైనా ధర్మస్థల దాకా వస్తారా? అన్నదీ సందేహమే. అక్కడ అదృశ్యమైన వారిలో కొందరు డాక్టర్లు, జర్నలిస్టులు కూడా ఉన్నారట. సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిపో తున్న ఈ ఉదంతంపై పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిగితేనే అసలు వాస్తవాలు వెలుగులోకి రావచ్చు. లేకుంటే ఉగ్రప్ప కమిటీ నివేదిక మూలపడినట్లు గానే సిట్ దర్యాప్తు కూడా ఏమీ తేల్చలేకపోవచ్చు. ఈ అసహజ మరణాల మిస్టరీ తేలకపోతే పుణ్య క్షేత్రమైన ధర్మస్థల చరిత్రలో అధర్మస్థలగా మిగిలిపోయే ప్రమాదం ఉన్నదని భక్తులు వాపోతున్నారు. మిస్టరీ వెనుక గల అదృశ్య హస్తాన్ని త్వరగా కనుగొనవలసిన అవసరం ఎంతైనా ఉంది. ●

---

అమెరికా

# 'నోబెల్ శాంతి' కి ట్రంప్ తహతహ!

**గన్ని మోహన్**

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు నోబెల్ శాంతి పురస్కారంపై మక్కువ రోజు రోజుకూ పెరుగుతూ వస్తోంది. ఏకంగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలని ప్రకటించారు. ప్రపంచ దేశాల్లో ఆరు శాంతి ఒప్పందాలకు ట్రంప్ దౌత్యం నెరపారని, అణు యుద్ధాలను సైతం విరమింప చేసారంటూలీవిట్ పేర్కొనడం గమనార్హం. గడచిన ఆరునెలల్లో నెలకొక వివాదం చొప్పున వివాదాలను పరిష్కరించారని, ఆరు శాంతి ఒప్పందాలు జరగడంలో ట్రంప్ ఎనలేని కృషి చేసారని లీవిట్ చెప్పుకొచ్చారు. అసలు ఇప్పటికే ట్రంప్ తాను స్వయంగా ఉక్రెయిన్, రష్యా, ఇరాన్-ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణలు తానే నివారించానని నోబెల్ శాంతి పురస్కారం అంటూ ఇస్తే తనకే ఇవ్వాలంటూ గతంలోనే ప్రకటించారు. అందుకు తగినట్లుగానే ఆయనకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలంటూ వివిధ దేశాధినేతలు కూడా ఎండార్స్‌మెంట్‌లు ఇస్తామని ప్రకటించారు. అధ్యక్షుడుగాపాలన పగ్గాలు చేపట్టిన ఏడాదిలోనే ట్రంప్ పాకిస్థాన్, ఇండియా, థాయిలాండ్ కాంబోడియా, ఇజ్రాయెల్ ఇరాన్, రువాండా, కాంగో, సెర్బియా కొసావో, ఈజిప్టు ఇథియోపియా దేశాలమధ్య రగిలిన రావణకాష్టాలన్నింటినీ విరమింపచేసి ఆదేశాల మధ్య సఖ్యతకు ఎంతో కృషిచేసారంటూ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ చెప్పుకొచ్చారు. ఇక ఇండియా పాకిస్థాన్‌లమధ్య ఆపరేషన్ సింధూర్‌ను విరమింపచేసింది తానేనని ట్రంప్ ఏకంగా 30సార్లు అయినా చెప్పి ఉంటారని భారత్‌లోని విపక్షాలు చెపుతున్న సంగతి తెలిసిందే. సింధూర్ ముగిసిన వెంటనే పాక్‌కు ఐఎంఎఫ్‌రుణం మంజూరులోను, యుద్ధ తాత్కాలిక విరమణలోను సాయం చేసారనుకుందో ఏమోకానీ పాక్‌తనంత తానుగా డొనాల్డ్‌ట్రంప్‌ను నోబెల్ శాంతిపురస్కారానికి ఎంపికచేయాలని తమ దేశం తరపున ఎండార్స్‌మెంట్ ఇస్తామని ప్రకటించేసింది. ఇప్పటివరకూ ట్రంప్‌నకు నోబెల్‌శాంతి బహుమతి ఇవ్వాలంటూ ఇజ్రాయెల్, పాకిస్థాన్ ప్రధాన మంత్రులతోపాటు ఆఫ్రికన్ గ్రూప్ దేశాల నేతలు గాబన్, గెయినా బిస్సావు, లైబీరియా, మారుటేనియా, సెనెగల్ వంటి దేశాలు ట్రంప్‌నకు శాంతిపురస్కారానికి తాము ఎండార్స్‌మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాయి. రువాండా కాంగో శాంతి ఒప్పందంలో ట్రంప్ విశేష కృషిచేసారంటూ ఆదేశాలు ప్రస్తుతించాయి. కాంబోడియా డిప్యూటి పిఎం సున్ ఛాంథోల్ ఇప్పటికే ట్రంప్‌నకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలంటూ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. తమ దేశానికి సుంకాలు తగ్గించడంలోను, పొరుగుదేశంతో



డొనాల్డ్‌ట్రంప్

ఉన్న వివాదాలు పరిష్కరించడంలోట్రంప్ కీలక పాత్రపోషించారని డిప్యూటి పిఎం చెప్పుకొచ్చారు. అలాగే అమెరికా కాంగ్రెస్ మాన్ బడ్డీ కార్టర్ ట్రంప్‌ను నామినేట్ చేస్తామని ప్రకటించారు. మరో కాంగ్రెస్ మ్యాన్ డారెల్ ఇస్సా కూడా తన నామినేషన్‌ను ట్రంప్‌కోసం పంపించారు. మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనేందుకు ట్రంప్ కీలక పాత్రపోషించారంటూ ఆయన తన నామినేషన్‌లో వివరణ ఇచ్చారు. వివిధ దేశాలు, ప్రముఖులు, సెనేట్, రిపబ్లికన్లు ఎండార్స్‌మెంట్ ఇవ్వడం అటుంచితే అసలు ట్రంప్‌కే నోబెల్ శాంతిపురస్కారంపై ఎనలేని మక్కువ ఏర్పడింది. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. 2009లో అప్పటి డెమొక్రాట్ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు శాంతిపురస్కారం లభించింది. అలాగే 2002 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్‌కు నోబెల్ శాంతిపురస్కారాలు లభించాయి. ఒబామాకు అయితే గెలిచి పాలన పగ్గాలు చేపట్టిన తొమ్మిదినెలలకే ఆయనకు శాంతిపురస్కారం లభించింది. నోబెల్ పురస్కారాలకు గాను మరుసటి సంవత్సరం జనవరి 31 నాటికే దరఖాస్తులు పంపించాలి. ట్రంప్ తరపున వెళ్లాయోలేదో తెలియదు కాని ఈసారి తమ అధ్యక్షుడికే ఈ శాంతిపురస్కారం లభిస్తుందంటూ శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ ధీమాగా ఉన్నారు. ఓ పక్క వాణిజ్యఒప్పందాలకు రావాలంటూ ప్రపంచ దేశాలపై ఒత్తిడిని పెంచుతూ సామ,దాన దండోపాయాలను ఉపయోగించి తనదారికి తెచ్చుకుంటూ ఒప్పందాలు చేసుకుంటున్న ట్రంప్‌శాంతిపురస్కారానికి ఎలా అర్హులని డెమొక్రాట్లు ప్రశ్నిస్తున్నారు. ఇరాన్‌పై ఏకపక్షంగా చేసిన దాడి శాంతిపురస్కారానికి దోహదం చేస్తుందా అని నిలదీస్తున్నారు. ఉక్రెయిన్,రష్యాల మధ్య గడచిన నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధకాండను ఇప్పటికీ విరమింపచేయలేకపోయారని, పుతిన్‌తో శాంతిచర్చల్లో ఘోరంగా విఫలమైన ట్రంప్ శాంతిపురస్కారానికి ఎలా అర్హులు అవుతారన్న విమర్శలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. నిజానికి జీ7 దేశాలు కానీ, జీ20 దేశాల్లో ఏ ఒక్క అభివృద్ధిచెందిన దేశం కూడా నోబెల్ పురస్కారానికి ట్రంప్ పేరును ప్రతిపాదించలేదు, సరికదా సూచించను కూడా లేదు. ఉగ్రవాదంతో అట్టుడుకుతున్న దేశాల్లో ఏర్పడిన సరిహద్దు తగాదాలు పరిష్కరించడంలో ట్రంప్ అమెరికా ప్రయోజనాలను కాదని ఎప్పుడూ ముందుకుపోలేదన్న వాదన ఉంది. నోబెల్ ఎంపికలను పరిశీలిస్తే శాంతి పురస్కారానికి నార్వే పార్లమెంటు ఏర్పాటుచేసిన ఐదుగురు సభ్యుల కమిటీ నిర్ణయిస్తుంది. ప్రభుత్వ అధినేతలు, ప్రొఫెసర్లు, మాజీ పురస్కార గ్రహీతలు, శాంతిపరిశోధక సంచాలకులు వంటి వారి నామినేషన్లను మాత్రమే ఈఐదుగురు సభ్యుల కమిటీ అనుమతిస్తుంది. వాస్తవానికి నోబెల్ పురస్కారాలకు నామినేషన్లు ఈ ఏడాది జనవరి 31తోనే ముగిసాయి. మొత్తం 338 మంది ప్రముఖులు, 94 వివిధ సంఘాలు ఇందుకోసం దరఖాస్తులు చేసాయి. విజేతను అక్టోబరు నాటికి ప్రకటిస్తుంది. నార్వేలోని ఓస్లోలో డిసెంబరు 10వ తేదీ ఈ పురస్కారాల ప్రధానం ఉంటుంది. విజేతలకు బంగారుపతకం, డిప్లొమా, తొమ్మిది లక్షల అమెరికా డాలర్లు లభిస్తాయి. ఇప్పుడు ట్రంప్‌ను శాంతిపురస్కారం వరిస్తుందోలేదో ఆయన్ను పట్టిపీడిస్తున్నచిరకాల కోరికనెరవేరుతుందోలేదో చూడాల్సిందే. ●

---

# వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది భర్తీలో జాప్యమెందుకు?

**మన్నారం నాగరాజు**

బ్రిటిష్ పాలకుల ఆలోచనలు, విధానాలు, స్వాతంత్ర్య పూర్వ భారత్లో ఆరోగ్య సంరక్షణ నమూనాలపైప్రత్యక్ష ప్రభావం చూపాయి. స్వాతంత్ర్యానికి పూర్వం, బ్రిటిష్ వారి ఏలుబడిలో భారతదేశ పురోగతిపై పెద్దఎత్తున చర్చజరిగేది. అభివృద్ధి సూచనలు దేశాన్ని దీనస్థితిలో చూపడంలో, దానిపై పలురకాల చర్చలు సాగేవి. మౌలిక విద్య, ఆరోగ్యం, సంక్షేమం మొదలైన వాటికి సంబంధించి ప్రజలు అభివృద్ధి చెందకపోవటానికి,భారతదేశపు వెనుకబాటు తనానికి వలస పాలకులు, వారు సాగించిన దోపిడీయే ప్రధాన కారణమని జాతీయ ఉద్యమ కోణంనుంచి అభిప్రాయం వ్యక్తమయ్యేది. వైద్య సేవల లభ్యతపై గ్రామీణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాలు నెలకొని ఉన్నాయి. గ్రామీణ ప్రజలు స్థానికంగా వైద్యులుగా చలామణి అవుతున్న వారితో వైద్యం చేయించామంటున్నారు. మూఢనమ్మకాలతో, సహేతుకం కాని వ్యాధి నివారణ పద్ధతులను పాటిస్తున్నారు. గ్రామీణ పట్టణప్రాంత ప్రజల మధ్య అంతరానికి ఇది ఒక కారణం. భారతీయ ప్రజలు తక్కువ శక్తిమంతులుగా ఉండటానికి భారతీయ సమాజంలో వ్యవస్థలనే నిందించాల్సి ఉంటుందని వలస పాలకుల వాదం. భారత జాతీయ కాంగ్రెస్‌లోని ఆధునికులు, వామపక్షీయులు, తీవ్రవాదులు జాతీయ ఆరోగ్య విధానాలపై సలహా ఇచ్చారు. వలసపాలనతో రాజకీయంగా, సామాజికంగా, మేధాపరంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవటానికి భారతీయ మేధావి వర్గం జరిపే బహిరంగ చర్చల్లో ఆరోగ్యం, సామాజిక ఆచారాల అంశం కూడా భాగమైంది. ఆరోగ్య స్థితిగతులపై 1948లో సర్‌జాన్ భోరే కమిటీ నివేదిక వెలువరించింది. అప్పటినుంచి ఆరోగ్య రంగంలో, అందునా ప్రత్యేకించి గ్రామీణ భారతంలోని దీన పరిస్థితిని గురించి, జాతీయ వాదులే గాక బ్రిటిష్వారు కూడా బాహాటంగానే చర్చించడం మొదలైంది. బ్రిటిష్ భారత్లో ప్రతి వేయిమంది జనాభాకు మరణాల రేటు 22. అదే శిశువుల మరణాల రేటు ప్రతివేయి జనాభాకు 162గా కమిటీ నిర్ధారించింది. కమిటీ అంచనా సహేతుకంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. స్వతంత్ర భారతావనిలో ఆరోగ్య రంగంలో పురోగతి సాధనకు కమిటీ సిఫారసులు గొప్ప ముందడుగుగా పరిగణించారు. దేశం నలుమూలలా ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పాలి. ప్రతి పౌరుడికీ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తేవాలి. ఆరోగ్య సంరక్షణ ఖర్చు సామాన్యుడి తలకుమించిన భారంగా ఉండకూడదు. ప్రజానీకానికి ఉచితంగా ఆరోగ్య సంరక్షణను, రక్షిత తాగునీటిని, పారిశుద్ధ్యాన్ని, పౌష్టిహాకారాన్ని, మౌలిక విద్యను అందించాల్సి న కర్తవ్యం ప్రభుత్వంపై ఉంది. ఖర్చు భరించలేని కారణంగా ఎవరూ తగిన వైద్య సంరక్షణకు దూరం కాకూడదు. ఆరోగ్య సంరక్షణను కల్పించే వారి పాత్ర గురించి కమిటీ ప్రస్తావిస్తూ, వైద్యుడనేవాడు సామాజిక ఫిజీషియన్ అనీ, రోగాలబారి నుండి ప్రజలను కాపాడటమే గాకఆరోగ్య కేంద్రాలకు మార్గనిర్దేశం చేయడం అతడి బాధ్యత అని తెలిపింది. భారత్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు, కేంద్రీకృత సంస్థాగత నిర్మాణానికీ భోరే కమిటీ సిఫారసులు ప్రాతిపదిక అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల పాలనలో వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేయడంపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల హామీల్లో గొప్పగా ప్రకటించిన ఆరోగ్య తెలంగాణ, కార్పొరేట్ వైద్యం అంతా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చేలా కేసీఆర్ కిట్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రారంభించినప్పటికీ, భద్రత కలిగిన మౌలిక సదుపాయాలు, అవసరమైన సిబ్బంది భర్తీ, సమయానుకూల బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల అవి నిరర్థకంగా మిగిలిపోయాయి. జిల్లా ఆసుపత్రులు వైద్యులేక, ఫార్మసిస్టులేక, సిబ్బందిలేక కష్టాల్లో కూరుకుపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్యకార్యకర్తలు తగిన పరిమాణంలో లేక, ఉండే వారికీ జీతాలు సకాలంలోరాక, ఒత్తిడి, ఆక్రోశానికి గురయ్యారు. వైద్యరంగంలో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను బీఆర్ఎస్ భర్తీ చేయకపోవడం ద్వారా ప్రజారోగ్యంపాడైంది. అత్యవసర చికిత్స అవసరమైన సమయానికి అందక



ప్రాణనష్టం చెందిన ఘటనలు పలుమార్లు వార్తలయ్యాయి. పల్లెల్లో ప్రసూతి సేవలు, ప్రాథమిక చికిత్స అందే పద్ధతులు దారుణంగా నశించాయి. ఫార్మసిస్టులు, నర్సులు, మెడికల్ టెక్నీషియన్లు, డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం తగ్గింది. ఇదే సమయంలో ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకం ఎక్కువగా ప్రైవేట్ ఆసుపత్రులకు మళ్లడం, వాటికి బకాయిలు పెరగడం వల్ల సేవల్లో అంతరాయం కలిగింది. ఇక ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముందుగా సిబ్బంది నియామకాలపై స్పష్టతనిచ్చి, త్వరితగతిన ఉద్యోగాలు భర్తీ చేయాల్సి న అవసరం ఉంది. ప్రజారోగ్యం పరిరక్షణే ప్రభుత్వ ధర్మంగా భావించి, ఆరోగ్య శాఖలో వృత్తిపరంగా నిష్ణాతులైన డాక్టర్లను, నర్సులను, ఫార్మసిస్టులను, ఇతర సిబ్బందిని నియమించడం అత్యవసరం. గ్రామీణ ప్రాంతాలకు మొదట ప్రాధాన్యతనిస్తూ మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. వైద్యరంగానికి బడ్జెట్లో కేటాయింపులు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమంగా తగ్గించింది. వైద్యానికి ఆదాయం కాదు, సేవ ధ్యేయంగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రాష్ట్ర బడ్జెట్‌లో 8శాతం వరకు కేటాయింపులు చేస్తేనే మార్పు కనిపిస్తుంది. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు నూతనంగా నిర్మించడం లేదా పునరుద్ధరించడం ద్వారా సేవా స్థాయిని మెరుగుపరచాలి. ఒక గొప్ప ఆరోగ్య వ్యవస్థకు మూలం వ్యవస్థాపిత నియామకాలూ, స్థిరమైన బడ్జెటు కేటాయింపులూ, ప్రజలపట్ల ఉన్నత నైతిక బాధ్యతగల పాలన. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి అవకాశం ఉంది. గత పాలకుల తప్పుల్ని పునరావృతం చేయకుండా, ప్రజల ఆరోగ్యాన్ని ప్రధాన కర్తవ్యంగా భావించి ముందడుగు వేస్తే, తెలంగాణలో ఆరోగ్య రంగానికి కొత్త శకం ప్రారంభమవుతుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్య సేవల విస్తరణకు క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్య సేవల అందుబాటుకు వైద్య ఆరోగ్య శాఖ కీలకపాత్ర పోషిస్తోంది. అయితే, గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఈ విభాగాన్ని నిర్లక్ష్యం చేయడంతో అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందు తరాల పొరపాట్లను సరిదిద్దే బాధ్యతతో ముందుకు సాగాల్సి న అవసరం ఉంది. ముఖ్యంగా ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న నర్సులు, ఫార్మసిస్టులు, ఫామ్ డి డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంల పోస్టుల భర్తీప్రక్రియలో వచ్చే సమస్యలు, ఆలస్యాలు ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేయడం గమనార్హం. ఈ రోజు ఆరోగ్య వ్యవస్థను ముందుకు నడిపించడంలో డాక్టర్లతో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాత్రను విస్మరించలేం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తున్నారు. వీరి అందుబాటులోనే గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు,వృద్ధులు ఆధారపడతారు. దీంతోపాటు, ఫార్మసిస్టులు మందుల సరఫరా నిర్వహణలో కీలకం కాగా,ల్యాబ్ టెక్నీషియన్లు పలు రకాల పరీక్షల ద్వారా డాక్టర్లకు కీలకసమాచారం అందిస్తారు. సుమారు 6,269పోస్టుల భర్తీ ప్రక్రియ,పరీక్షలు పూర్తై నెలలు గడిచినా ఫలితాల వెల్లడి లేదు. 2023లో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా 6,269 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్, ఫార్మసిస్టు, ఏఎన్ఎం పోస్టులే కాకుండా ఇతర అనుబంధ ఉద్యోగాలూ ఉన్నాయి. పరీక్షలు నవంబరు, డిసెంబరు 2023లో జరిగినా ఫలితాలు ఇప్పటివరకు విడుదల కాకపోవడం అభ్యర్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ల్యాబ్ టెక్నీషియన్ వేలమంది నిరుద్యోగ యువత పరీక్షలు రాశి, ఒక మంచి ఉద్యోగావకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం త్వరగా ప్రక్రియను పూర్తి చేస్తుందని ఆశించిన అభ్యర్థులు, నెలలుగడుస్తున్నా ఫలితాలపై స్పష్టత లేకపోవడంతో అయోమయంలో ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనుకుంటే, మరోవైపుఅందుకు అవసరమైన మానవ వనరులను త్వరగా అందుబాటులోకి తేవాలి. అభ్యర్థులు న్యాయపరమైన అంశాలు పోరుపడుతుంటే, ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయాలు ఆలస్యంగా తీసుకోవడం మరింత సమస్యలను పెంచుతుంది. కనీసం ఇప్పుడైనా ఫలితాల ప్రక్రియపై స్పష్టమైన కాలపట్టికను విడుదల చేసి, నియామకాలను వేగంగా పూర్తి చేయాలి. ●

# ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు



## పనిమనిషిపై అత్యాచారం కేసు

### తనకు తక్కువ శిక్ష వేయాలంటూ కోర్టులో ఏడ్చేసిన రేవణ్ణ

### 14 నెలలుగా జైల్లో ఉన్న మాజీ ఎంపీ

**బెంగళూరు,ఆగస్టు 2:** లైంగిక దాడి కేసులో మాజీ ఎంపీ, హెచ్‌డీ దేవేగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణకు కోర్టు జైలు శిక్షఖరారు చేసింది. ఆయనకు జీవితై ఖైదు విధిస్తూ తీర్పును వెలువరించింది. ఓ తనపై అత్యాచారం చేసి బెదిరింపులకు పాల్పడినట్లు మహిళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రజ్వల్ రేవణ్ణను ప్రత్యేక కోర్టు దోషిగా తేల్చింది. శనివారం ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్ రేవణ్ణపై నాలుగు అత్యాచార కేసులు ఉన్నాయి. ఈ కేసులో ప్రజ్వల్ ఇప్పటికే 14 నెలలుగా జైలు జీవితం గడిపారు. మైసూర్‌లోని కేఆర్‌నగర్ నగరకు చెందిన పని మనిషిపై అత్యాచారం కేసులో ప్రజ్వల్‌ను దోషిగా తేలుస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ తీర్పును వెలువరించారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది జగదీష్ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ చర్య నీచమైనదని, జీవనోపాధి కోసం పని కోసం వచ్చిన చదువు రానివారిపై దారుణ చర్యకు పాల్పడ్డారని, వీడియోలు చిత్రీకరించడం బాధితురాలిని మానసికంగా కూడా హింసించడమేనని,ఓ దళిత బాధితురాలు ఆత్మహత్యకు ప్రయత్నించిందని కోర్టుకు తెలిపారు. ప్రజ్వల్‌పై మరో మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాదనలు వినిపించారు. ప్రజ్వల్ రాజకీయాల్లోకి కేవలం డబ్బు కోసమే రాలేదని, ప్రజ్వల్ ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు వీడియోలు దురుద్దేశంతో లీక్ చేశారని, అతని రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసేందుకు ఈ చర్యకు పాల్పడ్డారంటూ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ ఏడాది జైలులో ఉన్నాడని, ఈ కేసుతో అతనికి తీవ్రమైన నష్టం జరిగిందని తెలిపారు.

అత్యాచారం కేసులో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ మనవడు.. హాసన్ నియోజకవర్గానికి చెందిన జనతాదళ్ పార్టీ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో శిక్షకు సంబంధించిన తుది తీర్పును కోర్టు నేడు వెల్లడించనుంది. ఈ నేపథ్యంలో ప్రజ్వల్ తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని వేడుకుంటూ ఆయన ముందు బిగ్గరగా ఏడ్చినట్లు తెలిసింది. హాసన్ జిల్లాలోని హూలే నరసిరపురలోని గన్నికాడ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న 48ఏండ్ల పనిమనిషిపై రేవణ్ణ కొవిడ్ సమయంలో 2021లో రెండుసార్లు లైంగిక దాడి చేశారు. అంతేకాక ఆ దారుణాన్ని మొబైల్ ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. రేవణ్ణ 2024 లోక్‌సభ ఎన్నికల్లో హాసన్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఆయన తరఫున ప్రధాని నరేంద్రమోదీ కూడా ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో మహిళలపై ప్రజ్వల్ సాగించిన లైంగిక దాడులకు సంబంధించిన వీడియోలు బయటకు రావడం, విస్తృతంగా ప్రచారం కావడం కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో రేవణ్ణపై లైంగిక దాడి, లైంగిక వేధింపులు తదితర నాలుగు కేసులు నమోదు కాగా కేసులను సిట్ నమోదు చేసింది. అప్పటికే ఆయన జర్మనీకి పారిపోయారు. జర్మనీ నుంచి వచ్చిన ఆయనను గత ఏడాది మే 31న అరెస్ట్ చేయడంతో గత 14 నెలలుగా ఆయన జైలులోనే ఉన్నారు. వివాదంలో ఫోరెన్సిక్ నివేదికలు కూడా ఆ వీడియోలో ఉన్నది ప్రజ్వలే అని నిర్ధారించాయి. హాసన్ ఎంపీ సీటును నిలబెట్టుకోవడంలో విఫలమైన రేవణ్ణను తర్వాత పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పనిమనిషిపై అత్యాచార ఘటనేకాదు, ఆయనపై అశ్లీల వీడియోల కేసులు నమోదు అయ్యాయి. హాసన్‌లోని అతని ఫామ్ హౌస్‌నుంచి 2,900 వీడియోలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆయనపై మూడు కేసులు నమోదయ్యాయి.

# 19వ పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని మోడీ



## 9.7 కోట్ల మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ

**వారణాసి,ఆగస్టు 2:** దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రైతులకు ప్రధాని నరేంద్ర మోదీ శుభవార్త అందించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 20వ విడత ఆర్థిక సాయాన్ని శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని, వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో బటన్ నొక్కి నిధులను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడతలో భాగంగా సుమారు 9.7 కోట్ల మంది అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,500 కోట్లు జమ అయ్యాయి. రైతులకు పంట పెట్టుబడి ఖర్చుల భారాన్ని తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఏటా రూ.6,000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో, అంటే ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2,000 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. తాజా విడుదలతో అన్నదాతలకు వ్యవసాయ పనుల కోసం కీలకమైన పెట్టుబడి సాయం అంది నట్లయింది. ఈ పథకం కింద 19వ విడత నిధులను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసింది. ఆ సమయంలో బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో దాదాపు 9.8 కోట్ల మంది రైతులకు రూ.22 వేల కోట్లకు పైగా సాయాన్ని అందించింది. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 19 విడతల్లో సుమారు 11 కోట్ల మంది రైతులకు రూ.3.46 లక్షల కోట్లకు పైగా ఆర్థిక చేయూత లభించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల సహారకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. మోడీ మాట్లాడుతూ, మీరు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు. మీ సంక్షేమం కోసం మేం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. రైతులకు నగదు విడుదల చేసిన సందర్భంగా మరో పథకం గురించి కూడా మోడీప్రస్తావించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన. ఈ పథకం ద్వారా పంటకు నష్టం జరిగితే బీమా సంస్థ పరిహారం ఇస్తుందని గుర్తు చేశారు. ఈ స్కీం ద్వారా ఇప్పటివరకు రైతులకు రూ.1.75 లక్షల కోట్లకు పైగా విలువైన క్లెయిమ్‌లు ఇచ్చినట్లు ప్రస్తావించారు. పంట బీమా తీసుకోని వారు వెంటనే తీసుకోవాలన్నారు.

## విచారించేందుకు జైలుకు వస్తే.. దుస్తులిప్పేసి యూన్ సుక్ నిరసన



**సియోల్, ఆగస్టు 2:** అనూహ్యంగా ఎమర్జెన్సీ ప్రకటించి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ జైలు పాలయ్యారు. ఆయనపై పలు కేసులు నమోదవగా అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ కేసులకు సంబంధించి విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరిస్తూనే ఉన్నారు. తాజాగా ఆయనను ప్రశ్నించేందుకు అధికారులు మరోసారి జైలుకు రాగా వారి ముందు దుస్తులు విప్పేసి అర్ధనగ్నంగా నేలపై పడుకున్నారు. ఎమర్జెన్సీ వివాదంతో ఈ యేడాది ఏప్రిల్‌లో యూన్ సుక్ యోల్ అభిశంసనకు గురై పదవి నుంచి దిగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయనపై పలు అవినీతి కేసులు నమోదయ్యాయి. దీంతో గత నెల ఆయనను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన సియోల్‌లోని ఓ జైలులో ఉన్నారు. అవినీతి కేసుల్లో ఆయనను విచారించాలని కొత్త అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఆదేశించారు. ఈ క్రమంలోనే ప్రత్యేక అధికారుల బృందం కోర్టు నుంచి డిటెన్షన్ వారెంట్ తీసుకొని జైలుకు చేరుకుంది. విచారణకు స్వచ్ఛందంగా రాకపోతే బలవంతంగానైనా ఆయనను డిటెన్షన్ సెంటర్‌కు తీసుకెళ్లేందుకు న్యాయస్థానం నుంచి అధికారులు అనుమతి తీసుకున్నారు. అయినప్పటికీ విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరించారు. అధికారులు రాగానే మాజీ అధ్యక్షుడు జైలు యూనిఫామ్ తొలిగించి అర్ధనగ్నంగా నేలపై పడుకొని నిరసన తెలిపారు. దీంతో చేసేదేంలేక,అధికారులు అక్కడినుంచి వెనుదిరిగారు.

# అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్



**జమ్ము, ఆగస్టు 2:** రుతుపవనాల ప్రభావంతో దేశ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జమ్ము కశ్మీర్‌లోనూ కుండపోత వర్షాలతో పలు నదులు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీనితో ఎంతో కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహిస్తున్న అమర్‌నాథ్‌యాత్రకు తాత్కాలిక బ్రేక్‌లు పడక తప్పడంలేదు. ఈ వర్షాలకు అమర్‌నాథ్ యాత్రకు మళ్లీ తాత్కాలిక బ్రేక్ పడింది. కశ్మీర్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను ఆగస్టు 3 వరకూ నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కశ్మీర్ డివిజనల్ కమిషనర్ విజయ్ కుమార్ బిధురి ప్రకటించారు. పహల్గాం, బల్తాల్‌ఉంగా భక్తులను అనుమతించట్లేదని వెల్లడించారు. భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారికి నిర్వహణ అవసరంకావడంతో ఆ మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు తెలిపారు.

## బాత్‌రూమ్‌లో జారిపడ్డ జార్ఖండ్ మంత్రి



**రాంచి,ఆగస్టు 2:** జార్ఖండ్ మంత్రి ఒకరు ప్రమాదవశాత్తూ బాత్రూమ్‌లో జారిపడ్డారు. దీంతో బ్రెయిన్ ఇంజురీ(మెదడుకు గాయం) తో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం మంత్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్ శనివారం ఉదయం తన ఇంట్లోని బాత్రూమ్‌లో జారిపడ్డారు. దీంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు మంత్రిని హుటాహుటిన జంషెడ్‌పూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంత్రి మెదడులో రక్తం గట్టకట్టినట్లు వైద్యులు గుర్తించారు. ఈ మేరకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన్ని ఢిల్లీ ఆస్పత్రికి తరలించినట్లు జార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ తెలిపారు. మరోవైపు రాందాస్ సోరెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా తెలిపారు.

## ఆమె ఓ మెషీన్‌గన్.. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు



**వాషింగ్టన్, ఆగస్టు 2:** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. న్యూస్‌మాక్స్‌లో రాబ్ ఫిన్నెర్టీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ అమెరికాకు అధ్యక్షుడిగా సేవలు అందించిన అందరూ అధ్యక్షుల్లో తనకు మాత్రమే అద్భుతమైన, ఉత్తమ ప్రెస్ సెక్రటరీ ఉందని అన్నారు. కరోలిన్ లీవిట్ మెషీన్‌గన్‌లా పని చేస్తూ తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తోందన్నారు. అందం, హుందాతనంతో ప్రజల్లో ఓ స్టార్‌గా మారిపోయిందని పేర్కొన్నారు. కరోలిన్ మాట్లాడేటప్పుడు ఆమె పెదాల కదలిక చాలా అందంగా ఉంటుందని పొడిగారు. అదే ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. 2016 ఎన్నికల్లో తాను విజయం సాధించిన తర్వాత తన పాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. దీనికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. మరోవైపు కరోలిన్ లీవిట్ కూడా అమెరికా అధ్యక్షుడిపై ప్రశంసలు గుప్పించారు. ట్రంప్ ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన నేత అని కొనియాడారు. ఆయన భారత్-పాక్ మధ్య జరిగిన ఘర్షణసహా ప్రపంచవ్యాప్తంగా థాయ్‌లాండ్-కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్ట్-ఇథియోపియా, రువాండా-కాంగో డిమోక్రాటిక్ రిపబ్లిక్ వంటి అనేక యుద్ధాలను ముగించారన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకుగాను ఆయనకు నోబెల్‌శాంతి పురస్కారాన్ని అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో కరోలిన్ లీవిట్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఎన్నికల్లో బూత్‌లెవల్ అధికారులకు పారితోషికం రెట్టింపు

**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలు, గౌరవభృతిని సవరించింది. 2015 తర్వాత ఈసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలను సవరించడం ఇదే తొలిసారి. తాజా సవరణ ప్రకారం బూత్ లెవల్ అధికారుల పారితోషికాన్ని ఈసీ ఏకంగా రెండింతలు చేసింది. 2015 నుంచి ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులకు పారితోషికంగా రూ.6 వేలు ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.12 వేలు చేసింది. అదేవిధంగా ఓటర్ల జాబితాను సరిచూసినందుకు బీఎల్‌వోలకు గతంలో రూ.1000 ఇన్సెంటివ్‌గా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ ఇన్సెంటివ్‌ను రూ.2వేలకు పెంచారు. ఇక బీఎల్‌వో సూపర్‌వైజర్లకు గతంలో రూ.12 వేలు పారితోషికంగా ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.18 వేలు చేశారు.

ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు గతంలో ఎలాంటి గౌరవభృతి ఇచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు ఈఆర్‌వోలకు రూ.25 వేలు, ఏఈఆర్‌వోలకు రూ.30 వేలు గౌరవభృతి ఇవ్వనున్నారు. అదేవిధంగా బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో జరిగిన ఓటర్ల జాబితా అత్యవసర సవరణ కోసం పనిచేసిన బూత్‌లెవల్ అధికారులకు కూడా ఎన్నికల సంఘం రూ.6 వేలు ప్రత్యేక ఇన్సెంటివ్‌గా ప్రకటించింది.

## అణు జలాంతర్గాముల మోహరింపునకు ట్రంప్ ఆదేశం



**వాషింగ్టన్, ఆగస్టు 2:** రష్యాకు చేరువలోని సముద్రజలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని తమ నౌకాదళాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఆదేశించారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ చేస్తున్న హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఈ చర్యను చేపట్టినట్లు ఆయన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. 'ఒకవేళ ఆ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనుక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేశా. మాటలు ముఖ్యం. వాటివల్ల కొన్నిసార్లు అవాంఛిత పరిణామాలు తలెత్తవచ్చు. ప్రస్తుత అంశంలో ఇలాంటివి జరగవని ఆశిస్తున్నా' అని తెలిపారు. ఉక్రెయిన్ అంశంలో కాల్పుల విరమణకు 10 రోజుల్లో ముందుకు రావాలని ట్రంప్ రష్యాకు హెచ్చరిక చేసిన నేపథ్యంలో మెద్వదేవ్ స్పందించారు. రష్యా వద్ద సోవియట్ హయాంనాటి అణు దాడి సామర్థ్యం ఉందన్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణుల ఉత్పత్తిని ప్రారంభించామని రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం తెలిపారు. వాటిని తమ సైన్యంలో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

# సంక్షిప్తంగా..

## హాస్టల్ పైనుంచి దూకి ఐఐటి బాంబే విద్యార్థి ఆత్మహత్య



**ముంబై, ఆగస్టు 2:** మహారాష్ట్రలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటి బాంబేకు చెందిన విద్యార్థి హాస్టల్ టెర్రస్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో మరో విద్యార్థి అక్కడ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఢిల్లీకి చెందిన రోహిత్ సిన్హా (26) ఐఐటి బాంబేలో చదువుతున్నాడు. మెటలర్జికల్ ఇంజినీరింగ్,మెటీరియల్స్ సైన్స్ కోర్సు నాలుగో సంవత్సరంలో ఉన్నాడు. కాగా, శనివారం తెల్లవారుజామున 2.30గంటల సమయంలో హాస్టల్ భవనం టెర్రస్ పైనుంచి రోహిత్‌సిన్హా కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోహిత్ ఆత్మహత్యపై కేసు నమోదు చేశారు. అతడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

## జమ్ములో మరో ఎన్‌కౌంటర్, కీలక ఉగ్రవాది హాతం

**జమ్ము, ఆగస్టు 2:** జమ్మూ కశ్మీర్‌లో మన భద్రతా బలగాలు మరోసారి తమ శక్తిని చూపించాయి. కుల్గాం జిల్లాలోని అఖల్ ప్రాంతంలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో మన సైన్యం ఒక కీలక ఉగ్రవాదిని హతమార్చింది. దక్షిణ కశ్మీర్‌లోని అటవీ ప్రాంతంలో కొంతమంది ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారం అందింది. ఈ సమాచారం ఆధారంగా భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కలిసి ఒక సంయుక్త ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా వారు అఖల్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చర్యలు చేపట్టారు. ఈ గాలింపు సమయంలో ఉగ్రవాదులు హఠాత్తుగా భద్రతా దళాలపై కాల్పులు జరిపారు. మన సైనికులు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. వారు వెంటనే ప్రతిస్పందించి, ఒక ఉగ్రవాదిని హతమార్చారు. మరో ఇద్దరి నుంచి ముగ్గురు ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో దాక్కుని ఉన్నారని అనుమానం ఉంది. ఈ క్రమంలో భద్రతా దళాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

## మలయాళ నటుడు కళాభవన్ నవాస్ మృతి




**కొచ్చి,ఆగస్టు 2:** ప్రముఖ మలయాళ నటుడు, మిమిక్రీ కళాకారుడు కళాభవన్ నవాస్ (51) కొచ్చిలో నిన్న గుండెపోటుతో మరణించారు. 'ప్రకంబణం' అనే సినిమా షూటింగ్ నిమిత్తం చోటానికరలోని ఒక హోటల్‌లో బస చేసిన ఆయన, షూటింగ్ పూర్తయిన తర్వాత తన గదిలో అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గుండెపోటు కారణంగానే ఆయన మరణించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరణానికి కచ్చితమైన కారణం తెలుసుకోవడానికి నేడు కలమస్సేరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించనున్నారు. నిన్న సాయంత్రం 5.30 గంటలకు షూటింగ్ ముగించుకుని హోటల్‌కి వచ్చిన నవాస్, రెండు రోజుల విరామం ఉన్నందున ఇంటికి వెళ్లాలని అనుకున్నారు. అయితే, చెక్‌అవుట్ సమయానికి ఆయన గది నుంచి బయటకు రాకపోవడంతో, సిబ్బంది తలుపు తెరిచి చూడగా ఆయన స్పృహ కోల్పోయి ఉన్నారు. నవాస్ 1974లో కేరళలోని వడక్కంచెరిలో జన్మించారు. ఆయన తండ్రి అబూ బక్కర్ కూడా నటుడే.

## కేరళ క్రైస్తవ నన్స్‌కు షరతులతో బెయిల్



**నయారాయ్‌పూర్, ఆగస్టు 2:** మానవ అక్రమ రవాణాకు, బలవంతపు మత మార్పిడిలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో గత వారం ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయిన ఇద్దరు కేరళ సన్యాసినిలకు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి చెందిన ప్రత్యేకకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అందుకు ఇద్దరు సన్యాసినిలు వారి పాస్‌పోర్టులను సరెండర్ చేయాలని, ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున పూచీకత్తు పెట్టాలని, ఒక్కొక్కరికి ఇద్దరు వ్యక్తుల చొప్పున ష్యూరిటీ ఇవ్వాలని కోర్టు షరతులు విధించింది. కాగా కేరళకు చెందిన ఆ ఇద్దరు సన్యాసినిలు ముగ్గురు గిరిజన బాలికలను మతమార్పిడి చేయించేందుకు ప్రయత్నించారని బజరంగ్‌దల్, హిందూ వాహిని సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతో గత నెల 25న పోలీసులు ఆ ఇద్దరు సన్యాసినులను అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం సన్యాసినిలు ముందు దుర్గ్‌లోని సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే వారి బెయిల్‌పిటిషన్‌లను సెషన్స్‌కోర్టు తోసిపుచ్చింది.



## బోగస్ ఆధార్‌తో బంగ్లా నటి శాంతాపాల్ అరెస్టు

**కోల్‌కత్తా,ఆగస్టు 2:** నకిలీ పాస్‌పోర్టుతో భారత్‌లోకి వచ్చిన బంగ్లాదేశ్ నటి శాంతా పాల్(28)ని కోల్‌కత్తా డిటెక్టివ్‌పోలీసులు అరెస్టుచేసారు. అక్రమ విధానాల్లో భారతీయ ఓటరుకార్డు, ఆధార్‌కార్డులు పొందినట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. ఆమె విచారణలో చేసిన వ్యాఖ్యలు పొంతన లేకుండా ఉన్నాయని, అందుకే మళ్లీ సమగ్ర దర్యాప్తు చేస్తామని కోల్‌కత్తా పోలీసులు వివరించారు. ఈకేసులో ఆమె స్నేహితుడు సుమన్ చంద్రశీల్‌ను కూడా అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. విచారణలో ఆతడి పేరును నటి వెల్లడించింది. అయితే దేశ సమాచారాన్ని మరే ఇతర దేశానికయినా పంపిస్తున్నదా అన్న కోణంలో కూడా దర్యాప్తుచేసారు. చూడటానికి మంచి విలాసవంతమైన జీవన శైలిలో ఉంటూ నాథూలాపాస్ వంటి కీలక ప్రాంతాల్లోకి కూడా వెళ్లింది. భారత్ చైనా సరిహద్దు, దిఘా, గ్యాంగ్‌టక్ వంటి ప్రాంతాల్లో ఆమె రీల్స్ చేసింది. బంగ్లాదేశ్‌లోని బరిసాల్‌కు చెందిన ఆమె జాదవ్‌పూర్‌లో 2023నుంచి ఒక అద్దె అపార్టుమెంట్‌లో నివసిస్తోంది. ఆమెకు రెండు ఆధార్‌కార్డులున్నాయని చెపుతున్నారు. మొదటి ఆధార్ 2020లో ఉంటే అందులో జమ్ముకాశ్మీర్‌లోని బుర్ద్వాన్‌నుంచి తీసినట్లు చిరునామా ఉంది. మరో కార్డులో కోల్‌కత్తా అడ్రస్ ఉందని అధికారులు గుర్తించారు. ఆమె స్నేహితుడు చంద్రశీల్‌కోసం గాలింపు ప్రారంభించారు. నటి బ్యాంకు ఖాతాలను కూడా వివరాలు రాబట్టారు. బ్యాంకురుణం పొందేందుకు ఆమె బోగస్ పత్రాలుకూడా సమర్పించిందని చెపుతున్నారు. శాంతాపాల్ అనేక మోడలింగ్ పోటీల్లో కూడా పాల్గొంది. టాలీవుడ్‌లో ఆమె ఒక చిత్రంలో పనిచేస్తోంది. మరో మూవీకోసం టాలీవుడ్ నటుడితో సంప్రదింపులు జరుపుతున్నట్లు కూడా పోలీసులు గుర్తించారు.

# ఓటర్ల జాబితా ముసాయిదాలో నా పేరు లేదు: తేజస్వియాదవ్

## పాతనంబరుతో చెక్ చేసుకుని ఉంటారన్న ఎన్నికల సంఘం!



**పాట్నా, ఆగస్టు 2:** బీహార్‌శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ స్పందిస్తూ ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నా ఇపిఐసి నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కనిపించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్‌లెవల్ అధికారి నా వద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదు అని తేజస్వి వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20 వేల మంది నుంచి 30 వేల వరకు ఓటర్లను తొలగించారని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు. అయితే తేజస్వియాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడి నేత బహుశా తన పాత ఇపిఐసి నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కనిపించకపోయి ఉండవచ్చని ఇసి తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవటంతో ఇసి ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబర్ 1 వరకు ఇసి గడువు కల్పించింది. బీహార్‌లో ఈ యేడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

# పిఓకెలో 15పాక్ ఉగ్రశిబిరాలు: దాయాదిదేశం కొత్త వ్యూహం

## నిఘాకంటికి చిక్కకుండా సరిహద్దుల్లో నిర్మాణం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను మరోసారి పెంచేందుకు పాక్ భారీ వ్యూహాలు రచించిందని నిఘా వర్గాలకు సమాచారం అందింది. గత ఫిబ్రవరి నెలలో జరిగిన పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ చేబట్టిన ఆపరేషన్ సింధూర్ వల్ల పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం కావడం, పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతమవడం తెలిసిందే. ఆపరేషన్ సింధూర్‌లో పిఓకెలోని బవహల్‌పూర్‌లో గల జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయం, మురిద్కేలోని లష్కర్ ఏ తోయిబా శిక్షణా కేంద్రం సహా పలు ఉగ్రవాదసంస్థల కార్యాలయాలు, ఆయుధ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. దీంతో తాత్కాలికంగా కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు బ్రేక్ ఇచ్చిన పాక్ తాజాగా మళ్లీ వీటిని పునరుద్ధరించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 15ఉగ్రవాద శిబిరాలను నెలకొల్పింది. ఈ శిబిరాలు పిఓకెలో పాక్ మిలటరీ కేంద్రాలకు అతి సమీపంలో వున్నాయని నిఘా వర్గాలకు సమాచారం అందింది. చూసేందుకు ఉగ్రవాద శిబిరాలు కూడా మిలటరీ కేంద్రాలుగా భావించే విధంగా వున్నట్లు కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) కూడా నిర్ధారించింది. తాజాగా ఏర్పాటైన ఉగ్రవాద శిబిరాలు ఇదివరకు వున్న చోట కాకుండా పిఓకెలోని సైనిక స్థావరాలకు అతి సమీపంలో వున్నాయని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ శిబిరాలు భారత నిఘా వర్గాల రాడార్లకు చిక్కకుండా నూతన టెక్నాలజీని వాడి నిర్మించినట్లు తేలింది. ఇక ప్రతి శిబిరంలో 20 నుంచి 25 ఉగ్రవాదులు వుండే విధంగా జాగ్రత్త పడుతున్నారు. ఈ శిబిరాలలో లష్కర్ ఏ తోయిబా, జేషే మహమ్మద్, హిజ్‌బుల్ ముజహిద్దీన్ వంటి ఉగ్రవాద సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది.

## విమానంలో చెంపదెబ్బ తిన్న ప్రయాణికుడు అదృశ్యం!



**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడు, మరో ప్రయాణికుడిపై భౌతిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో విమానంలో చెంపదెబ్బ తిన్న ప్రయాణికుడు అదృశ్యమైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులు తెలిపినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. చెంపదెబ్బ తిన్న వ్యక్తి అస్సాంలోని కాచార్ జిల్లాకు చెందిన హుస్సేన్ అహ్మద్ మజుందార్‌గా అతడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం అతడు ఇంటికి రాలేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపారు. హుస్సేన్ ముంబయిలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. పలుమార్లు ఇదే మార్గంలో ఇంటికి వచ్చేవాడు. ఎప్పటిలాగానే అతడి కోసం ఎయిర్‌పోర్టుకు వెళ్లాం. అయితే అతడు కనిపించలేదు. ఆ తర్వాత వైరల్ అయిన వీడియో ద్వారా గొడవ తెలిసింది. తర్వాత హుస్సేన్ ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినప్పటికీ తెలియలేదు అని హుస్సేన్ తండ్రి అబ్దుల్ మన్నన్ మజుందార్ పేర్కొన్నారు. విమానాశ్రయంలోని కేంద్రపారిశ్రామిక భద్రతాదళం అధికారులకు సమాచారం ఇచ్చామని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

# యువశాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతున్న వ్యవసాయ వర్సిటీ



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్, ఉపకులపతి అల్దాస్ జానయ్య

## భవిష్యత్‌లో నం-1 స్థానానికి వర్సిటీ: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### ఘనంగా 55వ స్నాతకోత్సవం

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 2, ప్రభాతవార్త:** దేశ వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంతో కీలకంగా పని చేస్తుందని, ఎంతో మంది యువశాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగింది. 2021-22 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యూజి, పీజీ, పిహెచ్‌డి విద్యార్థులకు విశ్వవిద్యా లయ కులపతి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అధ్యక్షతన స్నాతకోత్స వంలో పట్టాలు ప్రదానం చేశారు. తొలుత పిజెటిఎయు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పిం చారు. విశ్వవిద్యా లయం వివిధ పంటల్లో విడుదల చేసిన వంగడాలు జాతీయస్థాయిలో ఆదరణ పొందు తున్నాయని అల్దాస్ జానయ్య తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణల్లో విశ్వవిద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తుందన్నారు. దేశ, విదేశాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని జానయ్య తెలిపారు. అగ్రి హబ్, ఇతర ల్యాబ్‌ల్ని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఐసీఏఆర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తోడ్పాటుతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని జానయ్య వివరించారు. అనంతరం డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ మాట్లాడుతూ...విశ్వవిద్యాలయంలో చదివిన ఎందరో వ్యక్తులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో ఉండి దేశానికి, రైతాంగానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందన్నారు. దీనికి శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమలే దోహదం చేశాయన్నారు. నేడు తెలంగాణ, ఇతర రాష్ట్రాల కారణంగా దేశం వరి ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని జాట్ అన్నారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని 2047 నాటికి 'వికసిత్ భారత్'గా రూపాంతరం చెందటానికి అందరూ కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం దేశంలో తొలి పది స్థానాల్లో నిలవనుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పిజెటిఏయూ ఈ మధ్య నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం, ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు కార్యక్రమాల వల్ల రైతాంగానికి చాలా మేలు జరిగిందని వివరించారు. వాతావరణమార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలన్నారు. యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికం రూపుమాపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అని.. యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలందిస్తూ సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ పిలుపు నిచ్చారు. ఈ స్నాతకోత్స వంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీ హెచ్. విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలక మం డలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధి కారులు, పూర్వ ఉపకులపతులు, రిజిస్ట్రార్ లు, ఐసీఎఆర్ సంస్థల ప్రతి నిధులు, అధికారులు వివిధ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఎడ్‌సెట్-2025 వెబ్‌ఆప్షన్లు

## 9న సీట్ల కేటాయింపు

### 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా రేపటి(సోమవారం) నుంచి అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 9న సీట్లు కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 11 నుంచి 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించాలని ఇప్పటికే ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎడ్ సెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను జూలై 14న జారీ చేయగా.. జూలై 21 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఎడ్ సెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి జూలై 21 నుంచి 31 వరకు అవకాశం కల్పించారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జూలై 23 నుంచి 26 వరకు నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు అర్హులైన వారి జాబితాను శనివారం వెబ్‌సైట్‌లో పొందు పరిచారు. కౌన్సెలింగ్‌కు అర్హత సాధించిన వారు ఈ నెల 4(సోమవారం), 5(మంగళవారం) రెండు రోజులు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 6న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ చేసుకోవడానికి అవకాశమిచ్చారు. ఎడ్ సెట్ కౌన్సెలింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 9న చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్లు అధికారులు కౌన్సెలింగ్‌లో ప్రకటించారు.

# బిసిలను మోసం చేసిందే బిజెపి

## జనహిత పాదయాత్రతో సంక్షేమ పథకాలపై ప్రజలకు చైతన్యం : ఎమ్మెల్యే బాలునాయక్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవితో బిసిల పట్ల ఆ పార్టీ చిత్త శుద్ధి తేలిపోయింది బిజెపి బిసిలను మోసంచేసే పార్టీ అని ఎమ్మెల్యే బాలునాయక్ ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో అందు బాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని ప్రజలు, స్థానికుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు జనహిత పాదయాత్ర చేపట్టారని ఆయన వివరించారు. బడుగు బలహీనవర్గాలు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ 42శాతం రిజర్వేషన్ బిల్లు తెస్తే బిసి రిజర్వేషన్లకు బిజెపి నేతలు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. దళిత బిడ్డను పార్టీ అధ్యక్షుడిని చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. బిసి 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదిం చాలని ప్రధానిని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు బిఆర్ఎస్ హయాంలో ప్రారంభించారని, నీటి వాటాను తాకట్టు పెట్టింది బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే లంబాడా, తెలంగాణ లంబాడీలు జీవితాంతం ఇందిరాగాంధీకి రుణపడి ఉంటారని ఆయన అన్నారు.

# ముస్లింల పేరిట రిజర్వేషన్లను బిజెపి అడ్డుకునే యత్నం

## బలహీనవర్గాల వ్యతిరేకి రామచందర్‌రావు

## బిజెపి నేతల ధర్నాపై మంత్రి పొన్నం ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ముస్లింల పేరు చెప్పి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కడుపులో కత్తులు పెట్టుకొని అదు ముకున్నవిధంగా బిసి రిజర్వేషన్లపై ధర్నా చేస్తున్న బిజెపి నేతల తీరు ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ నుండి మొదలు కులగణన చేసి న్యాయ పరమైన చిక్కులు లేకుండా బిసిలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ చట్టంచేసి గవర్నర్‌కు పంపించి అక్కడినుండి రాష్ట్రపతికి పంపించడం వరకు తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రపతి ఆమోదం పొందాల్సిన ఈ బిల్లుపై బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండి హైదరాబాద్‌లో ధర్నా చేయడాన్ని ప్రజలు నవ్వు కుంటు న్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ బిజెపి ఎమ్మెల్యేలు శాసనసభ లో బిసిలకు రిజర్వేషన్లపై మద్దతు ఇచ్చి ముస్లింల పేరు మీద అడ్డుకుం టున్నారని అవేదన చెందారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తప్పులు ఉంటే సవరించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు.

బిసిలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. బలహీనవర్గాల వ్యతిరేకి రామచంద్రరావు చేసే ధర్నాలో మీరు పాల్గొని మీరు కూడా బల హీన వర్గాల వ్యతిరేకిగా మారుతున్నారని ఆయన అన్నారు.

బిజెపి నేతలు బిసిలు రిజర్వేషన్లు సాధించాలనుకుంటే ఈ ధర్నా ఢిల్లీలో చేయాలి ప్రధాని మోడీని ఒప్పించండి అని ఆయన కోరారు. సోమవారం అందరం కలిసి ఢిల్లీ వెళ్దాం రండి మన రిజర్వేషన్లు సాధించుకుందామని ఆయన అన్నారు. బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ధర్నా చేయాల్సింది హైదరాబాద్‌లో కాదు ఢిల్లీలో అని ఆయన హితవు చెప్పారు. బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు పక్కా బిసిల వ్యతిరేకి మంత్రి పొన్నం పునరుద్ఘాటించారు. బిజెపి నేతలు మీ స్థాయిని ధర్నాచౌక్ వరకు కాకుండా మాతో కలిసి ఢిల్లీ రండి అని మంత్రి పొన్నం కోరారు.



అభివాదం చేస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, ఎలికట్టె విజయ్‌మార్‌గౌడ్, కూరెళ్ల వేములయ్యగౌడ్, అనంతరాజుగౌడ్ తదితరులు

# లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లును నిషేధించే కుట్ర

## మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగా లిక్కర్ మాఫియాకు తలొగ్గి హైదరాబాద్‌లో కల్లును నిషేధించే కుట్రలు చేస్తుందని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ఎక్కడో కల్లు కల్తీ ఘటన జరిగితే దాని బూచిగా చూపి కల్లును నిషేధించడం కుట్రగా కనిపిస్తుం దని లిక్కర్ మాఫియానే కల్లులో ఏమైనా కలిపిందనే అనుమానాలు వ్యక్త మవుతునాయని అన్నారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఐలి వెంకన్నగౌడ్, గౌడజనహక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎలికట్టె విజయకుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై నెలకొన్న సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన కల్తీ కల్లుఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షులు దుర్గయ్య గౌడ్, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ లీగల్ అడ్వైజర్ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమగ్రాభివృద్ధికి కృషి

## రూ.20,500 కోట్లతో పిఎం కిసాన్ నిధి

### ఆర్థికంగా మూడో స్థానంలోకి భారత్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**యాచారం, ఆగస్టు 2, ప్రభాతవార్త :** భారత దేశంలో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ రైతు సమగ్ర అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉత్తర ప్రదేశ్ వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మా న్ నిధి సమ్మేళనం కార్యక్రమాన్ని యాచారం మం డల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌సిఎఆర్ క్రీడా జోన్ ఎక్స్ డైరెక్టర్ వికేసింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి ఉష, సహాయ వ్యవసాయ సంచా లకులు సుజాత, ఆర్డిఓ అనంతరెడ్డి, వివిధ గ్రామాల నుండి విచ్చేసిన రైతులు కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లా డుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా 20,500 కోట్ల రూపాయలు విడుదల చేసి 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా పిఎం కిసాన్ నిధి ప్రారం భించినట్లు తెలిపారు. ప్రపంచ ఆర్థిక గణాంకాల ప్రకారం భారతదేశము నాలుగో స్థానంలో ఉందని నేడు మూడో స్థానానికి చేరే ప్రయత్నం కృషి జరుగుతుందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వర కు వ్యవసాయంపై మక్కువతో దేశంలో గణనీయంగా వృద్ధి జరిగిందని మన దేశం నేడు ఇతర దేశాలకు ఆహార ఉత్పత్తులు సరఫరా చేసే స్థాయికి అగ్రగామిగా నిలిచింద న్నారు. ఇతర దేశాలకు భారతదేశం అభివృద్ధి మింగుడు పడడం లేదన్నారు.140 కోట్ల మంది జనాభాకు సరిపడా ఆహార ఉత్పత్తులు చేస్తూ ఇతర దేశాలకు ఎగుమతులు చేసి స్థాయికి వెళ్లి అగ్రస్థానం నిలుస్తూ శత్రుద్దేశం గుండెల్లో గుబులు పుట్టించే స్థాయికి చేరుకున్నామన్నారు. కరోనా కష్టకాలంలో కరోనా వ్యాక్సిన్ తయారుచేసి హైదరాబాదు నుండి 45 దేశాలకు ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ను అందించిన ఘనత మనదే అన్నారు. పూర్వం మన దేశంలో పాల ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండేదని నేడు దేశంలో పాల ఉత్పత్తుల్లో ఎంతో అభివృద్ధి సాధించి మెరుగైన పోషకాహారాలను అందిస్తున్నామన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ బడుగు బలహీన వర్గాల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతుల అభ్యున్నతి కోసం దాన్యం మద్దతు ధర 2380 అందజేస్తూ రైతుకు ఎంతో బసటగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్ర ఏర్పడిదని నేడు రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని, రాష్ట్రం అప్పుల్లో ఉందని భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధిచేసి చూపిస్తామన్నారు. కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ఎంసి డైరెక్టర్లు మస్కి నర సింహ, గులాం అక్బర్, పిఎస్‌సిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, కొప్పు సుకన్య భాష్యం,మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు మాజీ సర్పంచ్లు అంజయ్య యాదవ్, దేరంగుల రాజు, విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, మూడేడ్ల వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్ నాయక్, వరికుప్పల సుధాకర్, నెర్రె శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



యాచారంలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు

# గోదావరి, కృష్ణా జలజగడం పరిష్కారానికి ప్రభుత్వం కృషి

## బిసి ద్రోహుల పార్టీ బిజెపి: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** గోదావరి, కృష్ణా నది జలజగడాల శాశ్వత పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని బిఆర్ఎస్ నాయకగణం వీలైతే సహకరించండి లేదంటే తప్పుడు ప్రచారాన్ని మాను కోండి అంటూ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హితవు చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ లాగా దొంగతనంగా ఢిల్లీకి పోయే పద్ధతి రేవంత్ రెడ్డికి తెలియదుహైదరాబాదులో పుట్టిన మీ పార్టీ ,మీరు దొంగ సాటుగా ఢిల్లీ పోయి మోడీని,అమిత్ షా, సిఎం రమేష్ ను కలిసినట్లు రేవంత్ రెడ్డి కలవట్లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ సమాజం కోసం రేవంత్ రెడ్డి 100 సార్లు కాదు 500 సార్లు అయినా పోతడు అని ఆయన చెప్పారు. నీళ్లను, నిధులను నియామకాలను మొత్తాన్ని తన కుటుంబానికి మలుపుకున్న కెసిఆర్ కుటుంబానికి శ్రీనివాస్ గౌడ్ వత్తాసు పలుకుతుండని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బనకచర్ల అప్పుడు శ్రీనివాస్ గౌడ్ మంత్రిగా ఉండు ఏం చేసిండని ప్రశ్నించారు. గోదావరి మీద కాళేశ్వరం కట్టి నిధులను దోచుకున్నప్పుడు శ్రీనివాస్ కూడా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రామచంద్ర రావు స్టేట్మెంట్లు తన అజ్ఞానాన్ని తానే చెప్పుకుంటట్లుగా కనిపిస్తుందని అన్నారు. పార్టీ అధ్యక్షుడు బిసి ఉంటేనే ఆయన మార్చి రామచంద్ర రావు అధ్యక్షుడు అయిండు అని అన్నారు. బిసి గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయన కోల్పోతుండు అని అన్నారు. బిజెపి బిసి ద్రోహ పార్టీ అని రామచంద్ర రావు గుర్తిస్తే మంచిదని అన్నారు. మేము మంత్రివర్గంలో, కార్పొరేషన్ లో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చినం రేపు పార్టీలో కూడా ఇవ్వబోతున్నామని అన్నారు.

# డిఇఒలుగా అదనపుబాధ్యతల కేటాయింపులో సర్వీస్ నిబంధనలు పాటించాలి

## ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వినతి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖ అధికారులు(డిఈవో)గా అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసి) అప్పగించే సందర్భంలో తప్పకుండా సర్వీస్ నిబంధనలు పాటించాలని కరీంనగర్- ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కె రామకృష్ణారావుకి శనివారం వినతిపత్రం సమ ర్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి(డిఈవో), ఉపజిల్లా విద్యాధికారులు (డిప్యూటీ. డిఈవో)లుగా తాత్కాలిక బాధ్యతలు (ఎఫ్ఏసి) అప్పగించడంలో విద్యా అర్హతలను, ఉన్నతాధికారుల నియామక నిబంధనలను పక్కనపెట్టి తీసుకుంటున్న నిర్ణయాలను ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లి ఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. సర్వీస్ నియమావళి ప్రకారం డిఈవో, డిప్యూటీ డిఈవో పోస్టులకు కనీస అర్హతగా సాధారణ డిగ్రీతోపాటు బిఎడ్ ఉండాలన్నారు. కానీ బిఎడ్ అర్హతలు లేని అధికారులకు ముఖ్యంగా ఏఐఎస్ అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించడం నింధనలకు విరుద్ధమన్నారు. అంతేకాకుండా విద్యా రంగంలో నైపుణ్యాలు, విద్యాపరమైన అనుభవం అవసరమైన చోట పరిపాలనా కోణంతో తీసుకునే నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముందన్నారు.వారి స్వతంత్ర పరిపాలనా పాత్రకు విఘాతం కలగవచ్చని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అభిప్రాయపడ్డారు.


# విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా పంపిణీ చేయాలి

## ఎస్ఎఫ్ఐ విద్యార్థినుల సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చదువుకుంటున్న విద్యార్థి నులకు అవసరమైన వారికి శానిటరీ నాప్కిన్స్‌ను ఉచితంగా పంపిణీ చేయా లని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. గతంలో అమ్మాయిల హాస్టల్, కాలేజీలలో శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా ఇచ్చేవారని.. కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదని ప్రతి గురుకులంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సిటి సిఐటియు కార్యాలయంలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) విద్యార్థినిల రాష్ట్ర సదస్సు లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యార్థినుల కన్వీనర్ పూజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మీ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రం లో అమ్మాయిల పైన అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిపైన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బేటి బచావో, బేటి పడావో అని చెప్పే ప్రధాని నరేంద్ర మోడీ భారత దేశంలో ఒక గంటకి కొన్ని వేల అత్యాచారాలు, కొన్ని వేల మందిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. చట్టం ఉన్నవారికి చుట్టంలాగా లేని వారికి ఎటువంటి చట్టం వర్తించకపోవడం చాలా బాధాకరమన్నారు. మహిళలు ఉపయోగించే నిటరీ నాప్కిన్స్ పైన జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లు, గురుకులాలు, కెజిబివిల్లోని అమ్మాయిలకు సరైన సదుపాయాలు లేక సరిపడ గదులు, వాష్రూమ్స్ లేక అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలు సరైన ఆహారం తీసుకోక అనారోగ్య బారిన పడుతున్నారని, రక్తహీనతకు గురవుతున్నారని, అందుకే అమ్మాయిలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలకు మెస్ చార్జీలు పెంచాలన్నారు. విద్యా ర్థులందరూ మహనీయుల చరిత్రలు తెలుసుకొని మహనీయుల అడుగు జాడల్లో నడవాలని, వారి ఆశయదారుల్లో కొనసాగాలని సూచించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వస్తున్న ఆశ్లీల కంటెంట్, డబుల్ మీనింగ్ వీడియోలు, డ్రగ్స్, గంజాయి, మద్యం, సిగరెట్ లాంటి సంస్కృతి విద్యార్థి నుల్లో కూడా రుద్దబడుతుందని.. వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు.

# ట్రంప్‌కు ప్రధాని మోడీ ఊడిగం.. ప్రజలకు అవమానకరం



## మోడీ, కెసిఆర్ అందంగా అబద్ధాలు చెబుతారు

## పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ ఏం చేస్తుంది?

## సెప్టెంబరు 22 నుంచి చండీగఢ్‌లో జాతీయ మహాసభలు

## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధానిమోడీ బాని సత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవమా నకర మని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. అబద్దాలను అందంగా, అవలీలగా చెప్పే వ్యక్తులు ఈ దేశంలో ఇద్దరే ఇద్దరు ఉన్నారని, వారు ఒక్కరు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కాగా, మరొక్కరు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అని అన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నారాయణ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, తెలంగాణ అసెంబ్లీలో కెసిఆర్ చెప్పినవి, చెప్పేవని అబద్ధాలేనని ఎద్దేవా చేశారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని మోడీ బానిసత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవ మానకరమని.. ట్రంప్ నిరాశ, నిస్పృహాలతో ఇష్టా నుసారంగా వ్యవరిస్తుండగా, మన దేశ ప్రధాని స్పృహలో ఉండి కూడ అబ్బదాలు చెబుతున్నారని మండిపడానడరు. పహల్గాం ఉగ్రవాదులను పార్లమెంట్ సమావే శాలకు ఒక్కరోజు ముందు హతమార్చి వారి శవాలను అడ్డం పెట్టుకుని సభలో తప్పించునే ప్రయత్నం చేశారన్నారు. కాశ్మీర్‌లో 7.50లక్షల మంది భద్రాత సిబ్బందిని మోహరించిన కేంద్రం ఉగ్రవాదులను పట్టు కోకుండా ఇంతకాలం ఏమి చేసిందో చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు. మోడీ గ్రాఫ్ పడిపోవడంతో ఆర్ఎస్ఎస్ 75 యేళ్ల వరకే పదవి కాలం అనే అంశాన్ని తెరపైకి తెచ్చిందని, అయితే ప్రధానమంత్రి ఎవరూ అనేది ఇక్కడ కాదని, దేశభద్రత, ఆర్థిక వ్యవస్థ పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాల మార్పు కావాలన్నారు. కర్నాటకలోని ధర్మస్థల పవిత్ర ఆలయాన్ని ట్రస్టీ అపవిత్రం చేసిందని, ఆ దేవాలయాన్ని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ఆలయంలో జరిగిన అన్ని దారుణాలకు ట్రస్ట్ బోర్డుదే బాధ్యతని.. వెంటనే బోర్డు సభ్యులను అరెస్టు చేయాలన్నారు. అక్కడ 400 మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడి అత్యంత క్రూరంగా చంపి పూడ్చిపెట్టారని, పవిత్ర ధర్మస్థలా, స్మశానమా అర్థం కావడం లేదన్నారు. ధర్మస్థల ఘటనకు సం బంధించి వార్తల ప్రచు రణలను నిలిపి వేస్తూ స్థానిక కోర్టు ఇచ్చిన ఉత్త ర్వులను హైకోర్టు రద్దు చేస్తూ తీర్పును ఇవ్వడం స్వాగతి స్తున్నామన్నారు. పొలి టికల్ ఇంజినీర్ల నిర్వాకం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి ఏర్పడిందని పేర్కొ న్నారు. మాయల పక్కీర్ ప్రాణాలు ఎక్కడో చిలకలో దాగి ఉన్నట్లు, ప్రస్తుతం కమిషన్ నివేదికలో మాజీ సిఎం కెసిఆర్ బాగోతం దాగి ఉందని నారాయణ తెలిపారు. పార్టీల ఫిరాయిం పులకు సంబంధించి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినంత మాత్రాన జరిగేది ఏమి లేదన్నారు నారాయణ. స్పీకర్‌కు ఉన్న విశేష అధికారాల నేపథ్యంలో వారి తీర్పును ఎవరూ కాదనే పరిస్థితి ఉండదన్నారు. ఎంఎల్ఎలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ అసలు ఏమి చేస్తోందని నారాయణ ప్రశ్నించారు. ఎంఎల్ఎలు, ఎంపిలు ఎన్నికైనట్లు సర్టిఫికెట్లను అందజేసి సభలకు పంపేదే ఎన్నికల కమిషన్ అని.. కమిషన్ వద్ద అన్ని వివరాలను ఉంటాయి కదా అలాంటప్పుడు ఎవరైన పార్టీ ఫిరాయిం పులకు పాల్పడితే ఎన్నికల కమిషన్ తక్షణమే దానిని సుమోటోగా స్వీకరించి అనర్హులుగా ప్రకటించాలన్నారు. సెప్టెంబర్ 22 నుంచి చండీఘర్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో బిజెపి వ్యతిరేక ఫ్రంట్ బలోపేతం చేయడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా ప్రజాఉద్యమాలను ఉధృతంచేసే దిశగా కార్యాచరణను రూపొందించనున్నట్లు నారాయణ వెల్లడించారు.

# న్యాయమైన నీటివాటా కోసం, తెలంగాణ కోసం పనిచేస్తాం

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాయలసీమను రతనాల సీమ చేయడం కోసం కాదు, కృష్ణా, గోదావరిలో న్యాయమైన నీటి వాటాను సాధించేందుకు తెలంగాణ కోసం కాంగ్రెస్ నాయక గణం పనిచేస్తోందని చొప్పండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం సిఎల్‌పిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బనకచర్లను ప్రభుత్వం ఆపి తీరుతుందని సిఎం ఇప్పటికే ఢిల్లీ వెళ్లి కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. కేంద్రం కూడా సానుకూలం గా స్పందించింది బనకచర్ల డిపిఆర్‌ను కూడా రిజెక్ట్ చేశారని ఆయన వివరిం చారు.



నారా లోకేష్ మాట్లాడినంత మాత్రాన హడావుడి పడాల్సి న అవసరం లేదని అనుమతులు లేకుండా నారా లోకేష్ బనక చెర్ల ను ఎలా కడతాడో చూస్తాం అని మేడిపల్లి సత్యం ధీమా వ్యక్తం చేశారు. నారా లోకేష్ మాటలను బూచిగా చూపించి హరీశ్‌రావు ప్రభుత్వం పైన విమర్శలు చేస్తు న్నాడని విమర్శించారు. బనకచర్లపైన హరీశ్‌రావు తెగ హడావుడి చేస్తు న్నారని అపహాస్యం చేశారు. హరీశ్‌రావుకు అంత కష్టం అవసరం లేదు బనకచెర్లను ప్రభుత్వం ఆపి తీరుతుందని తెలిపారు. నారా లోకేష్ నా తమ్ముడు లాంటోడు అని కెటిఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని సత్యం విమర్శించారు. బిఆర్ఎస్ మోసగాళ్లకు అడ్డాగా మారిందని విమర్శిం చారు. తెలంగాణ ప్రయోజనాలు రక్షణ కోసమే బిఆర్ ఎస్ ఉందన్న హరీశ్ రావు లోకేష్‌ను కెటిఆర్ ఎందుకు కలిసాడో చెప్పాలని నిలదీశారు. మీ లాలూచీ వ్యవహారాలు అన్నీ తమకు తెలుసని అన్నారు.



# ఆయన దగ్గరున్న ఆటంబాంబు పేలనివ్వండి.. చూద్దాం!

## రాహుల్ వ్యాఖ్యలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ కౌంటర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** అధికార బీజేపీ కి మేలు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని, అందుకు సంబంధించి తన దగ్గర ఆటమ్ బాంబు లాంటి సాక్ష్యం ఉందని శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కౌంటర్ ఇచ్చారు. రాహుల్‌గాంధీ దగ్గర ఆటమ్ బాంబు ఉంటే పేల్చనిద్దామని, కానీ ఆ పేలుడులో ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలని రక్షణ మంత్రి ఎద్దేవా చేశారు. 'రాహుల్‌గాంధీ తన దగ్గర ఆటమ్ బాంబు ఉందంటున్నాడు. ఉంటే ఒకసారి ఆయన దాన్ని పేల్చాలి. అయితే ఆ పేలుడు ఎలాంటి హాని జరగకుండా ఆయనను ఆయన కాపాడుకోవాలి' అని వ్యాఖ్యానించారు. అధికార బీజేపీ కోసం ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతుందంటున్న రాహుల్‌గాంధీ తన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని రక్షణ మంత్రి హెచ్చరించారు. లేదంటే శనివారం పూట నిప్పుతో ఆడుకోవడమైనా ఆపాలని వార్నింగ్ ఇచ్చారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్లో భూకంపం సృష్టించబోతున్నాడని గతంలో కూడా ఆయన మనుషులు హంగామా చేశారని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. కానీ రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో మాట్లాడినా ఎలాంటి భూకంపం రాలేదని, పైగా ఆ ప్రసంగం తడిచిన పటాసు లెక్క తుస్సుమన్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేతికి ఎమర్జెన్సీ రక్తపు మరకలు ఉన్నాయని రాహుల్‌గాంధీ గుర్తుపెట్టుకోవాలని, వైరిపక్షాలపై నోటికొచ్చిన ఆరోపణలు మానుకోవాలని రాజ్‌నాథ్ హితవు పలికారు.

# ఇద్దరు అదనపు కలెక్టర్లు, 10 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బదలీ

## రెవెన్యూ సెక్రటరీ లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇద్దరు అదనపు కలెక్టర్లు, పది మంది స్పెషల్ డిప్యూటీకలెక్టర్లను బదిలీ చేస్తూ రెవెన్యూ సెక్రటరీ లోకేష్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వెయిటింగ్ లో ఉన్న అదనపు కలెక్టర్ ఎన్.భీమ్యానాయక్‌ను వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్‌గా, బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్‌డికే చంద్రారెడ్డిని రంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా, భద్రాచలం ఆలయం ఈవో ఎల్.రమాదేవిని ఆర్అండ్‌బికి, వెయిటింగులో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.రాజాగౌడ్‌ను హనుమకొండ డిఆర్ఓ, డిప్యూటీ కలెక్టర్ ఎల్.సుధను నల్లగొండ స్పెషల్ కలెక్టర్ పిఏగా, డిప్యూటీ కలెక్టర్ ఎస్.అశోక్‌ను ఆర్ అండ్ బికి, డిప్యూటీ కలెక్టర్ ఎల్.రాజేందర్ గౌడ్‌ను నారాయణపేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, డిప్యూటీ కలెక్టర్ సిహెచ్ కోమల్ రెడ్డిని మహబూబ్ నగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, కె. దామోదర్ రావును దేవాదాయ శాఖకు, పి.హరికృష్ణను ఆర్ అండ్ బికి, మైనార్టీ వెల్ఫేర్ లో ఉన్న డిప్యూటీ కలెక్టర్ ఎంపి జనార్ధన్ రెడ్డిని కల్వకుర్తి ఆర్‌డిఓగా, పిసిబిలో సీనియన్ అడ్మినిస్ట్రేటివ్‌గా ఉన్న డిప్యూటీ కలెక్టర్ ఎం.జయమ్మను భువనగిరి ఆర్‌డిఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## గొర్రెల పంపిణీ స్కాం:

# నాటి మంత్రి , అధికారులకు ఇడి నోటీసులు

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన గొర్రెల పంపిణీ కుంభకోణంపై అప్పట్లో ఈ శాఖకు మంత్రిగా వ్యవహరించిన బిఆర్ఎస్ నాయకుడితో పాటు ఈ శాఖను పర్యవేక్షించిన ఐఎఎస్ అధికారి, ఇతర ఉన్నతాధికారులను విచారించాలని ఈ కేసును విచారిస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్ణయించినట్లు తెలిసింది. ఈ స్కాంపై ఎసిబి ఇప్పటికే విచారించి 700 కోట్ల రూపాయల గోల్ మాల్ జరిగిందని నిర్ధారించడం తెలిసిందే. దీనికి సంబంధించి దుబాయ్‌లో తలదాచుక్ను ఇక్రముద్దీన్ అనే నిందితుడి మినహా 17 మందిని అరెస్టు చేయడం విదితమే. దుబాయ్‌లో తలదాచుకున్న ఇక్రముద్దీన్‌ను భారత్‌కు రప్పించి అరెస్టు చేసేందుకు ఎసిబి ఓవైపు ప్రయత్నాలు చేస్తున్న తరుణం లో ఈ కేసు విచారణకు ఈడీ రంగంలో దిగింది. దీనిపై అనూహ్యంగా మూడు రోజుల క్రితం నాటి మంత్రి వద్ద ఓఎస్‌డిగా వున్న కల్యాణ్ కుమార్‌తోపాటు ఈ శాఖకు సీఈఓగా వున్న సభావత్ రాంచంద్ర నాయక్ సహా పలువురిని విచారించి వారిళ్లలో సోదాలు చేయడం కలకలం రేపింది. దీని పై ఈ డీ అధికారులు విడుదల చేసిన సంచలన ప్రకటన రాజకీయంగా ప్రకంపనలు రేపింది.

ఈ స్కాంలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగానే గోల్ మాల్ జ రిగిందని ఈడీ పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి ఇదివరకే ఒకసారి అరెస్టయిన కల్యాణ్ కుమార్‌ను ఈడీ అధికారులు సుధీర్ఘంగా వి చారించారు. ఆయన ఇ చ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ స్కాంపై నాటి మంత్రి, బిఆర్ఎస్ నాయకుడిని విచారించేందుకు ఈడీ నిర్ణయించినట్లు తె లిసింది. మంత్రితో పా టు ఈ శాఖను అప్పట్లో పర్యవేక్షించిన ఐఎఎస్ అధికారి, ఆయనకు డిప్యూటీలుగా వున్న ఇతర అధికారులను కూడా విచా రించాలని ఈడీ నిర్ణయిం చినట్లు సమాచారం. సోమవారం తరువాత ఈ విచారణ సాగే వీలుంది. అవసరం అయితే గొర్రెల పంపిణీ స్కాంలో కొం దరిని ఈడీ అరెస్టు చేసే అవకాశాలున్నాయని తెలిసింది.

# మెడికల్ అడ్మిషన్లలో జిఓ 33ను అమలు చేయాలి

## ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** మెడికల్ అడ్మిషన్లలో స్థానికత కోసం తీసుకొచ్చిన జిఒనం.33ని తప్పనిసరిగా అమలు చేయాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో విద్యార్థుల తల్లిదండ్రులు పి.రమేష్ కుమార్, ఎం.ఎస్.ఎన్.చారి మీడియాతో మాట్లాడారు. గతంలో ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న ఏడు సంవత్సరాలలో ఏవైనా నాలుగు సంవత్సరాలు తెలంగాణలో చదివిన వారిని లోకల్‌గా పరిగణించేవారని, దీనివల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో చదవకపోయినా 6,7,8,9 తరగతులు చదివినట్టు తప్పుడు సర్టిఫికెట్లు పెట్టి మన తెలంగాణలో మెడికల్ అడ్మిషన్స్ తీసుకొన్నారని ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని జి.ఒ.33 తీసుకొచ్చిందన్నారు. దీనిపై 2024-25 అడ్మిషన్ల సమయంలో కొంతమంది కోర్టుకెళ్లడం హైకోర్టు, సుప్రీంకోర్టులలో జిఒ.33 గురించి వాదనలు జరిగాయన్నారు. చివరికి కోర్టుకు వచ్చిన అందరిని నీట్ యుజి -2024 కౌన్సెలింగ్‌కు అనుమతిస్తామని మిగిలిన వారిని జిఒ.33ని వర్తింపజేస్తామని అడ్మిషన్స్ ప్రక్రియ కొనసాగించారన్నారు. ఈ జి ఒ.33 ప్రకారం స్థానికేతరులుగా పరిగణించబడే 135 మంది కోర్టుకు పోవటంతో వీరిలో 86 మంది ఏ క్యాటగిరీలో ఎంబిబిఎస్ సీట్లు, బి క్యాటగిరీలో మరికొంతమంది బిడిఎస్ కోర్సులో ప్రవేశం పొందారని తెలిపారు. అంటే దాదాపు 120కిపైగా తెలంగాణ మెడికల్ సీట్లు తెలంగాణేతరులు పొందారని తెలిపారు. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కాళోజీ హెల్త్ వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కోర్టుల అనుమతితో జిఒ.33 అమలయ్యేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్.మధు, మహేశ్, ఆర్. నరేందర్రెడ్డి, డి.సంధ్య, బి.శ్రీనివాస్ రెడ్డి, టి.ఉమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు కొత్త రూపు

## కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాల నిర్మాణం

## నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 2:** ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్య వస్థీకరించడం (రీఆర్గనైజేషన్)తో పాటు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అను గుణంగా ప్రజలకు అసౌక ర్యం కలగకుండా, పరి పాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యా లయాల పునర్వ్య వస్థీకరణ, కొత్త బిల్డింగ్ ల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచిం చారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని పునర్వ్య వస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకే చోట ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల , మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగారెడ్డి, పటాన్ చెరు కలపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించా లని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు.



### కేంద్రం సహకరించకున్నా ఇందిరమ్మ ఇళ్లు ఆగవు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉన్నాకూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం నాడు సచివాలయం లోని తన కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడలేదని, కేంద్రం అనేక నిబంధనలతో కొర్రీలు వేస్తోందన్నారు. ఒక్కో ఇంటికి గ్రామీణ ప్రాంతాల్లో రూ. 72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.52 లక్షలు కేంద్రం ఇస్తుందని కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షలు ఇస్తుందని తెలిపారు. కేంద్రం నుంచి అరకొర సహాయంపై ఆధారపడకుండానే రాష్ట్రంలో అనుకున్న ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. కేంద్రం సూచించిన విధంగా రీసర్వే కూడా చేపట్టామని ఇది తుది దశలో ఉందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి పిఎ, డిప్యూటీ తహశీల్దార్ డాక్టర్ పైళ్ల నవీన్‌రెడ్డి రచించిన తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు మరియు సాహిత్యం ఐదవ ఎడిషన్‌ను మంత్రిగారు ఆవిష్కరించారు. పుస్తక రచయిత నవీన్ రెడ్డిని మంత్రిఅభినందించారు.

# రూ.30,656 కోట్లతో 1,601 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా 1,601 ప్రాజెక్టులు ఆమోదిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.30,656.57 కోట్ల రూపాయలు గా, ఆమోదించబడిన గ్రాంట్లు రూ. 8,853.38 కోట్ల సహాయ నిధులు ఉన్నాయి. కిసాన్ సంపద యోజన కాంపోనెంట్ స్కీమ్‌ల కింద 52 ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయని తాజాగా కేంద్రం ప్రకటించింది. వాటిలో ఫుడ్ సేఫ్టీ మరియు క్వాలిటీ అష్యూరెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ కింద ఒక ప్రాజెక్టు అమలు చేయబడిందని వెల్లడించింది. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పంటల కోత అనంతర మౌలిక సదుపాయాలు మరియు ప్రాసెసింగ్ సౌకర్యాలను సృష్టించడం వలన రైతులకు అనంతర నష్టాలు తగ్గుతాయని భావి స్తోంది. కాంపోనెంట్ పథకాలు ఆహార ప్రాసెసింగ్, సంరక్షణ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి వ్యవస్థాపకులకు గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొంది. వీటిలో ఇతరత్రా, పంటకోత అనంతర నష్టాలను తగ్గించడానికి కోల్డ్ స్టోరేజీలు మరియు రిఫ్రిజిరేటెడ్ వాహనాలు కూడా ఉండటం విశేషం. నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 'ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయంతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్, విలువ జోడింపు మౌలిక సదుపాయాల పథకం కింద అమలు చేయబడిన యూనిట్ల ప్రభావం"పై అధ్యయన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ యొక్క ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్ మరియు విలువ జోడింపు మౌలిక సదుపాయాల పథకం జోక్యం కారణంగా, అన్ని రంగాలు వృధాలో కొంత తగ్గుదల చూపించగా, పండ్లు కూరగాయలు, పాడి, మత్స్య రంగాలు వృధాలో గణనీయమైన తగ్గుదల చూపించాయని పేర్కొంది.

# రైతులకు కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్

## సాగులో రియల్ టైమ్

## కొత్త చొరవను ప్రారంభించిన క్రాప్ రీసెర్చ్ సంస్థ

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి రానుంది. వాతావరణ వైవిధ్యానికి అనుగుణంగా, జాతీయ మరియు అంత ర్జాతీయ సంస్థల సహకారంతో ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమీ-అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) రైతులకు రియల్‌టైమ్, వ్యక్తిగతీకరించిన వాతావరణ సలహా సేవలను అందించడానికి కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)), మెషిన్ లెర్నింగ్ (ఎమ్ఎల్)లను ఉపయోగించుకునే కొత్త చొరవను ప్రారంభించింది. కృత్రిమ మేధస్సు ఆధారిత ఈ ప్రాజెక్ట్, చిన్న రైతులను హైపర్ లోకల్, కార్యాచరణ వాతావరణం మరియు వాతావరణ అంతర్‌రాష్ట్రాల కృషితో సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుని ప్రారంభించింది. ఈ చొరవకు కేంద్ర ప్రభుత్వ మాన్సూన్ మిషన్-3 కింద మద్దతు ఇస్తోంది. రుతుపవనాల సమయంలో అభివృద్ధి చేయబడిన ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అడ్వైజరీ టూల్, పైలట్ చేయబడిన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా అందుబాటులోకి తీసుకొస్తోంది. సంక్లిష్ట వాతావరణం, వ్యవసాయ డేటాను వ్యక్తిగతీకరించిన, సైన్స్ ఆధారిత సలహాగా సరళీకరించడానికి ఇంటిలిజెంట్ సిస్టమ్స్ ఆధారిత వ్యవస్థగా అప్‌గ్రేడ్ చేయబడుతోంది. వీటి ద్వారా రైతులకు నిజ సమయ (రియల్ టైమ్) వాతావరణ సూచనలు, పంట నమూనాలు మరియు యంత్రాల వినియోగం తదితర వాటి విశ్లేషణలను సమగ్రపరచడం ద్వారా, ఇది రైతులకు విత్తనాలు, నీటిపారుదల మరియు తెగులు నిర్వహణపై కార్యాచరణ సిఫార్సులను అందిస్తుంది. మారుమూల ప్రాంతాలలో కూడా నిర్ధారించే కృత్రిమ మేధస్సు ఆధారిత వాట్సాప్ బాట్‌తో సహా వినియోగదారుస్నేహపూర్వక డిజిటల్ ఛానెల్ల ద్వారా సలహాలు అందించబడతాయి. ఈ అధునాతన పరిజ్ఞానాన్ని తొలుత చిన్న భూస్వామ్య రైతులపై దృష్టి సారిస్తుంది. అంతరాష్ట్రాల జాతీయ విస్తరణకు మార్గనిర్దేశం చేయడండో పాఊ, గ్లోబల్ సౌత్ అంతటా అనుసరణకు ఒక నమూనాగా పనిచేస్తాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్ మోసమ్‌జిపిటికి ప్రాథమిక ఇన్‌పుట్‌లను కూడా అందిస్తుంది. ఇలాంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రాంతాలలో ఈ ప్లాట్‌ఫామ్ విస్తృతంగా స్వీకరించే అవకాశం ఉందని హైదరాబాద్ ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్నారు.

# భూ ఒప్పందాల కేసులో రాబర్ట్‌వాద్రాకు ఢిల్లీ కోర్టు నోటీసులు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు షికోహ్‌పూర్ భూ ఒప్పందాల కేసుకు సంబంధించి ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు శనివారం విచారణకు స్వీకరించింది. ఈ మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాతో పాటు మొత్తం 11 మందికి కోర్టు నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఆగస్టు 28వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజున వాద్రా తన వాదనలను కోర్టు ముందు వినిపించాల్సి ఉంటుంది. గురుగ్రామ్‌లోని షికోహ్‌పూర్ గ్రామంలో 3.53 ఎకరాల భూమిని అక్రమ మార్గాల్లో కొనుగోలు చేశారనే ఆరోపణలపై రాబర్ట్ వాద్రా సహా పలువురిపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ లావాదేవీల ద్వారా వచ్చిన నేరపూరిత ఆదాయాన్ని వాద్రా నియంత్రణలో ఉన్న పలు కంపెనీల ద్వారా మళ్లించినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా, వాద్రాకు చెందిన మెసర్స్ స్కై లైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో పాటు ఇతర ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది. వాటి మొత్తం విలువ రూ. 37.64 కోట్లుగా పేర్కొంది. ఈ కేసుకు మూలం 2008లో గురుగ్రామ్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్. మెసర్స్ ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వాద్రా కంపెనీ తప్పుడు ధ్రువపత్రాలతో రూ. 7.5 కోట్లకు భూమిని కొనుగోలు చేసిందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత 2012లో, అదే భూమిని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్ఎఫ్‌కు రూ. 58 కోట్లకు విక్రయించడం తీవ్ర వివాదానికి దారితీసింది. అప్పట్లో హర్యానాలో ల్యాండ్ కన్సాలిడేషన్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న అశోక్ ఖేమ్కా, రాష్ట్ర నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంటూ ఈ భూమి మ్యుటేషన్‌ను రద్దు చేశారు. ఆయన నిర్ణయం అప్పట్లో పెద్ద రాజకీయ దుమారాన్ని రేపింది. అప్పటి నుంచి ఈ భూ ఒప్పందంపై న్యాయపరమైన, పరిపాలనపరమైన దర్యాప్తు కొనసాగుతోంది. తాజా పరిణామంతో ఈ కేసు మళ్లీ వార్తల్లోకి ఎక్కింది.



# బనకచర్లపై లోకేష్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదు

## పిసి ఘోష్ నివేదిక అధ్యయన కమిటీతో నేడు సమావేశం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపితో టిడిపి పొత్తు ఉందని లోకేష్ బనకచర్ల ప్రాజెక్టుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారనీ, ఇది ప్రజాస్వామ్య దేశం కేంద్రంలో అధికారంలో ఉందని మాట్లాడితే కుదురదని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సచివాలయంలో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ పోలవరం బనకచర్ల ఇల్లీగల్ ప్రాజెక్టు అని దాని నిర్మించకుండా తెలంగాణ అన్ని రకాలుగా వ్యతిరేకిస్తోందని పునరుద్ఘాటించారు. బనకచర్ల పై అవశేష ఆంధ్ర ప్రదేశ్ మంత్రి లోకేష్ వ్యాఖ్యలు సరైనవి కావు. లోకేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా మని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పోలవరం బనకచర్లకు పర్యావరణం, గోదావరి నది యాజ మాన్య బోర్డు కూడా వ్యతిరేకించిందని ఆయన గుర్తుచేశారు. నేనే స్వయంగా నా లెటర్ హెడ్ తోకేంద్రానికి లేఖలు రాసానని ఉత్తమ్ ఆ లేఖ ప్రతులు విలేఖరులకు మరోమారు విడుదల చేశారు. బనకచర్ల ను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకున్నదని, గోదావరి జలాలు పెన్నా బెసిన్‌కు తరలించ కూడదని మా స్టాండ్ క్లియర్ గా ఉందని ఆయన చెప్పారు. బిఆర్ఎస్ నిరాధా రమైన ఆరోపణలు పబ్లిసిటీ కోసం మాత్రమే చేస్తున్నదని విమర్శించారు. బిఆర్ఎస్ పాలన కాలంలోనే ఆనాటి ప్రభుత్వం జాగ్రత్తలు తీసు కుంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదుఅని ఆవే దన చెందారు. బిఆర్ఎస్ గాలి మాటలు తప్ప వాస్తవం లేదు. బనకచర్ల ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం, మేము ఎంతటి పోరాటానికి అయినా మేము సిద్ధమని ఆయన అన్నారు. ఆదివారం సాయంత్రం కమిషన్ రిపోర్ట్ అధ్యయనం కమిటీ తో సమావేశం అవుతానని తెలిపారు. ఈ నెల 4 న కేబినెట్‌లో చర్చించాల్సిన అంశాలపై చర్చిస్తామని అన్నారు.

# రష్యాలోని కమ్చత్కా ద్వీపంలో మళ్లీ భూకంపం

## రిక్టర్ స్కేలుపై 5.4గా నమోదు

**మాస్కో, ఆగస్టు 2:** రష్యాలోని కమ్చత్కా ద్వీపకల్పంలో మళ్లీ భూమి తీవ్రస్థాయిలో కంపించింది. కొన్ని రోజుల క్రితమే 8.7 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం, సునామీ భయాలను రేకెత్తించిన విషయం మరవక ముందే, శనివారం నాడు అదే ప్రాంతంలో మరోసారి భూమి కంపించింది. ఈ వరుస ఘటనలతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శనివారం జీఎంటీ కాలమానం ప్రకారం ఉదయం 11:06 గంటలకు అదే ప్రాంతంలో మరో భూకంపం సంభవించింది.

దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.4గా నమోదైనట్లు జర్మనీకి చెందిన జీఎఫ్జెడ్ జియోసైన్సెస్ రీసెర్చ్ సెంటర్ వెల్లడించింది. ఇది భూమికి 10 కిలోమీటర్ల లోతున సంభవించినట్లు పేర్కొంది. ప్రపంచంలో అత్యంత చురుకైన టెక్టోనిక్ జోన్లలో ఒకటైన పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో కమ్చత్కా ఉండటమే ఈ వరుస భూకంపాలకు ప్రధాన కారణమని భూగర్భ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

గతనెల 30న కమ్చత్కా తీరంలో శక్తివంతమైన భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 8.7గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే (యూఎస్జీఎస్) ధ్రువీకరించింది. తొలుత భూకంప తీవ్రతను 8.0గా అంచనా వేసినప్పటికీ, తాజా సమాచారం ఆధారంగా దానిని 8.7కు సవరించారు. పెట్రోపావ్లోవ్స్క్ కమ్చట్స్కీ నగరానికి ఆగ్నేయంగా 125 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 19.3 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. ఈ భారీ భూకంపం కారణంగా పసిఫిక్ మహాసముద్రంలోని పలు ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు.

రష్యా, జపాన్ తీర ప్రాంతాలను మూడు గంటల్లో సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిం చారు. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం తీర ప్రాంత ప్రజలను సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించింది. భూకంపం కారణంగా భవనాలు తీవ్రంగా కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

ఫర్నిచర్ దానంతట అదే కదులుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పలుచోట్ల భవనాలకు, మౌలిక వసతులకు నష్టం వాటిల్లినట్లు స్థానిక నివేదికలు వెల్లడించాయి.

# ఎరువులపై అప్రమత్తం

## రైతులకు సకాలంలో అందేలా చర్యలు

## వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో వరినాట్లు ముగిసి యూరియా వినియోగం పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి యూరియా సకాలంలో ఇబ్బందులు లేకుండా రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌లో యూరియా తదితర ఎరువుల సరఫరాపై కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. కేంద్రం రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ నెలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరాచేయాలని, జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరి నాట్ల కారణంగా యూరియాకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని, యూరియాతో పాటు ఇతర ఎరువుల సరఫరాలో జాప్యం జరిగితే ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. రైతులు యూరియాను విచక్షణ రహితంగా వినియోగించకుండా వారికి డీలర్ల ద్వారా అవగాహన కల్పించాలని కంపనీ ప్రతినిధులకు సూచించారు. వ్యవసాయ అధికారులు ఎరువుల సరఫరాలో నిరంతరాయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. బల్క్ సేల్స్, బార్డర్ తనిఖీలు, బ్లాక్ మార్కెట్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# యూరియా కొరతపై దృష్టి పెట్టండి

## రైతు రక్షణ సమితి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏర్పడిన యూరియా కొరతను తీర్చడంపై దృష్టి పెట్టాలని తెలంగాణ రైతు రక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో రైతు రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీహరిరావు ఒక ప్రకటనలో రాష్ట్రానికి అవసరమైన యూరియా కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించాలని సూచించారు. ఖరీఫ్ సాగు జోరుగా సాగుతున్న ప్రస్తుత సమయంలో యూరియా సరఫరా ఆలస్యమైతే లక్షలాది మంది రైతులకు అపార నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రాష్ట్రానికి అవసరమయ్యే యూరియా ఇండెంట్, ఇప్పటివరకు జరిగిన సరఫరా, లోటు పరిస్థితులు, తద్వారా రైతులకు జరిగే నష్టాన్ని కేంద్రానికి సమగ్రంగా వివరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మంత్రితో పాటు, ఆశాఖ ఉన్నతాధికారులు అన్ని పార్టీల ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రులు, అవసరమైతే ప్రధానమంత్రిని కలవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో యూరియా రాకుంటే ప్రత్యామ్నాయంగా నానో యూరియాను సబ్సిడీపై సరఫరాకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### జెన్కో ఉద్యోగులకు 5 శాతం జనరేషన్ అలవెన్సు

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు చెందిన థర్మల్, హైడల్ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 5 శాతం జనరేషన్ అలవెన్సును వర్తింపజేస్తూ ఆ సంస్థ సీఎండీ ఎస్.హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఏడో దశ, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) లలో పనిచేసే ఉద్యోగులకు దీన్ని వర్తింప చేయడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జల విద్యుత్తు కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం ఈ అలవెన్సును అమలు చేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ జనరేషన్ అలవెన్సు ఈ ఏడాది ఏప్రిల్ నెల మొదటి నుంచే అమల్లోకి రానుంది. గ్రేడ్ 2 వారికి నెలకు 6 వేలు రూపాయలు, గ్రేడ్ 3 వారికి 8 వేలు రూపాయలు, గ్రేడ్ 4 వారికి 10 వేల రూపాయలు చొప్పున ఇవ్వనుంది.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్

# బీహార్‌లో ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై దాడే!

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

**జోగిపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:** బీహార్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)లో భారీ ఎత్తున అమాయకుల ఓట్లను తొలగిస్తుందని, ఇది ప్రజాస్వామ్యంపై దాడిఅని, కేంద్రలోని బిజెపి ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు దిగటం శోచనీయమని ఏఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ విమర్శించారు. జనహిత పాదయాత్రలో భాగంగా సంగుపేటలో శనివారంనాడు నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీహార్లో ఈ సంవత్సరాంతమున ఎన్నికలు జరగనున్న సందర్భంగా సుమారు 65లక్షల మంది అమాయకుల ఓట్లను తొలగించారని ఆమె తెలిపారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమీషన్ బిజెపి కనుసన్నల్లో నడుచుకుంటుందని ఆమె ఆరోపించారు. కేవలం ఎన్నికల కమీషనే కాకుండా సిబిఐ, ఇడి లాంటి సంస్థలను బిజెపి తన చెప్పుచేతుల్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. అయితే తమ నేత రాహుల్‌గాంధీ దీనిని అడ్డుకుంటున్నారని, అమాయకులకు అండగా నిలుస్తున్నారని, తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చేలా బీహార్లో మిగతా పార్టీలతో కలిసి ఉద్యమం చేస్తున్నారని తెలిపారు.

# 'వార్ 2' సంచలనం..

వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ నుంచి రాబోతోన్న వార్ 2 చిత్రంపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి ఉన్న భారీ హైప్, క్రేజ్‌ని చాటేలా ప్రీ సేల్స్ జరుగుతున్నాయి. వార్ 2 సినిమాకు సంబంధించి నార్త్ అమెరికాలో ఇప్పటికే 100కె డాలర్ల క్రాస్ అయింది. ప్రీ సేల్స్‌తోనే వార్ 2 సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. ఉత్తర అమెరికా మార్కెట్లో యుఎస్‌డి 100,000 ముందస్తు టిక్కెట్ల అమ్మకాలను దాటిన అత్యంత వేగవంతమైన భారతీయ చిత్రంగా వార్ 2 నిలిచింది. కేవలం ఏడు గంటల్లోనే ఈ ఘనతను వార్ 2 సాధించింది. హృతిక్ రోషన్ ఎన్టీఆర్ క్రేజ్‌కు ఇదే నిదర్శనం అని చెప్పుకోవచ్చు. ఇక ఇదే మైలురాయిని చేరుకోవడానికి ఎన్టీఆర్ దేవరచిత్రానికి 11గంటల 37 నిమిషాలు పట్టింది. అయితే ఇప్పుడు మళ్లీ వార్ 2తో ఎన్టీఆర్ తన రికార్డును తానే తిరగ రాశారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన వార్ 2లో కియారా అద్వానీ కథానాయికగా నటించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఊపిరి ఊయల లాగా అనే పాట సోషల్ మీడియాని ఊపేస్తోంది. ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో వార్2 భారీఎత్తున విడుదల కాబోతోంది.



# అభిమానుల కళ్లల్లో ఆనందం 'కింగ్‌డమ్'

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన కింగ్‌డమ్ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ భారీ వసూళ్లను రాబడుతోంది. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన కింగ్‌డమ్ చిత్రం.. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకులను మెప్పు పొందుతోంది.

తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన విజయ్ దేవరకొండ, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. **కింగ్‌డమ్ సినిమాకి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఏమనిపిస్తుంది?** చాలా చాలా సంతోషంగా ఉంది. కేవలం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాలలో, ఓవర్సీస్‌లో విశేష స్పందన లభిస్తుంది. **ఇంతటి విజయం దక్కడంపై మీ స్పందన ఏంటి?** కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలెబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. **దర్శకుడు గౌతమ్ తిన్ననూరి గురించి?** గౌతమ్ కుటుంబ బంధాలను, ఎమోషన్స్‌ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. **రెండవ భాగం ఎలా ఉండబోతుంది?** ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. **ఈ సినిమాలో ఆయుధాలతో ఓటింగ్ వేసే సన్నివేశాలకు మంచి స్పందన వస్తోంది. ఆ సీన్స్ చెప్పినప్పుడు మీ రియాక్షన్ ఏంటి?** గౌతమ్ కథ చెప్పినప్పుడు ఓటింగ్ వేసే సన్నివేశాల గురించి చెప్పాడు కానీ, ఆ ప్రాసెస్ ఎలా ఉంటుందో చెప్పలేదు. ఆ తర్వాత ఇలా గన్‌లు, కత్తుల వంటి ఆయుధాలతో ఓటింగ్ ఉంటుందని చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఆ కొత్తదనమే ప్రేక్షకుల మెప్పు పొందడానికి కారణమైంది అనిపిస్తుంది. **కింగ్‌డమ్ కోసం మీరు ఎలాంటి హోం వర్క్ చేశారు?** ఈ కథ విన్న తర్వాత అసలు ఆ కాలంలో ఎలా మాట్లాడేవారు, ఎలాంటి దుస్తులు వేసుకునేవారు వంటి విషయాలు తెలుసుకోవడం మొదలు పెట్టాను. **ఈ సినిమాకి మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి?** ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమాపై కురిపిస్తున్న ప్రేమనే నా దృష్టిలో బెస్ట్ కాంప్లిమెంట్. **ఈ చిత్రంలో మీరు షిప్ ను లాగే సీన్ జెర్సీ మూమెంట్ లాంటిదని చెప్పవచ్చు. ఆ షూటింగ్ సమయంలో మీ ఫీలింగ్ ఏంటి?** మే నెలలో మండు టెండలో ఆ సీన్ షూట్ చేశాము. చిత్రీకరణ సమయంలో ఓ మంచి సన్నివేశం చేస్తున్నామన్న సంతృప్తితో చేశాము. **సినీ పరిశ్రమ నుంచి ఎలాంటి ప్రశంసలు వచ్చాయి?** సినిమాచూసి సుకుమార్ ఫోన్ చేశారు. సినిమా తనకు ఎంతగానో నచ్చిందని చెప్పారు. నాకు సుకుమార్ అంటే ఎంతో ఇష్టం.



# 'ఓజీ' నుంచి ఫస్ట్ సాంగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పాత్ర ఓజాస్ గంభీరగా అలరించనున్న చిత్రం ఓజీ. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీప్రియుల్లో ఈ చిత్రంపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న ఓజీ చిత్రం నుంచి మొదటి గీతం ఫైర్ స్టార్మ్ విడుదలైంది. ఈ గీతం నిజంగానే ఓ అగ్ని తుఫానులా ఉంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఓజీ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తు న్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ భీకరమైన గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హాష్మీ, ప్రియాంక మోహన్, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీత సంచల నం ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాకుడిగా రవి కె చంద్రన్, ఎడిటర్‌గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు. తమన్ స్వరపరిచిన ఫైర్ స్టార్మ్ గీతం రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తోంది. ఓజాస్ గంభీర పాత్ర ఏ స్థాయిలో ఉండబోతుందో తెలిపేలా తమన్ సంగీతం ఎంతో పవర్ ఫుల్‌గా ఉంది. అదిరిపోయే ఎలక్ట్రానిక్ బీట్స్, భారీతనం, రా ఇంటెన్సిటీని మిళితం చేస్తూ సాగిన ఈ గీతం అగ్ని తుఫానుని తలపిస్తోంది. పవన్ కళ్యాణ్ యొక్క వ్యక్తిత్వానికి నివాళి అన్నట్టుగా ధైర్యంతో నిండిన ఈ పాట సాహిత్యం కూడా అద్భుతంగా ఉంది. ప్రముఖ నటుడు శింబు ఈ పాటకు తన శక్తివంతమైన గాత్రాన్ని అందించారు. విడుదలైన క్షణం నుండే సామజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తోంది.



# 'జాతీయ అవార్డ్సులో సత్తాచాటిన 'బేబి'

నేడు ప్రకటించిన 71వ జాతీయ అవార్డ్స్‌లో "బేబి" సినిమా సత్తాచాటింది. ఈ చిత్రానికి ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్‌గా సాయి రాజేశ్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా పీవీఎన్ ఎస్ రోహిత్(ప్రేమిస్తున్నా పాటకు) అవార్డ్ గెల్చుకున్నారు. "బేబి" సినిమాకు సాయి రాజేశ్ రాసిన హృద్యమైన కథనం జాతీయ స్థాయిలో పురస్కారం సాధించింది. అలాగే ఈ చిత్రంలో ప్రేమి స్తున్నా అనే పాటను మనసుకు హత్తుకునేలా పాడిన సింగర్ పీవీఎన్ ఎస్ రోహిత్ ప్రతిభను నేషనల్ అవార్డ్ వరిం చింది. "బేబి" సినిమాకు సైమా, గామా, ఫిలింఫేర్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డ్స్ దక్కగా, రెండు జాతీయ అవార్డ్స్ అత్యున్నత గౌర వాన్ని అందిం చాయి. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్‌కేఎన్ నిర్మాణంలో దర్శకుడు సాయి రాజేశ్ "బేబి" చిత్రాన్ని రూపొం దించారు. కల్ట్ బ్లాక్ బస్టర్‌గా ప్రేక్ష కుల మనసుల్ని గెల్చుకున్న ఈ సినిమా...



బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల గ్రాసర్‌గా నిలిచింది. ప్రస్తుతం "బేబి" సినిమా హిందీ రీమేక్ చిత్రీకరణ సన్నా హాలు జరుగుతున్నాయి. అలాగే కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా "బేబి" సినిమా కాంబినేషన్‌లో ఎస్ కేఎన్ నిర్మాతగా, సాయి రాజేశ్ నిర్మాత, రైటర్‌గా, రవి నంబూరి దర్శకుడిగా "చెన్నై లవ్ స్టోరీ" రూపొందుతోంది.



అనన్య నాగళ్ల నయా లుక్

# పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్ 'బకాసుర రెస్టారెంట్'

వినోదంతో పాటు ఎమోషన్‌ను మేళవించి.. ప్రేక్షకులను రెండున్నర గంటలు ఎంటర్‌టైన్ చేయడమే ధ్యేయంగా రూపొందిన చిత్రం బకాసుర రెస్టారెంట్. ఈ సినిమా చూసిన వాళ్లకు ఓ మంచి విందు భోజనం ఆరగించిన ఫీల్ కలగబోతుందని చెబుతోంది చిత్ర టీమ్. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతుంది.

ఇటీవల విడుదలైన ఈ చిత్రంలోని పాటలకు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈవేడుకకు హీరో సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ, ప్రవీణ్ నాకు వన్‌ఆఫ్ ఫేవరేట్ యాక్టర్. నన్ను ఏ దర్శకుడు అడిగినా నేను ప్రవీణ్ పేరు చెబుతాను. ఏ సినిమా అయినా ఎలా సక్సెస్ చేయాలో తపన పడుతుంటాడు. ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నాడు. మంచి నటుడే కాదు మంచి వ్యక్తి కూడా. అందరి మంచి కోరుకుంటాడు. అందరికి మర్యాద ఇచ్చే వ్యక్తిఅన్నారు. నిర్మాత జనార్థన్ మాట్లాడుతూ, ఈ సినిమాకు కథే హీరో.. మంచి కథను దర్శకుడు చాలా బాగా తెరకెక్కించాడు. నటుడు ప్రవీణ్, వైవా హర్ష.. ఇలా అందరం కలిసి బకాసుర రెస్టారెంట్‌లో మంచి డిష్‌ను ప్రిపేర్ చేశాం. అందరికి మా డిష్. అంటే మా సినిమా నచ్చుతుందని అనుకుంటున్నాను. మా సినిమాను దిల్ రాజు బ్యానర్ ఎస్‌వీ ద్వారా విడుదల చేస్తున్నాం అన్నారు. దర్శకుడు ఎస్ జే శివ మాట్లాడుతూ, విరూపాక్షకు దర్శకత్వ శాఖలో పనిచేశాను. ఆ సినిమా వల్లే నేను దర్శకుడినయ్యాను. వికాస బడిస భవిష్యత్‌లో పెద్దసంగీత దర్శకుడవుతాడు అన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ, మా జీవితాలకు టర్నింగ్ పాయింట్‌గా నిలిచిన ప్రేమకథా చిత్రమ్ హీరో అతిథిగా రావడం ఆనందంగా ఉంది.

నన్ను నమ్మి కథలో నన్ను ప్రధాన వస్తువుగా సినిమా తీసిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. వికాస బడిస సంగీతం టాక్‌ఆఫ్ ది టౌన్, టెక్నిషియన్స్ అందరూ ది బెస్ట్ ఇచ్చారు. శివ కథ చెప్పినప్పుడే గ్యారంటీగా బాగా తీయగలడు అనే నమ్మకం కలిగింది. బకాసుర రెస్టారెంట్ ఇంటిల్లాపాఇది చూడాల్సిన ఎంటర్‌టైనర్ అండ్ ఎమోషనల్ ఫిల్మ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం రాజేష్, షైనింగ్ ఫణి,



వివేక్ దండు, అమర్, రామ్ పటాస్, రమ్య ప్రియ, ప్రాచీ ఠాకూర్, డిఓపీ బాల సరస్వతి, సంగీత దర్శకుడు వికాస్ బడిస, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వినయ్ కొట్టి తదితరులు పాల్గొన్నారు. ప్రవీణ్, వైవా హర్ష, షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య ప్రియ, ప్రాచీ ఠాకూర్, జబర్ధస్త్ అప్పారావు తదితరులు.

# 29న 'పరమ్ సుందరి'

'జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటించిన పరమ్ సుందరి మూవీ ఆగస్టు 29న విడుదల కాబోతోంది. బాలీవుడ్ జనాలు ప్రస్తుతం వార్2 మూవీ గురించి వేచి చూస్తున్న తరుణంలో తన సినిమా డేట్‌ని అనౌన్స్ చేసి అందరికీ షాక్ ఇచ్చారు డైరెక్టర్ ఎన్నో అంచనాలతో పరమ్ సుందరి మూవీని విడుదల చేయడానికి రెడీ అయిపోయారు చిత్ర యూనిట్. ఈ నేపథ్యంలోనే పరమ్ సుందరి మూవీలో జంటగా నటించిన జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రాల ఏజ్ గ్యాప్‌పై ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్ వస్తున్నాయి. చాలామంది ఈ జంటను టార్గెట్ చేస్తూ ఎక్స్ వేదికగా ట్రోల్స్ చేస్తున్నారు. తుషార్ జాలోట డైరెక్షన్లో రాబోతున్న ఈ సినిమాకి సంబంధించిన మ్యూజిక్, టీజర్ అన్నీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కానీ ఒకే ఒక్క అంశం మాత్రం సోషల్ మీడియాలో భారీ ట్రోలింగ్‌కి గురవుతోంది. అదే హీరో, హీరోయిన్ మధ్య ఏజ్ గ్యాప్.. జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా మధ్య 12 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉండడంతో చాలామంది ఈ విషయాన్ని వైరల్ చేస్తున్నారు. అంటూ చాలా దారుణంగా ట్రోల్స్ చేస్తూ ఉండడం గమనార్హం. వీబి ఫస్ట్ సాంగ్ రిలీజ్.. థియేటర్లలో ఫ్యాన్స్‌కు పూనకాలే వాస్తవానికి ఈ మధ్యకాలంలో చాలా సినిమాల్లో నటించిన హీరో హీరోయిన్ల మధ్య ఏజ్ గ్యాప్‌పై ట్రోల్స్ వినిపిస్తున్న సంగతి మనకు తెలిసిందే. అయితే అటు ఈ ఏజ్ గ్యాప్‌పై వచ్చిన ట్రోలింగ్‌ని హీరో, హీరోయిన్లు తిప్పికొట్టే ప్రయత్నం చేసినా ట్రోల్స్ మాత్రం ఆగడం లేదు. ముఖ్యంగా ఈ సినిమాలో హీరో, హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ అస్సలు బాలేదని, ఏజ్ గ్యాప్ స్పష్టంగా తెలిసిపోతోందని, ఇద్దరితో బలవంతంగా కెమిస్ట్రీ పండించినట్టు స్పష్టంగా అర్థం అవుతోందంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు. అంతేకాదు వీరిద్దరి ఏజ్ గ్యాప్ వల్ల సినిమాలోని ప్రేమ కథకి కూడా దెబ్బ పడుతుంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. వీరిద్దరు అచ్చం అన్నా చెల్లెళ్లలాగే ఉన్నారని కూడా అంటున్నారు. మేకప్ వేసి ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం ఎంత తగ్గించాలనుకున్నా కూడా చూసే ఆడియన్స్ ఇట్టే కనిపెట్టే స్తారు అని, ఈ సినిమా నటీనటులు ఎంపిక చాలా దరిద్రంగా ఉంది అంటూ కామెంట్లు పెడుతున్నారు.



# 'త్రిబాణధారి బార్బరిక్'లో అదరగొట్టేసిన ఉదయభాను

వెర్సటైల్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం త్రిబాణధారి బార్బరిక్. కొత్త పాయింట్, కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యులాయిడ్ బ్యానర్‌పై విజయ్‌పాల్ రెడ్డి అడిదాల నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలైన పాటలు ఇప్పటికే ప్రేక్షకులను అలరించాయి. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఓ మాస్ నంబర్‌ను వదిలారు. ఈ స్పెషల్ సాంగ్‌లో ఉదయ భాను అందరినీ ఆకట్టుకున్నారు. ఇస్కితడి ఉస్కితడి అంటూ సాగే ఈ పాటను రఘు రామ్ రచించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన ఈ పాట అందులోనూ ఉత్సాహాన్ని నింపేలా ఉంది. ఇంఫ్యూజన్ బ్యాండ్ ఇచ్చిన బాణీకి బీ, సీ సెంటర్లు ఊగిపోయేలా ఉన్నాయి. ఇక ఇందులో ఉదయ భాను స్టెప్పులు స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. ఇప్పటి వరకు వదిలిన నీ వల్లే నీవల్లే, అనగనగా కథలా, బార్బరిక్ థీమ్ సాంగ్ అందరినీ మెప్పించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. రిలీజ్ కోసం చిత్రయూనిట్ ప్రమోషన్ కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. ఈ చిత్రంలో సత్యరాజ్, సత్యం రాజేష్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను, క్రాంతి కిరణ్ వంటి వారు నటించారు. ఇక ఉదయ భాను పాత్ర మరింత ప్రత్యేకంగా ఉండబోతోందని తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీని టీం ప్రకటించనుంది. తారాగణం: సత్యరాజ్, సత్యం రాజేష్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను, క్రాంతి కిరణ్, విటివి గణేష్, మొట్టా రాజేంద్రన్, మేఘన తదితరులు. రచన, దర్శకత్వం: మోహన్ శ్రీవత్స.



# అందంతో అలరిస్తున్న 'ఆషిక'

కన్నడ ముద్దుగుమ్మ ఆషికా రంగనాథ్ మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. తెలుగులో అమిగోస్, నా సామి రంగ సినిమాలతో అలరించిన ఈ అమ్మడు ఆ సినిమాలు నిరాశ మిగల్చడంతో మళ్లీ కన్నడంలో బిజీ అయింది. అక్కడ నుంచి తిరిగి టాలీవుడ్‌లో విశ్వంభర సినిమాతో ఎంట్రీకి సిద్ధంఅయింది. విశ్వంభర సినిమాలో త్రిష మెయిన్ లీడ్ కాగా, ఆషికా సెకండ్ హీరోయిన్‌గా కనిపించబోతున్నట్లు సమాచారం అందుతోంది. వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వంభర సినిమా ఈ అక్టోబర్ లేదా నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ వర్క్ చివరి దశలో ఉన్నట్లు దర్శకుడు వశిష్ట ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. విశ్వంభర సినిమాపై ఆషికా చాలా ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. సింపుల్ లుక్‌లో ఆషికా రంగనాథ్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆషికా స్కిన్ షో చేయకుండానే చాలా అందంగా కనిపిస్తూ ఉంటుంది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేస్తేనే ఆ ఫోటోలకు రీచ్ ఉంటుంది. కానీ ఆషికా ఇలా పద్ధతైన ఔట్ ఫిట్‌లోనూ చాలా అందంగా కనిపించడం ద్వారా ఎక్కువ రీచ్‌ను సొంతం చేసుకుంటుంది. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేసిన ఆషికా రంగనాథ్ ఆకట్టుకునే అందం కారణంగా మరిన్ని ఆఫర్లు సొంతం చేసుకుంటుంది. సింపుల్ పాత్రలకు మోస్ట్ వాంటెడ్ ఛాయిస్ ఆషికా అనడంలో సందేహం లేదు. అందుకే ఆమెను మళ్లీ మళ్లీ పలువురు ఫిల్మ్ మేకర్స్ తమ సినిమాల్లో నటింపజేయడం చూస్తూ ఉంటాం. ముందు ముందు టాలీవుడ్‌లో ఈమె బిజీ స్టార్‌గా మారడంఖాయం. తాజాగా ఈమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన అందమైన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. నా సామి రంగ ఏం అందం అన్నట్లుగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ పంజాబీ డ్రెస్‌లో వెనుక నుంచి నడుము అందం చూపించడం ద్వారా కవ్విస్తుంది. సింపుల్‌గా ఉన్నా ఈ లుక్‌లో ఆషికా అందం ఓ రేంజ్‌లో ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆషికా ఇంత అందంగా ఉండటం వల్లే కెరీర్ ఆరంభం అయ్యి పదేళ్ల అయినా వరుస ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. ప్రస్తుతం కన్నడ సినిమాలతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ నటిస్తుంది.



# రాబడి సాగు



అల్లూరి సీతారామరాజు జిల్లా, డంబ్రిగుడ మండలం, బలియగూడకు చెందిన పాంగి వినీత కుటుంబానికి ఎకరా భూమి ఉంది. రాళ్లు నిండి, నీరు లేని ఆ భూమిని సాగులోకి తీసుకురావాలని నాలుగేళ్ల కిందట సంకల్పించారామె. 'అక్కడ సేద్యమంటే కొండని తవ్వి ఎలుకని పట్టడమే' అన్నారంతా. నేడు ఆ రాళ్ల భూమిలోనే రతనాలు పండిస్తున్నారీ ఆదివాసీ మహిళ. భర్త సహకారంతో రాళ్లను తొలగించారు. కొండ పైనుంచి వస్తున్న ఊట నీటిని పొలానికి మళ్లిస్తున్నారు. ఏడాది పొడుగునా ఆదాయం వచ్చేలా కూరగాయల పెంపకంపై దృష్టి సారించారు. టొమాటో, వంగ, ముల్లంగి, కొత్తిమీర, బెండ, మిరప, మొక్కజొన్న, బీన్స్, తోటకూర, క్యాబేజీ వంటి కూరగాయలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో రాగులు, సామలను పండిస్తున్నారు. గులి విధానంలో రాగు సాగు చేసి ఎకరాకు 700 కిలోల మేర దిగుబడిని సాధించారు. ఈ పొలం నుంచి ఏటా రూ.2.50 లక్షల ఆదాయాన్ని పొందుతున్నారు. సేంద్రియ విధానంలోనే సేద్యం చేస్తున్న వినీత... ఆవు, మేకల విసర్జితాలను ఉపయోగించి సొంతంగా ఎరువులు తయారు చేసుకుంటున్నారు. గ్రామంలో 20 కుటుంబాల భూములన్నీ రాళ్లతో నిండినవే వినీత చూపిన బాటలోనే వాళ్లూ నడుస్తున్నారు. స్థానిక, నాటు విత్తన రకాలకుతోడు ఒడిశ నుంచి కొన్నింటిని సేకరించారు. ఏళ్ల నుంచి చీడపీడలకు గురికాని కూరగాయలు, ఇతర సంప్రదాయ పంటల విత్తనాలను కొద్దికొద్దిగా తెచ్చుకున్నారు. ఏటా పంటలో కొంత విత్తనాలకే దాచి పెడతారు. వాటిని గ్రామాల్లోని ఇతరులకు అందిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి తగ్గడమే కాదు. నాణ్యమైన, నమ్మకమైన విత్తనాలను నాటుకోగలుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ మహిళా రైతు అవార్డు అందుకున్నారు వినీత. □

# పిల్లల్లో చెవి ఇన్ఫెక్షనా..?



పసి తనంలో పిల్లలకు అప్పుడప్పుడూ చెవి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. అవి సాధారణమే అని తేలిగ్గా తీసుకుంటున్నారా.. కానీ అవి పిల్లల్లో భాషా నైపుణ్యాలు కొరవడేలా చేస్తాయని మీకు తెలుసా! పసి పిల్లలు ముఖ్యంగా మూడేళ్లలోపు వారిలో తరచూ చెవి ఇన్ఫెక్షన్లు వస్తుంటే.. వాటిని తేలిగానతీసుకోవద్దని పరిశోధకులు చెబుతున్నారు. ఎందుకంటే అవి వారిలో తాత్కాలికంగా వినికిడి లోపించేలా చేసి, భాషా నైపుణ్యాలు మెరుగుపడకుండా చేస్తాయట. 5-10ఏళ్ల పిల్లలను పరిశీలించినప్పుడు వాళ్లలో మూడేళ్లలోపు ఎవరికైతే ఎక్కువ చెవి ఇన్ఫెక్షన్లు వచ్చాయో, వాళ్లలో పద ఉచ్చారణ సరిగా లేనట్లు గుర్తించారు. ఈ ఇన్ఫెక్షన్లు వారి కర్ణభేరిలో ఒక రకమైన ఫ్లూయిడ్ ఏర్పడేలా చేస్తాయట. ఇది శబ్దాలు వినపడకుండా అడ్డుకుంటుందట. అందుకే చెవి ఇన్ఫెక్షన్లు ప్రమాదకరమైనవనీ, గుర్తించిన వెంటనే చికిత్స చేయించాలనీ చెబుతున్నారు. □

# స్నేహబంధం మధురాతి మధురం




**స్నేహ బంధము ఎంత మధురము/ అది తరిగిపోదు చెరిగిపోదు జీవితాంతము అన్నారు ఓ సినీ మహాకవి. మరి నిజమే కదండీ స్నేహబంధం ఎంతో మధురాతి మధురంగా ఉంటుంది. జీవితకాలం అది మన వెన్నంటే ఉంటుంది. ఆ ఒక్క పదమే స్నేహం, ఆ పదం ఆనందాన్ని ఇస్తుంది. మండుటెండలో చల్లని ఐస్ క్రీమ్‌ని తింటున్నాను అనుభూతినిస్తుంది స్నేహం. నిర్వచనానికి అందని గొప్ప పదం. ఇంకా చంద్రుడి వెన్నెలలా చల్లదనాన్ని ఇస్తుంది. స్నేహమంటే ఓ నమ్మకం, ఓ ఆహ్లాదం. రెండు మనసులను కలిపే తీయని బంధం.**

స్నేహం జీవితానికి ఓ గమ్యం చూపేది. స్నేహం స్నేహితునితో ఉంటే ప్రతి రోజు పండగే. కానీ దీనికి ప్రత్యేకంగా ఓ రోజు ఉంది. అదే అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం. ఈ స్నేహితుల రోజు వెనక ఓ పెద్ద కథే ఉంది. 1935 ఆగస్టు మొదటి శనివారం అమెరికా ప్రభుత్వం ఓ వ్యక్తిపై కాల్పులు



జరిపింది. ఈ విషయం తెలిసి తట్టుకోలేక ఆ మరుసటి రోజు కాల్పుల్లో చనిపోయిన వ్యక్తి స్నేహితుడు ఆత్మహత్య చేసుకుంటాడు. దీనికి చలించిపోయిన అమెరికా ప్రభుత్వం ఆగస్టు నెలలో వచ్చే తొలి ఆదివారం స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. ఈ విధంగా ఇది ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హాల్‌మార్క్ కాల్స్ ఫౌండర్ జాయస్ హాల్ ఈ కార్డ్స్ కాన్సెప్ట్‌ని మొదటిసారిగా పరాగ్వేలో ప్రతిపాదించారు. 1958 నుంచి అధికంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. 'దోస్త్ మేరా దోస్త్ తుమ్హే మేరీ జాన్/ వాస్తవంగా దోస్త్ నువ్వేరా నా ప్రాణం/ అన్నారు ఓ సినీ కవి అన్నారు. అవును కదండీ చిన్న-పెద్ద, ఆడ-మగ తేడా లేకుండా అందరినీ ఒకటిని చేస్తుంది. ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో తెలియదు. స్నేహమనే చిన్న బంధం వారిని 'నువ్వే నా ప్రాణం' అంటూ ఒకటిగా ఉంచుతుంది. ఇలా ఉన్న స్నేహితులంతా ఈ రోజున తమ స్నేహితులపై ఉన్న ప్రేమను వ్యక్తపరచడానికి తమ స్నేహితులతో ఆనందంగా డోలికల్లో తేలి ఆడతారు. ఈ సందర్భంగా పూలు, కార్డులు, మణికట్టు బ్యాండ్లు వంటివి ఇచ్చి పుచ్చుకుంటారు. అలాగే ఈ రోజు పార్టీలు చేసుకోవడం, విహారయాత్రలకు వెళ్లడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం వంటివి చేస్తారు. ఇలా విభిన్న సంస్కృతుల మధ్య ఐక్యత అవగాహన శాంతిని పెంపొందించేందుకు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ ప్రపంచంలో బంధాలను బలోపేతం చేసుకోవడానికి సంఘీభావం పెంపొందించుకోవడానికి ఈ రోజును ఘనంగా జరుపు కుంటారు. అమ్మ ఒడి వీడాక, నాన్న చెయ్యి వదిలాక దొరికే తోడు స్నేహితుడు. కష్టమైనా కన్నీళ్ళయినా పంచుకునేది



ప్రియనేస్తమే అడుగున అండగా నిలిచే ఆత్మబంధు స్నేహితుడు. నిజమే కదండి స్నేహితుడు సంతోషాన్ని పంచుకుంటాడు. భావాలను పంచుకుంటాడు. గతాన్ని గుర్తు చేస్తాడు. వర్తమానాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాడు. అందుకే స్నేహానికి వున్న గొప్పతనం వర్ణించడం ఎవరితరం కాదు. స్నేహాన్ని స్వయంగా అనుభవిస్తే దానిలోని మాధుర్యం అర్థమవుతుంది. ఎవరి మాటలు వింటే ఆనందం కలుగుతుందో, ఎవరు దూరమైతే కళ్ళల్లో నీళ్లు తిరుగుతాయో, ఎవరు పక్కన లేకుంటే తీరని వెల్తిగా ఉంటుందో, ఆ వ్యక్తే అసలు సిసలైన ఫ్రెండ్ అని చెప్పవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎలా బతకాలో, ఎంత అందంగా జీవిందాలో స్నేహం నేర్పుతుంది. అందుకే ఓ మంచి



మిత్రుడు మనతో ఉంటే లెక్కలేనంత సంపద మనతో ఉన్నంత ఆనందం కలుగుతుంది. ప్రతి మనిషికి తన భావం స్వేచ్ఛగా వ్యక్తపరచుకోవడానికి ఓ మంచి స్నేహితుడు/ స్నేహితురాలు అవసరం. అలాంటి స్నేహాల్లో ఎలాంటి స్వార్థం ఉండకూడదు. ఒకరినొకరు మోసం చేసుకోకూడదు. ఒక స్నేహంలో పరస్పరం ఎన్నో నేర్చుకోవాలి. విభిన్న అభిప్రాయాలు కలిగి ఉన్నా ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు సాగాలి. ఇవే అసలైన స్నేహానికి నిర్వచనం. ఒక వ్యక్తి గుణగణాలను అతని ఎంచుకున్న స్నేహితుణ్ణి బట్టి నిర్ణయించగలం. నిజమైన స్నేహితుల మధ్య రహస్యాలు ఉండకూడదు. సమయానికి తగినట్లుగా తమ కష్టాలను ఒకరితో ఒకరు పంచుకోవాలి. స్నేహంలో సుఖాలు పంచాలి. దుఃఖాలు దూరమవ్వాలి. కష్ట సమయంలో కలత చెందిన మనసుకి శాంతికి కలిగించే దివ్య ఔషధం స్నేహం. అందుకే కవి గారు అంటారు స్నేహమేరా జీవితం/స్నేహమేరా నా శాశ్వతం అని. అవసరమైనప్పుడు సహకరించడానికి ఆప్త మిత్రులు ఉన్నారని భావన కష్టాలను దూరం చేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇద్దరు వ్యక్తుల మధ్య స్నేహం తెరిచిన పుస్తకం లాంటిది. ఈ సృష్టిలో నా అనే వారు బంధువులు లేని వారు ఉంటారేమో కానీ స్నేహితులు లేని వారు ఉండరు. అలాంటి స్నేహం ప్రకృతి వంటిది. అది ఆహ్లాదంతోపాటు హాయిని ఇస్తుంది. జీవనయాలలో స్నేహం శ్వాస వంటిది. అమ్మ ప్రేమ, స్నేహం ఈ రెండు ఎంతో పవిత్రమైనవి. ఈ పాట చూడండి. ఎంత మధురంగా అద్భుతంగా ఉందో ' ఫ్రెండ్షిప్పే తీయని పుష్పం/ఫ్రెండ్షిప్ డే గుండెల శ్వాసం/ ఫ్రెండ్షిప్పే ఎప్పుడు ఆనందం/ఏటికి ఒకటో రెండో పండగలేమో ఊరికి వస్తాయి/ కానీ చెలిమిలో మాత్రం రోజురోజుకీ సందడులు ఉంటాయి. ఇలా రెండు శరీరాలు ఒకటే ఆత్మ అనే కవుల కలాలతో 'స్నేహానికన్న మిన్న ఈ లోకాన లేదురా' అన్న మధుర గానాలతో స్నేహం నిత్య నూతనంగా ధ్రువతారలా, నిండు చందమామలా ఈ భూమ్యాకాశాలు ఉన్నంతవరకు వెలిగిపోవాలని కోరుకుంటూ.. ప్రియనేస్తాలందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు జేజేలు వందనాలు.

**- పింగళి భాగ్యలక్ష్మి**

# ఇంటర్వ్యూకు వెళ్తున్నారా!

**అమ్మాయలు ఎన్నో ఇంటర్వ్యూ వెళుతుంటారు. ఈ సారైనా ఉద్యోగాన్ని సంపాదించగలనో లేదో అని భయపడు తుంటారు. ఇటువంటప్పుడు జాబ్‌కు సంబంధించిన విషయాలతోపాటు బాడీ లాంగ్వేజ్‌లో పొరపాట్లుంటే సరిదిద్దుకొని వెళ్లడం మంచిది.**


♦ ఇంటర్వ్యూ చేస్తున్నవారికి ఎదురుగా ఒంటి కూర్చోవడం, కాలుపై కాలువేసుకొనో.. లేదా టేబుల్‌కు దూరంగా కుర్చీకి జారగిలపడటం వంటివి చేయకూడదు. ఇవన్నీ మీలో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్నట్లు, ఉద్యోగం పట్ల ఉత్సాహం లేదన్నట్లుగా చూపిస్తాయి. ఈ కదలికలు అవతలివారి ఏకాగ్రతను దూరం చేస్తాయి. స్ట్రెయింగ్.. మీ గంభీరతను చాటుతూ ప్రొఫెషనలిజాన్ని చూపెడుతుంది.

♦ చేతులు కట్టుకొని కూర్చోవడం కూడా సరైనది కాదు. ఈ భంగిమ స్వీయరక్షణగా అనిపిస్తుంది. అలాగే మీరు చెప్పగలిగేది ఇకపై ఏదీ లేదనే సంకేతాన్ని అవతలివారికి ఇస్తుంది. అలాకాకుండా చేతులు రెండూ ఫ్రీగా ఉంచికూర్చోవడం మేలు. అప్పుడే ఎదుటివారు చెప్పేదానిపై మీ శ్రద్ధతోపాటు వారిపట్ల మీరు పాటిస్తున్న మర్యాద కనిపిస్తుంది.

♦ ముఖంపై పడిన జుట్టు సర్దుకోవడం, గోళ్లరంగు చూస్తూ.. కాళ్లూపడం, నిమిషానికొకసారి ముఖంపై చేతితో రుద్దుకోవడం వంటివి చేయకూడదు. దాన్ని మీ నిరాసక్తత లేదా భయంగా ఎదుటివారు భావిస్తారు. ఇంటర్వ్యూలో ఎటువంటి కదలికలను ప్రదర్శించకుండా అవసరమైనంత మనరకు జవాబు చెబుతూ, వారు చెప్పేది పూర్తిగా వినడంపై ఏకాగ్రత ఉంచితే మేలు. ్యఅడుగడుక్కీ చేతి వాచీ, గోడ గడియారం లేదా ఫోన్‌లో సమయం చూడటం మీ అసహనాన్ని ప్రదర్శిస్తుంది. ఆ ఇంటర్వ్యూపై మీకు ఆసక్తిలేదనే తప్పుడు సంకేతాన్నిస్తుంది. సమయం పూర్తవుతుందనే కంగారు మీకు ఉండి ఉండొచ్చు. అలాకాకుండా ఎదుటకూర్చుననవారు మీ కోసం కేటాయించిన సమయానికి మర్యాదనివ్వగలిగితే చాలు.

♦ బల్లపై ఉన్న పేపర్‌వెయిట్, పెన్ లేదా కీచెయిన్ వంటి వస్తువులను కదపడంవల్ల మీరు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు లేదా బోర్ ఫీలవుతున్నట్లు ఎదుటివారికి అనిపిస్తుంది. కాబట్టి సౌకర్యంగా కూర్చొని పూర్తిగా అవతలివారు అడిగే ప్రశ్నలమీదే దృష్టిని కేంద్రీకరించి ఆత్మ విశ్వాసంతో సమాధానం చెప్పగలిగిన ప్పుడే మంచి ఫలితా లొస్తాయి. □

# దేవుడిలో నిలిచి ఉంటే భయముండదు..



క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్లిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయపునరుత్థానము ను గూర్చి చెప్పెను. ఈ యేసును దేవుడు లేపెను, దీనికి మేమందరము సాక్షులము (అపొస్తలుల కార్యములు 2: 31. 32). ఈ సాక్ష్యాన్ని యేసుక్రీస్తు 12 మంది శిష్యులలో ఒకడైన పేతురు చెప్పాడు. ఈ పేతురు ఒకప్పుడు యేసుక్రీస్తు ఎవరోతనకు తెలియదని మూడు సార్లు అబద్ధం చెప్పాడు. యూదులు తనను చంపుతారనే భయంతో అబద్ధాలు చెప్పాడు కానీ, అనంతరం ప్రభువు మరణించి, పునరుత్థానమైన తర్వాత పేతురును దర్శించాడు. అప్పుడు పేతురులో ఎక్కడలేని ధైర్యంవచ్చింది. జీవిస్తే ప్రభువు కోసమే జీవించాలి లేదంటే ప్రభువుకోసమే చావాలి అనే తెగింపు వచ్చింది. యూదులమధ్యలో నిలబడి బహిరంగంగా యేసుక్రీస్తును గురించిన సత్యాన్ని ధైర్యంగా చెప్పాడు. మీరు క్రీస్తును సిలువలో హతమార్చారు. అయితేఆయన(ప్రభువు) మూడవరోజు మరణం నుంచి లేచాడు. అందుకు మేమే సాక్షులమని చెప్పాడు. ఈ మాటల్ని విన్న యూదులు తమ హృదయంలో గుచ్చుకుని, అప్పుడే యేసుక్రీస్తును తమ సొంతరక్షకుడిగా అంగీకరించి, బాప్తిస్మం తీసుకున్నారు. నిజమేదేవుడిని యథార్థంగా సేవించేవారు భయపడరు. పరిస్థితులు ఎలా ఉన్నా దేవుడిపై తమ విశ్వాసాన్ని ఉంచుతారు. ఖీవారుపేతురు, యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు విద్యలేని పామరులని గ్రహించి, ఆశ్చర్యపడి, వారు యేసుతో కూడా ఉండినవారని గుర్తెరిగిరిఖీ (అపొస్తలుల కార్యములు 4:13). పేతురు, యోహానులు దేవుడి గురించి ధైర్యంగా, బహిరంగంగామాట్లాడుతుంటే యూదులు విస్మయం నొందారు. వీరు యేసుతో కూడా ఉండినవారని గుర్తించారు. అవును వారి నడవడి, భక్తిజీవితం ఆవిధంగా ఉంది. దేవుడికి మనం సాక్షులుగా ఉండాలి. సాక్షులు అంటే ఏదో తెల్లటి వస్త్రాలను ధరించి చేతిలో బైబిల్ పట్టుకుని ఉండడం కాదుకానీ, మన మాటతీరు, ప్రవర్తనలో పరిశుద్ధత, ప్రేమ, క్షమ, అనురాగం, దీర్ఘశాంతం ఇవన్నీ ఉండాలి. అలాగని మనలో భావోద్వేగాలు ఉండవని కాదు. కోపపడడంలో పాపం లేదుకానీ, ఆ కోపంలో పాపం చేయకూడదు. నొప్పించేలా ప్రవర్తిస్తే క్షమాపణ అడిగేందుకు జాగుచేయకూడదు. చివరికి పేతురు యేసుక్రీస్తు కోసం తలకిందులుగా సిలువ వేయించుకుని మరణించాడు. నేటికి ప్రభువు శిష్యుడిగా మనకందరికీ ఆదర్శంగా నిలిచాడు.


**-పి.వాణిపుష్ప**

అంతర్వాణి

# నచ్చే బ్రేక్‌ఫాస్ట్ రెసిపీ

టేస్ట్ ఆఫ్ అట్లాస్ తాజాగా ఎంపిక చేసిన 50 బెస్ట్ బ్రేక్‌ఫాస్ట్ రెసిపీల్లో మూడు మనవే ఉండటం విశేషం. నిజానికి ఊతప్పం, పనియారం, అక్కీ రోటీ, థేప్లా.. ఇలా మన ఫలహారాలెన్నిటినో విదేశీయులు కూడా ఇష్టంగా తింటున్నారు. ఈ సందర్భంలో ఎంపిక చేసిన మిసల్ పావ్, పరోటా, భోలే భటూరేలతో పాటు ఇంకొన్ని వంటకాలు మీ కోసం..

## మిసల్ పావ్



**కావలసినవి:** పెసలు, శనగల్లాంటి మొలకెత్తిన గింజలు 2 కప్పులు, ఉల్లి తరుగు కప్పు, టొమాటో ముక్కలు ముప్పావు కప్పు, ఉప్పు రుచికి తగినంత, కొత్తిమీర తరుగు అర కాపు పసుపు పావు చెంచా, కారంన్నర చెంచా, మిసల్ మసాలా 3 టేబుల్ స్పూన్లు, బెల్లం టేబుల్ స్పూన్, చింతపండు గుజ్జు చెంచా, నూనె 4 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు 4, కొబ్బరి ముద్దలు, చెంచాలు, 2 టేబుల్ స్పూన్లు, కొబ్బరి తురుము, 2 టేబుల్ స్పూన్లు ముప్పావు చెంచా చొప్పున, కరివేపాకు 2 రెబ్బలు, ఇంగువ పావు చెంచా, పావ్ 8, వెన్న 2 టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ 1, సన్న కారప్పూస అర కప్పు 30

**తయారీ:** కడాయిలో నూనె వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువ ఒక్క దాని తర్వాత ఒక్కటి వేయాలి. అవి వేగాక ఉల్లి తరుగు జోడించాలి. అది గోధుమరంగులోకి మారే వరకూ వేయించి టొమాటో ముక్కలు, అల్లం ముద్ద, కొబ్బరి తురుము జతచేయాలి. టొమాటో ముక్కలు మెత్తబడ్డాక కారం, మీసల్ మసాలా, పసుపు, మొలకెత్తిన గింజలు, ఐదు కప్పుల నీళ్లు, చింతపం గుజ్జు వేసి ఉడికించాలి. గింజలు మెత్తగా ఊడికి, చిక్కగా అయ్యాక కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి దించేసి సన్న కారప్పూస చల్లాలి. పెనం మీద వెన్నతో పావ్లను వేయించుకోవాలి. ఇక వేడివేడిగా మిసల్ పావ్ తిని ఆనందించటమే తరువాయి.

## ఛోలే భటూరే ...



**కావలసినవి:** పసుపు ఛోలే కోపం: శనగలు 2 కప్పులు, ఉల్లి తరుగు, టొమాటో ముక్కలు ముప్పావు కప్పు చొప్పున, అల్లం అంగుళం ముక్క, వెల్లుల్లి రెబ్బలు 5, ఎండు కొబ్బరి పొడి టేబుల్‌స్పూన్, నూనె 2 టేబుల్ స్పూన్లు, బిర్యానీ ఆకు, స్టార్ మొగ్గ ఒక్కొకటి, యాలకులు 2, లవంగాలు, లవంగాలు, 4, లవంగాలు, పొడి, లవంగాలు, 4, లవంగాలు, చోలే మసాలా చెంచా చొప్పున, కొత్తిమీర తరుగు గుప్పెడు, నిమ్మకాయ 1 **తయారీ:** శనగలను ముందు రోజు రాత్రి నానబెట్టి, ఉదయం ఆ నీళ్ల తీసేసి కుక్కర్లో నాలుగు విజిల్స్ వచ్చేదాకా ఉడికించాలి. అల్లం, వెల్లుల్లి, కొబ్బరి పొడి, ఉల్లి, టొమాటో ముక్కలను మిక్సీజార్లో వేసి గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. ఆవాలు, జీలకర్ర, బిర్యానీ ఆకు, స్టార్ మొగ్గ, యాలకులు, లవంగాలను వేయించాలి. అందులో గ్రైండ్ చేసిన మసాలా చేర్చాలి. పచ్చి వాసన పోయే వరకూ కలియబెట్టి ఉడికించిన శనగలు, పసుపు, ఉప్పు, తగినన్ని నీళ్లు జతచేయాలి. మధ్యమధ్యలో కలియతిప్పుతూ సన్న సెగ మీద 20 నిమిషాలు ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి దించాలి. నిమ్మకాయను ముక్కలుగా కోసి గార్నిష్ చేయాలి. వెడల్పాటి పాత్రలో మైదా, అర కప్పు వేడి నీళ్లు, రవ్వ, పంచదార, నెయ్యి వేసిమెత్తగా అయ్యే వరకూ కలిపి రెండు గంటలు పక్కనుంచాలి. ఈ పిండితో ఐదారు అంత వెడల్పు ఉండేలా భటూరాలు చేయాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో లేత గోధుమ రంగు వచ్చే వరకూ వేయించాలి. అంతే.. నోరూరించే ఛోలే భటూరే సిద్ధం.

## దలియా ..



**కావలసినవి:** గోధుమ రవ్వ అర కప్పు, పెసరపప్పు 2 టేబుల్ స్పూన్లు, బెల్లం పొడి 4 టేబుల్ స్పూన్లు, చిక్కటి పాలు ఒకటిన్నర కప్పు, పిస్తా, కిస్మిస్, బాదం, జీడిపప్పులు గుప్పెడు, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి అర చెంచా,

**తయారీ:** కుంకుమపువ్వు కొద్దిగా బెల్లంపొడిలో కొన్ని నీళ్ల చేర్చి వేడిచేయాలి. పొంగు వచ్చాక వడకట్టి పక్కనుంచాలి. ఫ్యాన్‌లో నెయ్యి వేడిచేసి గోధుమ రవ్వ, పెసరపప్పులను కలియతిప్పుతూ వేయించాలి. రవ్వ, పప్పురెండూ చక్కగా వేగి మంచి వాసన వస్తున్నప్పుడు కిస్మిస్, పిస్తా, బాదం, జీడిపప్పులు వేసి.. కొన్ని క్షణాలు వేయించాలి. అందులో రెండు కప్పుల పోసి, మూత పెట్టేసి సన్న సెగ మీద నీళ్లు ఉడికించాలి. మెత్తగా ఊడిన తర్వాత పాలు, కుంకుమ పువ్వు, యాలకుల పొడి జతచేయాలి. చిక్కగా అయ్యాక దించాలి. చల్లారిన తర్వాత బెల్లం పాకం కలపాలి. వేడిగా ఉన్న ప్పుడు కలిపితే విరిగి నట్లవుతుంది.

## సాబూదానా కిచిడీ..



**కావలసినవి:** సగ్గుబియ్యం (సాబూదానా) కప్పు, పల్లీలు పావు కప్పు, ఉప్పు రుచికి తగినంత, పంచదార చెంచా, నూనె 2 టేబుల్ స్పూన్లు, బంగాళదుంప 1, పచ్చిమిర్చి 3, కొత్తిమీర తరుగు గుప్పెడు, అల్లం తరుగు, నిమ్మరసం చెంచా చొప్పున, ఒక కరివేపాకు

**తయారీ:** బంగాళదుంప చెక్కు తీసి సన్నగా ముక్కలు కోసుకోవాలి. సగ్గుబియ్యం కడిగి, మునిగే వరకూ నీళ్లు పోసి నానబెట్టాలి. రెండు గంటల తర్వాత ఆ నీళ్లు వడకట్టేయాలి. పల్లీలను వేయించి, చల్లారాక కచ్చాపచ్చాగా దంచాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. జీలకర్ర, కరివేపాకు చేర్చాలి. అవి వేగాక బంగాళదుంప ముక్కలను వేయించాలి. రెండు నిమిషాల తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తరుగు జోడించి కాస్త వేగనివ్వాలి. అందులో సగ్గుబియ్యం, పల్లీలు, ఉప్పు, పంచదార జతచేసి మధ్యమధ్యలో కలుపుతుండాలి. చివర్లో కొత్తిమీర తరుగు, నిమ్మరసం చల్లి దించాలి. ఇది పల్లీ లేదా కొబ్బరి పచ్చడితో తింటే సూపర్‌గా ఉంటుంది. □

# ఎండబెట్టడం ఎంత తేలికో !



చారులో నంజుకోవడానికి వడియాలుటే ఎంత బాటుంటుంది కదూ! కానీ వాటిని ఎండబెట్టడం పెద్ద ప్రహసనమే. దుమ్మూధూళీ పడుతుంది. కాకులు, పిల్లలు వంటి జీవాలు వస్తాయనే బెంగ ఉంటుంది. ఇక అలాంటి భయాలేమీ అవసరం లేదు. నైలాన్ నెట్టింగ్ ఫోల్డర్ కొనుక్కుని.. ఎండ తగిలే చోట కొక్కేనికి తగిలించేయొచ్చు. వీటిలో 3 నుంచి 5 వరకూ అరలుంటాయి. వడియాలు, చల్ల మిరప కాయలు, ఎండు మిరపకాయలు, మాగాయ పచ్చడికి ముక్కలు, పొడి చేసుకునేందుకు కూరగాయలు.. ఇలా వేటినైనా భేషుగ్గా ఎండబెట్టుకోవచ్చు. ముఖనయంగా అపార్ట్‌మెంట్‌లో ఎండబెట్టేంత చోటు లేనివారికి ఇది మరింత ఉపయోగపడుతుంది. □



# ప్రో కబడ్డీకి రంగం సిద్ధం

## 29 నుండి ప్రారంభం

### విశాఖ సహా సహా 4 నగరాల్లో టోర్నీ

### తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య తొలి మ్యాచ్

**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పికెఎల్) 12వ సీజన్ ఘనంగా ప్రారంభమయ్యేందుకు రంగం సిద్ధమైంది. ఈసారి నాలుగు వేదికల్లో టోర్నీని నిర్వహించేందుకు నిర్వాహకులు ప్లాన్ రెడీ చేశారు. ఈ లీగ్‌లో వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ అంతటా 12 జట్లు ట్రోఫీ కోసం తలపడతాయి. ఈ ప్రోలీగ్ టోర్నమెంట్ ఈ నెల 29న వైజాగ్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. దాదాపుగా ఏడేళ్ల తర్వాత వైజాగ్ వేదికగా కబ్బడ్డీ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రో కబడ్డీ లీగ్ నిర్వాహకులు విడుదల చేశారు. పికెఎల్ టోర్నమెంట్ ఈ నెల 29 నుండి అక్టోబర్ 23 వరకు నాలుగు నగరాల్లో జరుగనుంది. వైజాగ్‌లో మొదటి విడత మ్యాచ్‌లు ముగిసిన తర్వాత రెండో భాగం జైపూర్ లోని ఇండోర్ హాల్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మూడో దఫా చెన్నై, చివరిగా ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఢిల్లీ వేదికగా జరగనున్నాయి. ఇందులో భాగంగా వైజాగ్ (ఈ నెల 29 నుండి సెప్టెంబర్ 11 వరకు), జైపూర్ (సెప్టెంబర్ 12, 28), చెన్నై (సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 12 వరకు), ఢిల్లీ (అక్టోబర్ 13 నుండి 23 వరకు) మొత్తం 108 లీగ్ దశ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. హోమ్ టీమ్ అయిన తెలుగు టైటాన్స్ 2018లో చివరిసారిగా ఆరోస్థానాన్ని చేరినా, ఆ తర్వాత జరిగిన అన్ని సీజన్లలో టేబుల్‌లో అట్టడుగుకే పరిమితమైంది. ఈసారైనా బలంగా సత్తా చాటాలని తెలుగు టైటాన్స్ జట్టు ప్రణాళికలు రచిస్తుంది. డిఫెండింగ్ చాంపియన్స్ హర్యానా స్టీలర్స్ ఈ నెల 31న బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనున్నారు. ప్రస్తుతం లీగ్ షెడ్యూల్ విడుదల చేసిన ప్రో కబ్బడ్డీ లీగ్ నిర్వాహకులు ప్లే ఆఫ్స్ షెడ్యూల్‌ను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌గా

# భారత్ మహిళల టీం

### రెండోసారి దక్కిన టైటిల్.. ఫైనల్‌కు పురుషుల జట్టు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ మహిళా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే భారత్ పురుషుల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారత్ మహిళల జట్టు టైటిల్‌ను గెలుచుకోవడం వరుసగా ఇది రెండోసారి. ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో సహా మొత్తం ఆరు పతకాలను సాధించింది. ఇక హెవీవెయిట్ రెజ్లర్ లాకీ 110 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో భారత్ పురుషుల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లి, వ్యక్తిగత ప్రపంచ టైటిల్ కోసం పోటీలో నిలిచింది. 43 కిలోల విభాగంలో రచన స్వర్ణంతో ప్రచారాన్ని ప్రారంభించడంతో భారత మహిళల పతకాల జోరు ప్రారంభమైంది. ఆమె ఫైనల్‌లో చైనాకు చెందిన జిన్ హువాంగ్‌ను ఓడించింది. ఆ తర్వాత కొద్ది సేపటికే, అశ్విని విష్ణోయ్ 65 కిలోల బరువు విభాగంలో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముఖయ్యో ర ఖిమ్జోనోవాపై నిర్ణయాత్మక విజయంతో రెండవ బంగారు పతకాన్ని జోడించింది.



57 కిలోల ఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన మధ్ధియా ఉస్మానోవా చేతిలో ఒక పాయింట్ తేడాతో ఓడిపోయిన తర్వాత రజతం సాధించిన మోనితో భారతదేశం బలమైన ప్రదర్శన కొనసాగింది. 73 కిలోల విభాగంలో, చైనాకు చెందిన వెంజిన్ క్యూ చేతిలో ఓటమితో ముగిసిన పట్టుదల ప్రచారం తర్వాత కాజల్ కూడా రజతంతో సంతృప్తి చెందింది. కోమల్ వర్మ 49 కిలోల విభాగంలో కాంస్య పతకంతో తన ప్రదర్శనను ముగించింది, తన పతక పోరులో అన్వెలినా బుర్కినాను ఓడించి భారతదేశం యొక్క ఐదవ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆ ఊపు ఇప్పటి వరకు కొనసాగింది. భారత్‌కే చెందిన యషిత 61 కిలోల విభాగంలో ఫైనల్‌కు చేరుకుంది. సాంకేతిక ఆధిపత్యం ద్వారా ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ అమెరికాకు చెందిన తైనా ఫెర్నాండెజ్ చేతిలో ఓడిపోయింది. కానీ ప్రశంసనీయమైన రజతం సాధించింది. 69 కిలోల కాంస్య పతక పోటీలో, మనీషా ఉక్రెయిన్‌కు చెందిన సోలోమియా పెట్రివ్‌ను ఓడించలేక పోయింది.

# మకావు ఓపెన్‌లో భారత్‌కు డబుల్‌హార్ట్ బ్రేక్

### తరుణ్, లక్ష్యసేన్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** 2025మకావు ఓపెన్ సూపర్ 300లో భారత బ్యాడ్మింటన్‌కు ఇది నిరాశపరిచే రోజు. శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత్ ఆటగాళ్లు మానేపల్లి తరుణ్, లక్ష్య సేన్ ఇద్దరూ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఓటమిపాలై మకావులో టైటిల్ ఆశలకు ముగింపు పలికారు. అంతకుముందు రోజు, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 47వస్థానంలోఉన్న తరుణ్ గంటా 21 నిమిషాల పాటు సాగిన మూడు గేమ్‌ల ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో మలేషియాకు చెందిన జస్టిన్ హోహ్ చేతిలో ఓడిపోయాడు. మొదటి గేమ్‌ను చేజిక్కించుకున్నప్పటికీ, నిర్ణయాత్మక మ్యాచ్‌లో వరుస తప్పిదాల నుండి కోలుకోలేక తరుణ్ చివరికి 21-19, 16-21, 16-21 తేడాతో ఓడిపోయాడు. 23 ఏళ్ల భారతఆటగాడు పటిష్టంగా ఆట ప్రారంభించి తొలి గేమ్‌లో 11-6 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. హోహ్18 పాయింట్లతో తిరిగి సమంచేసినప్పటికీ, తరుణ్‌మంచి ప్రదర్శనతో మొదటి గేమ్‌ను స్పష్టమైన స్ట్రెయిట్ రిటర్న్‌తో ముగించాడు. కానీ మలేషియా ఆటగాడు రెండవ గేమ్‌లో పరిస్థితిని మార్చాడు, తరుణ్ తప్పుగా అంచనా వేసిన షాట్లు, అనవసరమైన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మ్యాచ్‌లో, తరుణ్ మళ్ళీ ప్రారంభంలోనే ముందంజలో ఉన్నాడు కానీ ప్రత్యర్థి ఒత్తిడి తట్టుకోలేకపోయాడు. హోహ్ ఆట మధ్యలో విరామం తర్వాత ముందుకు దూసుకెళ్లి, తెలివైన డ్రాప్ షాట్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఇక టోర్నమెంట్‌లో భారత్ యొక్క అగ్ర ఆశ అయిన లక్ష్య సేన్, ఇండోనేషియాకు చెందిన రైజింగ్ స్టార్ అల్వి ఫర్హాన్ చేతిలో 45 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలో 16-21, 9-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయాడు. ఆరంభం నుంచే ఫర్హాన్ ఆధిపత్యం చెలాయించాడు. మొదటి గేమ్ తర్వాత, ఇండోనేషియా ఆటగాడు రెండవ గేమ్‌తో ఓడిపోయినా, భారత ఆటగాడు లక్ష్యసేన్‌కు ఊపును పెంచుకునే అవకాశం ఇవ్వకపోవడంతో చివరకు ఓటమి తప్పలేదు. ఈ విధంగా తరుణ్, లక్ష్య ఇద్దరూ ఓటమి పాలవడంతో, మకావు ఓపెన్ 2025లో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ ప్రచారం సెమీఫైనల్ దశలో ముగిసింది.



## స్టార్ కంటెండర్ ఫైనల్స్‌కు

# మనుష్-దియా

### మహిళల డబుల్స్ మనికా- స్వస్తిక ఓటమి

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిటి స్టార్ కంటెండర్ ఫోజ్ డో ఇగువాకు 2025లో భారతదేశం టేబుల్ టెన్నిస్ చరిత్ర సృష్టించింది. భారతీయ డబుల్స్ జోడీ ఫైనల్స్‌కు చేరుకోవడం ఒక మైలురాయిగా నిలిచింది. బ్రెజిల్‌లో శనివారం జరిగిన ఈవెంట్‌లో భారత ఆటగాళ్ళు మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల డబుల్స్ రెండింటిలోనూ ఫైనల్స్‌కు చేరుకోవడం ఇదే మొదటిసారి. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ నంబర్ 10, డ్రాలో మొదటి సీడ్‌గా నిలిచిన మనుష్ షా-దియా చిటాలే మంచి సమన్వయాన్ని ప్రదర్శించారు. వారు సెమీఫైనల్లో చిలీకి చెందిన నాల్గవ సీడ్‌జంట నికోలస్‌బుర్గోస్-పౌలినా వేగాను 3-0 తేడాతో ఓడించారు (11-7, 11-2, 11-7). అంతకుముందు, వారు ప్రారంభ రౌండ్‌లో బై పొందారు. క్వార్టర్ ఫైనల్స్‌లో చిలీకి చెందిన గుస్తావో గోమెజ-డానియేలా ఒర్టెగాలను ఓడించారు. ఇక పురుషుల డబుల్స్‌లో, టాప్ సీడ్ భారత జంట మానవ్ ఠక్కర్-మనుష్ షా (ప్రపంచ 10వ ర్యాంక్) ఫైనల్‌కు చేరుకున్నారు. 16వ రౌండ్‌లో జపాన్‌కు చెందిన క్వాలిఫయర్లు సతోషి ఐడా-మిజుకి ఓయికావాపై 3-1 తేడాతో విజయం సాధించి, ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఫ్లోరియన్ బౌర్రస్సాడ్-లిలియన్ బార్డెట్‌పై 3-2 తేడాతో విజయం సాధించారు. సెమీఫైనల్లో, వారు చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ యాన్‌చెంగ్-కువో గువాన్‌హోంగ్‌లను ఐదు గేమ్‌ల హోరాహోరీ పోరులో (5-11, 11-9, 11-6, 8-11, 11-5) ఓడించారు. కాగా మహిళల డబుల్స్‌లో మానికా బాత్రా-స్వస్తిక ఘోష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు కానీ దక్షి ణ కొరియాకు చెందిన జూ చియోన్‌హుయ్-లీ యున్‌హ్యే చేతిలో ఓడిపోయారు. కాగా ఈ స్టార్ కంటెండర్ టోర్నీలో భారత్ సింగిల్స్ ప్రచారం ఇంకా కొనసాగుతోంది. మహిళల సింగిల్స్‌లో మానికా బాత్రా 16వ రౌండ్‌కు చేరుకోగా, పురుషుల సింగిల్స్ డ్రాలో హర్మీత్ దేశాయ్, మనుష్ షా కూడా 16వ రౌండ్‌లోకి ప్రవేశించారు.

# వరల్డ్ ఛాంపియన్‌షిప్: భారత్ టెన్నిస్ జట్లకు అర్హత

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026లో భారత టేబుల్ టెన్నిస్ జట్లుకు చోటు లభించింది. నేపాల్‌లోని ఖాట్మండులో శనివారం జరిగిన 2025 దక్షిణాసియా ప్రాంతీయ ఛాంపియన్‌షిప్‌లలో ఆధిపత్య ప్రదర్శనలు ఇచ్చిన తర్వాత భారత పురుషులు, మహిళల టేబుల్ టెన్నిస్ జట్లు లండన్‌లో జరిగే 2026 ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లకు (డబ్ల్యూటిటిసి) అర్హత సాధించాయి. ఐదు దేశాల రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో పోటీ పడిన రెండు భారత జట్లు అజేయంగా నిలిచాయి. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ మరియు మాల్దీవులపై 3-0 తేడాతో ఒకేలాంటి విజయాలను నమోదు చేసి, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచాయి. డబ్ల్యూటిటిసి కోసం ఏకైక దక్షిణాసియా కోటాను కైవసం చేసుకున్నాయి. ఆకాష్‌పాల్, రోనిత్ భంజా, అనిర్బన్ ఘోష్, అభినంద్ ప్రధివాధి, మరియు దివ్యాన్ష్ శ్రీవాస్తవలతో కూడిన భారత పురుషుల జట్టు గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా వదులుకోకుండా 4 టైలలోనూ ఆధిపత్యం చెలాయించింది.



ప్రతి మ్యాచ్ 3-0 స్కోరుతో ముగిసింది, ఇది జట్టు యొక్క సాంకేతిక పదును మరియు వ్యూహాత్మక నియంత్రణను ప్రతిబింబిస్తుంది. అలాగే మహిళల జట్టు ఆధిపత్యాన్ని ప్రతిబింబించింది. కృత్వికా సిన్హా, సెలీనా సెల్వకుమార్, తనీషా కోటేచా, సయాలి వాని మరియు సిండ్రెలా దాస్ లతో కూడిన భారత్ మహిళల జట్టు కూడా అదే ప్రత్యర్థులపై 3-0 తేడాతో క్లీన్ విజయాలు సాధించారు. ఆ జట్టు మ్యాచ్‌లలో స్థిరమైన ఫామ్ మరియు అనుకూలతను ప్రదర్శించింది.


# ట్రంప్‌ను నమ్మొద్దు.. భారత్ ఆర్థిక వ్యవస్థ ఓకే: ఎఐ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** భారత్‌ది డెడ్ ఎకానమీ అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలను ఆయన సొంత దేశంలోనే అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ (ఎఐ) ప్లాట్‌ఫామ్‌లు ఖండించాయి. భారత ఆర్థిక వ్యవస్థ నిర్జీవంగా లేదని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా ఉందని స్పష్టం చేశాయి. భారత దిగుమతులపై 25 శాతం భారీ సుంకం (టారిఫ్) విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన ఐదు ప్రముఖ ఏఐ ప్లాట్‌ఫామ్‌లైన చాట్‌జీపీటీ, గ్రోక్, జెమిని, మెటా ఎఐ, కోపైలట్‌లను భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ప్రశ్నించింది. దీనికి అవన్నీ ఏకగ్రీవంగా లేదు అనే సమాధానం ఇచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థ చచ్చి పోలేదు, చాలా చురుగ్గా, ప్రతిష్ఠాత్మకంగా ఉంది అని చాట్‌జీపీటీ చెప్పగా, అసలు ఆ మాటే నిజం కాదు, దానికి పూర్తి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి అని కోపైలట్ తేల్చి చెప్పింది. భారత ఆర్థిక వ్యవస్థ పతనం కాలేదు. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉంది అని గ్రోక్ తెలిపింది. భారత ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధితో దూసుకెళ్తోంది అని జెమిని అంది. అలాగే మెటా ఏఐ కూడా భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ఇది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటి అని చెప్పింది. ఇలా అమెరికన్ ఎఐ ప్లాట్‌ఫామ్‌లన్నీ కూడా ఒకే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ మాటలు అబద్ధమని తేల్చేశాయి.




# టెస్లాకు రూ.2,100 కోట్ల ఫైన్

**వాషింగ్టన్, ఆగస్టు 2:** అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ సంస్థ టెస్లాకు భారీ జరిమానా పడింది. 2019 నాటి రోడ్డు ప్రమాదం కేసులో టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ తప్పిదమే ప్రమాదానికి కారణమని ఫ్లోరిడా కోర్టు నిర్ధరించింది. దీంతో బాధితులకు 242 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో దాదాపు రూ.2,100కోట్లు) చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. నాటి ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా.. మరో వ్యక్తి గాయపడ్డారు. 2019లో ఫ్లోరిడాలోని కీ లార్గోలో ఈ ఘటన చోటు చేసుకుంది. జార్జ్ మెక్‌గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళ్తూ అధునాతన ఆటోపైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యలో తన మొబైల్ ఫోన్ కారులో కింద పడిపోయింది. ఎలాగూ కారు ఆటోపైలట్ మోడ్‌లోనే ఉందని భావించిన జార్జ్.. కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో కారు అదుపుతప్పి పక్కనే పార్క్ చేసి ఉన్న ఓ కారును ఢీకొట్టి ఇద్దరు వ్యక్తుల పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద తీవ్రతకు యువతి మృతదేహం 75 అడుగుల దూరంలో ఎగిరిపడింది. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుదీర్ఘవిచారణ తర్వాత తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెలువరించింది. ఈ ప్రమాదానికి గానూ బాధితుల కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆటోపైలట్ వ్యవస్థ తప్పిదం కూడా ప్రమాదానికి ఓ కారణమేనని గుర్తించిన కోర్టు.. ఇందుకు గానూ పరిహారంలో మూడోవంతు అంటే దాదాపు 242 మిలియన్ డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని ఆదేశించింది. మిగతా మొత్తం సదరు వాహనడ్రైవర్ ఇవ్వాలని స్పష్టం చేసింది. అయితే, ఈతీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా తెలిపింది.




# స్వదేశీ జెట్ ఇంజిన్ల తయారీపై జొమాటో ఆసక్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో వ్యవస్థాపకుడు, సిఇఒ దీపిందర్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మద్దతిస్తున్న ఏవియేషన్ స్టార్టప్ ఎల్ఎటి ఏరోస్పేస్ భారత్‌లో సొంత గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ను నిర్మించేందుకు సిద్ధమవుతోందని చెప్పారు. బెంగళూరులో ఒక ప్రొపల్షన్ రీసెర్చ్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో టర్బైన్లు, రోటర్లు, కంట్రోల్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేయడంలో అనుభవం ఉన్న వారికోసం అన్వేషిస్తున్నట్లు దీపిందర్ గోయల్ తన లింక్డ్ఇన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మేడ్-ఇన్-ఇండియా గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ను నిర్మించాలని కంపెనీ లక్ష్యంగా ఉంది. మన ఏరో స్పేస్ రంగంలో కీలక మార్పులకు తాను సిద్ధంగా ఉన్నట్లు దీపిందర్ గోయల్ అన్నారు. స్వదేశీ గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ల తయారీలో భారతీయ ఇంజినీర్లకు పూర్తిగా స్వేచ్ఛ ఇస్తామని, ఒకవేళ విఫలమైనప్పటికీ, వారికి తిరిగి అవకాశాలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇంజినీర్లకు తగిన ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని గోయల్ వెల్లడించారు. గతంలో భారత్ స్వదేశీ గ్యాస్ టర్బైన్ ఇంజిన్ నిర్మించేందుకు ప్రయత్నించిందని, అయితే ఎల్ఎటి మళ్లీ దానికోసం ముందుకొచ్చింది. ఎల్ఎటి ఏరోస్పేస్ పరిశోధనా కేంద్రం దహన, టర్బోమెషినరీ, థర్మల్ సిస్టమ్‌లు, మెటీరియల్స్‌తో కూడిన ప్రయోగశాలలతో ఏర్పాటైంది. ఇక్కడ ఇంజినీర్లు అవసరమైన ఆవిష్కరణలకు వీలు కల్పిస్తుందని దీపిందర్ గోయల్ వివరించారు. కంపెనీ చేపట్టే పరిశోధనలకు ఏ వ్యాపార సంబంధిత వ్యక్తులూ నాయకత్వం వహించరని, ఇంజినీర్ల చేతుల్లోనే వీటి నిర్వహణ ఉంటుందని గోయల్ స్పష్టం చేశారు. కాగా, ఇది వరకు 1986లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రారంభించిన కావేరీ ఇంజిన్ ప్రోగ్రామ్, భారత లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్ కోసం స్వదేశీ జెట్ ఇంజిన్‌ను అభివృద్ధికి పనిచేసింది. సాంకేతిక సవాళ్లు, ఆలస్యం వల్ల ఇది పూర్తవలేదు.




# మెటా తీరుతో ఇతర కంపెనీలు నాశనం

**వాషింగ్టన్, ఆగస్టు 2:** కృత్రిమ మేధ (ఎఐ) విభాగంలో కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రపంచవ్యాప్తంగా టాలెంట్ హంటింగ్ అనూహ్య స్థాయికి చేరుకుంది. ఓపెన్ఎఐ అగ్ర నిపుణులను ఆకర్షించడానికి మెటా 100 మిలియన్ డాలర్ల అంటే సుమారు రూ.870 కోట్లు బోనస్‌ను సైతం ఆఫర్ చేస్తున్న తరుణంలో ఆంత్రోపిక్ సిఇఒ డారియో అమోడీ తన ఉద్యోగులకు పంపిన అంతర్గత ఇ-మెయిల్ వైరల్‌గా మారింది. మెటా వంటి పోటీదారుల నుంచి వచ్చే వేతన ఆఫర్లు కంపెనీల సంస్కృతిని నాశనం చేస్తాయని అంతర్గత ఇ-మెయిల్‌లో అమోడీ తెలిపారు. ఇతర కంపెనీలు ఆఫర్ చేసే ఆర్థిక ప్రోత్సాహకాల కంటే ఆంత్రోపిక్ తన మిషన్ పట్ల నిబద్ధతగా వ్యవహరించాలని ఆయన ఉద్యోగులను కోరారు. మెటా అసాధ్యాన్ని సాధ్యం చేయాలనే తప్పుడు ఆలోచనతో ఉందన్నారు. మెటా తీరు ఇతర కంపెనీల సంస్కృతిని నాశనం చేసేలా ఉందని అంతర్గత ఇ-మెయిల్‌లో అమోడీ తెలిపారు. ఆంత్రోపిక్ ఉద్యోగులకు వేతన ఆఫర్ల కంటే కంపెనీ మిషన్ ప్రధానమని చెప్పారు. మెటా ఆఫర్ చేస్తున్న ప్యాకేజీల కారణంగా సంస్థాగత సమగ్రతను కాపాడుకుంటూ కీలక ప్రతిభావంతులను నిలుపుకోవడంపై పరిశ్రమలో ఇతర కంపెనీలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఎజిఐ)ను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ (ఎంఎస్ఎల్) అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ ఇప్పటికే రీసెర్చ్‌ను అభివృద్ధి చేస్తాయని చెప్పారు. ఎంఎస్ఎల్ కింద కొత్త ల్యాబ్ తదుపరి తరం లార్జ్ ల్యాంగ్వేజ్ మోడళ్ల నిర్మాణంపై దృష్టిపెడుతుందని తెలిపారు.



# వాణిజ్యం

# రష్యా నుంచి భారత్‌కు చమురు కొనుగోళ్లకు నో బ్రేక్!

**ముంబై, ఆగస్టు 2:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో రష్యా నుంచి భారత్ ఇంధనాన్ని కొనుగోలు చేయడం లేదంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం లేదని తెలిసిందని, ఇది మంచి నిర్ణయమని అన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఆ వార్తలను తోసిపుచ్చాయి. భారత చమురు శుద్ధి సంస్థలు రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ఇంధన దిగుమతులు మార్కెట్ డైనమిక్స్, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జరుగుతున్నాయని పునరుద్ఘాటించాయి. భారత చమురు సంస్థలు రష్యన్ దిగుమతులను నిలిపివేసినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశాయి. కాగా, ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద మొత్తంలో చౌక ధరకు చమురు కొనుగోలు చేస్తోంది. దీనిపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. మాస్కోతో వ్యాపారం చేస్తోందన్న కారణం చూపుతూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ .. భారత్‌పై పెనాల్టీలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను దేశీయ సంస్థలు నిలిపివేశాయంటూ వార్తలు వస్తున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందు స్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి భారత్‌కు చెందిన ప్రభుత్వ చమురు శుద్ధి సంస్థలు గత వారం రోజులుగా మాస్కో నుంచి చమురు దిగుమతులను నిలిపి వేసినట్లు ప్రచారం జరుగుతోంది.



# మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తి దేశంగా భారత్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** భారతదేశం జపాన్‌ను అధిగమించింది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తిదారుగా అవతరించింది భారత్. అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ నుంచి డేటాను కేంద్ర ఇంధన శాఖ మంత్రి ప్రస్తావించాడు. భారతదేశం ఇప్పటి వరకు 1,08,494 గిగావాట్ గంటల (జిడబ్ల్యుహెచ్) సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని, జపాన్ 96,459 జిడబ్ల్యుహెచ్ సౌరశక్తినిమాత్రమే ఉత్పత్తి చేసిందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచ క్లీన్ ఎనర్జీ విప్లవానికి నాయకత్వం వహిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవడానికి భారత్ బహుముఖ విధానంతో పనిచేస్తున్నందున ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ దిశ లో భారతదేశం సాధించిన పురోగతి ఇంధన భద్రతను పెంచడమే కాకుండా ప్రపంచ వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఒక బలమైన అడుగుగా కూడా నిరూపితమైందన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ 2024 డేటా ప్రకారం, సౌర పివి సామర్థ్య వృద్ధిలో చైనా ముందుంది. ఇది 2023లో 260 గిగావాట్లను ఉత్పత్తి చేసింది. ఇది మునుపటి సంవత్సరం కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. చైనా 14వ పునరుత్పాదక ఇంధన ప్రణాళిక 2022లో అమలు చేయడానికి ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.